సంపుటి : 78 సంచిక : 43 పుటలు : 52

# జాగృతి


కలి 5128 - శ్రీ పరాభవ ఆషాఢ బహుళ ద్వాదశి

10-16 ఆగస్ట్ 2026

వెల : ₹20/-



# మాదక ద్రవ్యాలపై సమరం




## భారత్‌పై మెటా కుట్ర




జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.



# మన సరస్వతి మన ఇంటికి

లండన్‌లోని ప్రసిద్ధ బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరిచిన 11వ శతాబ్దానికి చెందిన శ్రీ సరస్వతీ దేవి చారిత్రాత్మక విగ్రహాన్ని తిరిగి భారతదేశానికి తీసుకు రావడానికి హరియాణా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని స్వదేశానికి తీసుకురావడం కోసం కేంద్రప్రభుత్వం నుండి సహకారాన్ని కూడా కోరింది. ఈ నేపథ్యంలో హరియాణా సరస్వతీ హెరిటేజ్ డెవలప్‌మెంట్ బోర్డు మధ్యప్రదేశ్, హరియాణా ప్రభుత్వాల మధ్య పాలనాపరమైన సమన్వయం కూడా చేస్తోంది.

హరియాణా సరస్వతి హెరిటేజ్ డెవలప్‌మెంట్ బోర్డు డిప్యూటీ ఛైర్మన్ ధుమ్మన్ సింగ్ కిర్మిచ్ దీనిని భారతీయ సంస్కృతి, విశ్వాసం, సరస్వతి నాగరికతల అమూల్య వారసత్వంగా అభివర్ణించారు. ఈ విగ్రహం మధ్యప్రదేశ్‌లోని ధార్ ప్రాంతంలో ఉన్న చారిత్రాత్మక భోజ్‌శాల ఆలయానికి (వాగ్దేవి ఆలయం) చెందిందని డిప్యూటీ ఛైర్మన్ ధుమ్మన్ సింగ్ కిర్మిచ్ తెలిపారు. బ్రిటిష్ పాలనా కాలంలో (సుమారు 1886-1891 ప్రాంతంలో) ఆంగ్లేయ అధికారులు దీనిని భారతదేశం నుండి ఇంగ్లాండ్‌కు తరలించారు. ఇటీవలే మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన ఇండోర్ బెంచ్, భోజ్‌శాల ప్రాంగణాన్ని ప్రాచీన వాగ్దేవి ఆలయంగా గుర్తిస్తూ హిందూ సమాజానికి పూజలు చేసుకునే హక్కును కల్పిస్తూ చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఈ కోర్టు తీర్పు తర్వాత ఈ దివ్య విగ్రహాన్ని తిరిగి భారత్‌కు తీసుకురావాలనే డిమాండ్ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ విగ్రహం పరమార రాజవంశం కాలానికి (11వ శతాబ్దం) చెందినది. దీనిపై సంస్కృతం, దేవనాగరి లిపిలో అరుదైన శాసనాలు చెక్కి ఉన్నాయి. ఒకవేళ ఈ విగ్రహం భారత్‌కు తిరిగి వస్తే, ఈ శాసనాలపై లోతైన పరిశోధనలు జరుగుతాయి. దీనివల్ల సరస్వతి నది, మన ప్రాచీన నాగరికత గురించిన కొత్త చారిత్రక నిజాలు వెలుగులోకి రానున్నాయి. భారత్‌కి తీసుకొచ్చిన తర్వాత హరియాణాలోని సరస్వతీ మ్యూజియంలో దీనిని భద్రపరుస్తారు.

సరస్వతి బోర్డు కథనం ప్రకారం, సరస్వతి నది తీరాలలో వర్ధిల్లిన నాగరికత భారతీయ చరిత్రకు, జ్ఞానపరంపరకు పునాదిగా పరిగణిస్తారు. అటువంటి పరిస్థితిలో, ఇలాంటి అమూల్యమైన సాంస్కృతిక వారసత్వ సంపదను తిరిగి మన దేశానికి తీసుకురావడం మన జాతీయ, సాంస్కృతిక బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోంది.



భారతీయ సాహితీ ద్రష్ట

భండారు సదాశివరావుగారి స్మారక

# కథల పోటీ-2026

జాగృతి వారపత్రిక దీపావళి సందర్భంగా ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు గారి స్మారక 'కథల పోటీ' నిర్వహిస్తున్నది. రచయితలకు ఆహ్వానం..



**ప్రథమ బహుమతి : రూ. 12000/-**

**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**

**తృతీయ బహుమతి : రూ. 5000/-**

## నిబంధనలు :

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు పారితోషికం ఉంటుంది.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే.
8. ఈ కథలను దీపావళి సంచిక నుంచి వరుసగా ప్రచురిస్తాం.

**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 22 ఆగస్టు, 2026**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,**
**వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

**చందాదారులకి గమనిక**

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

డెబ్బై తొమ్మిదవ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న భారత్ ఎదుట ఇంకా ఎన్నో సవాళ్లు. ప్రత్యక్ష వలసవాదం నుంచి ముక్తమైనా మానసికంగా కాలేదన్న విషయాన్ని పౌరులు గుర్తిస్తున్న కాలమిది. గత జూలై 20న పార్లమెంటు ముట్టడి పేరిట జరిగిన పరిణామాలనేపథ్యంలో ఈ జాతి తన అస్తిత్వంగురించి కొన్ని ప్రశ్నలు వేసుకొంటున్న సందర్భమిది. సుమారు 8 దశాబ్దాల కాలంపాటు నినాదాల ఇజాలనే ఎండమావుల వెంట పరుగులు తీసి, నేటి వేడి నడుమ నిలబడి ఎందుకిలా అయింది? దేశభవితవ్యం ఎలా ఉంటుంది? తిలక్‌జీ,గాంధీజీ,నేతాజీల కలలు కల్లలుగా ఎందుకు చితికిపోతున్నాయి? అని పలువురు ప్రశ్నించుకుంటున్న సమయమిది.

ప్రపంచంలో ఏ దేశమైన తమ జాతీయభావాన్ని పెంపొందించుకొనేందుకే ప్రాధాన్యతనిస్తుంది. కానీ మన దేశంలో మాత్రం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి 50ఏళ్లలో పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉంది. నేటి పరిస్థితులకు అదే కారణం. తాను ఇంగ్లీష్‌వాడినని గర్వంగా చెప్పుకొన్న తొలి ప్రధాని నెహ్రూ జాతీయ పునరుజ్జీవనం పేరుతో అమలుచేసిన విధానాలలో చాలావరకు మనను మానసికంగా తిరిగి వలస భావనకు గురిచేయడానికి ఉద్దేశించినవే. అందుకే, నెహ్రూ విధానాలన్నీ బ్రిటీష్ ప్రభుత్వ పద్ధతులకు కొనసాగింపే అయ్యేది. నేటి పరిస్థితికి ప్రధాన కారణం ఇదే. భారత్ ప్రపంచంలోనే మహోన్నత వారసత్వం కలిగి ఉండి కూడా తమ చరిత్ర, సంప్ర దాయాలపట్ల సిగ్గుపడే విధంగా విద్యార్థులు తయారవడమే సమస్యలకు కారణం. ఇది జాతీయవాదులకు ఎంతో బాధ కలిగిస్తున్నది.

అంటే,స్వాతంత్ర్యంవచ్చి ఇంతకాలంగడిచినా భారత్‌లో వలసవాద బ్రిటీష్ ప్రభావం ఇంకా అంతరించిపోలేదు. వలసవాద శాశ్వత ప్రభావానికి ఆంగ్ల భాషయే కారణమన్నది నిర్వివాదం. వలసవాదాన్ని మనం తరచుగా బ్రిటీష్ వారితోనే ముడిపెట్టి చూసినా, ఇది రెండు రకాలు. ఒకటి ప్రత్యక్షవలసవాదం. దానిని అంతచేశాం. రెండవది పైకి కనపడకుండా చాపకింద నీరులా సాగే వ్యవహారం. ఇది ప్రమాద కరమైనది. ఎందుకంటే, ఇది మన బుద్ధిని, ఐకమత్యాన్ని సర్వనాశనం చేస్తుంది. అది మనకు అనుభవమే.

**శాలివాహన 1948 శ్రీ పరాభవ ఆషాఢ బహుళ ద్వాదశి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం

**మాదక ద్రవ్యాలపై సమరం**

కొత్త ధారావాహిక నవల

(1) **ఏ వెలుగులకీ ప్రస్థానం ?**

– గన్నవరపు నరసింహ మూర్తి



20లో

జాగృతి పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు శ్రేయోభిలాషులకు
**స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు**



# జాగృతి

## సంపాదకీయం

# భావదాస్యాన్ని తుదముట్టిద్దాం

భారత్‌తోపాటు స్వాతంత్ర్యం పొందిన ఇతర దేశాలు వలసవాదాన్ని తుద ముట్టించడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం చూశాం. అయితే మన దేశంలో దీని విలువను మన నాయకులు గుర్తించలేదు. స్వధర్మం ప్రాముఖ్యత తెలియక అది దేశ ప్రగతిని నిరోధిస్తుందని, దానిని అడ్డుకున్నవారు ఒకరకం. ఇక, రెండవ రకంవారు సమస్యలను పరిష్కరించే శక్తి దేశానికి లేదనుకుని ప్రత్యామ్నాయంగా వివిధ కాపిటలిస్టు, కమ్యూనిస్టు దేశాలలో ఇక్కడ సమస్యలకు పరిష్కారం వెతికారు. ఈ రెండు పంథాలూ విధ్వంసకరమైనవే అయినా అవి దేశీయమైనవి. ఇక మూడవ వర్గం మన దేశానికి అసలైన శత్రువు,అదే భారత్‌ను ముక్కలు చేయాలన్న దళం. వీరు కాంగ్రెస్ పాలనాకాలంలో విద్యారంగంలోకి ప్రవేశించి మూడు నాలుగు తరాల యువత బుర్రలను విషంతో నింపారు. ఇటీవల నీట్ పేపర్ లీక్‌ను సాకుగా తీసుకుని, దేశానికి వ్యతిరేకంగా నినాదాలతో నిరసన చేసిన బొద్దింకలు ఆ తానులో ముక్కలే.

అందుకే, ఒక స్వాతంత్ర్య జాతిగా భారతదేశం మొదటి అర్ధశతాబ్దం రెండు ప్రముఖమైన వైఫల్యాలకు ప్రతీకగా నిలిచింది. ఒకటి, భారత్ అనే భావనను ఒక జాతిగా నిర్వహించలేకపోవడం, రెండవది, విద్యారంగంలోను, మేధో జీవితంలో జాతీయ సంస్థలను రూపొందించకపోవడం. మరో విధంగా చెప్పాలంటే ఈ దేశ చరిత్ర సంస్కృతులలో పాతుకొన్నదే జాతీయభావం అనే వారి అవగాహనా వైఫల్యం. దీని ఫలితంగా ఈ రోజున జాతి వ్యతిరేక శక్తులు దేశభద్రతకు తీవ్ర విఘాతం కలిగిస్తూ స్వైరవిహారం చేస్తున్నాయి. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలన నిర్వాకం ఇది.


మతం కన్నా, మార్క్సిజం కన్నా తమకు జన్మనిచ్చిన ఈ దేశం మిన్న అన్న సత్యాన్ని నేర్వకపోతే ఎన్ని స్వాతంత్ర్య దినోత్సవాలొచ్చినా, ఎన్ని ఆర్డినెన్స్‌లొచ్చినా అలాంటివారంతా భారతీయ జీవనదిలో విషనాగులుగానే మిగిలిపోతారు. ఇది వారికి, ఈ దేశానికి మంచిది కాదు.

ఈ వలస రాజరికపు వారసులు తమ పూర్వ ప్రభువులకు ఎంతగా అంకితమై పోయారంటే... ఏ విషయమైనా, భారతీయమైనది, అందులోను హిందువులదైతే చాలు బద్ధవైరంతో భగ్గుమంటారు. ఆర్కియాలజీ, తదితర శాస్త్రాలలో సాధించిన వైజ్ఞానిక ఆవిష్కరణలు నిజాలను బయటపెట్టినప్పుడైనా తెలివితెచ్చుకొని గతకాలపు వలసపాలకుల హేయమైన రాతలను, అసత్యాలను వదలివేయాలి. కానీ అలా జరగలేదు. ఫలితంగా ఒక గొప్ప జాతికి ఎంతమాత్రం తగనిది, అబద్ధాల పుట్ట అయిన ఆ దిక్కుమాలిన చరిత్ర అలాగే ఉండిపోయింది. గత దశాబ్దకాలంలో దీనిని సరిదిద్దే ప్రయత్నం ప్రారంభం కావడం ఒక శుభపరిణామం.

ఈ పరిణామాల నేపథ్యంలో మనం అప్రమత్తం కావాలి. నిజానికి, మన దేశంలోని బానిస సంస్కృతిని, బానిస చరిత్రను వదిలించుకొనే యత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న నూతన జాతీయ విద్యావిధానం కూడా అందులో భాగమే. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సమాజం కూడా సహకరిస్తున్నది. అయినప్పటికీ చేయవలసింది ఎంతో ఉంది. కుటుంబాలలో బాల్యం నుండే భారతీయత పట్ల, సంస్కృతి, నాగరికత, మహాపురుషుల పట్ల గౌరవాన్ని, విశ్వాసాన్ని పాదుకొల్పాలి. ఈ గురుతరమైన బాధ్యతను యావత్ సమాజం శీఘ్రాతి శీఘ్రంగా గుర్తించి ఆ దిశవైపు వడివడిగా అడుగులు వేయగలిగినపుడే మన దేశం అమృతకాలాన్ని సార్థకం చేసుకుంటు ప్రపంచానికి శాంతిని అందించగలదు. ★



అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**దారి దొరికింది**

– జి. నరసింహమూర్తి




| | | |
|---|---|---|
| ధర్మబద్ధతే ఆదర్శం (పిలుపు) | - | 12 |
| జోగినీల నిరసనల మధ్య 'లష్కర్' (తెలంగాణ) | - | 14 |
| ఉత్తరాంధ్ర వైభోగం 'భోగాపురం' (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| బహుముఖ యుద్ధాలతో ప్రపంచ వాణిజ్యం.. (అంతర్జాతీయం) | - | 24 |
| నెహ్రూ నిర్వాకాలు (ప్రత్యేక వ్యాసం) | - | 26 |
| యువతకు భరోసాగా బిల్లు (జాతీయం) | - | 28 |
| అల్లూరి పేరుతో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం (గళమెత్తిన గతం) | - | 30 |
| శ్రావణం వెనుక శాస్త్రీయత (మహిళ) | - | 33 |
| దేశ నిర్మాణంలో యువత (యువవాణి) | - | 34 |
| ఇది నాటకం కాదు యుగారంభం (ఆర్ఎస్ఎస్–100) | - | 36 |
| రంగు మార్పుతో నష్టమేంటి? (క్రీడ) | - | 43 |
| తడబడ్డ కృష్ణ మనవడి 'శ్రీనివాస మంగాపురం' (సినిమా) | - | 50 |



యావత్ మానవాళిని, ముఖ్యంగా యువతను పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిపై ప్రధాని నరేంద్ర మోదీ సమర శంఖం పూరించారు. ఆగస్టు 2వ తేదీన దేశవ్యాప్తంగా 100 వారాల ఉద్యమానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ప్రత్యక్షంగా కోటి మందికిపై యువతీయువకులను, పలు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి ఏకకాలంలో ప్రసంగిం చారు. సమాజానికి చీడపురుగు లాంటి మాదకద్రవ్యాల బారిన యువత పడకుండా చూడాల్సిన బాధ్యతను వారి తల్లిదండ్రులు, గురువులతో పాటుగా సామాజిక, ఆధ్యాత్మిక, ప్రభుత్వేతర సంస్థలకు అప్పగించారు. ఆ దిశగా యువతకు అవగాహన కల్పించి, 2047నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ఆరోగ్యకరమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన యువతరాన్ని నిర్మించడంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార, వ్యవహారాలను, కళలను వినియోగించాల్సిన ఆవశ్యకతను ప్రధానంగా ప్రస్తావించారు. సమష్టి కార్యాచరణ ద్వారా మాదక ద్రవ్య రహిత భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రధాని పూర్తి ప్రసంగ పాఠం జాగృతి పాఠకుల కోసం.

# మాదక ద్రవ్యా

నమస్తే!

నేడు ఒక గొప్పదైన, కీలకమైన సంకల్పం చేయడానికి దేశ పౌరులమైన మనమందరం ఏకమయ్యాము. 28 వేలకు పైగా ప్రాంతాల నుండి ఇందులో పాల్గొంటున్న కోటి మంది యువతకు, ఈ కార్యక్రమంతో మమేకమైన గౌరవనీయులైన సాధువులు, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్య మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు నేను ప్రత్యేక స్వాగతం పలుకుతున్నాను. ఈ రోజు మనం ఒక సంకల్పంతో ఉద్యమంలా చేపడుతున్న ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం, సమాజానికీ సంబంధించినది కాదు. ఇది యావత్ దేశానికి సంబంధించినది.

**నా యువ మిత్రులారా!**

వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌లో భాగంగా, 'నశా ముక్త్ యువ' (మాదకద్రవ్య రహిత యువత) అనే ఈ ఉద్యమనామమే దీని సంకల్పాన్ని స్పష్టం చేస్తోంది. నేడు, దేశం వికసిత్ భారత్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తరుణంలో, దేశ యువత శారీర కంగానూ, మానసికంగానూ ఆరోగ్యంగా ఉండాలి. వారిలో ఆత్మవిశ్వాసం తొణకిసలాడాలి. మాదక ద్రవ్యాలు వంటి ప్రాణాంతక వ్యసనాలకు యువత దూరంగా ఉండటం చాలా ముఖ్యం. ఇదే ఈ ఉద్యమం లక్ష్యం. అందువల్ల, మాదకద్రవ్యాలు, వాటి వల్ల కలిగే అనర్థాలను యువత అర్థం చేసుకోవాలి. వాటి పట్ల పూర్తి అవగాహనతో ఉండాలి. వాటికి దూరంగా యువత ఉండేలా చూడాలని మన మందరం సంకల్పించుకోవాలి. ఈ ఉద్యమంలో నశా ముక్త్ యువ ప్రధాన పాత్ర పోషిస్తుంది.

గత ఏడాది కాశీ పవిత్రభూమి నుండి ఈ ఉద్యమం ప్రయోగాత్మకంగా ప్రారంభం కావడం కాశీ పార్లమెంటు సభ్యునిగా నాకు సంతోషాన్నిస్తోంది. కాబట్టి, ఇది శాస్త్రీయ స్పష్టతతో పాటు ఆధ్యాత్మిక శక్తిని, సాధువుల ఆశీర్వాదాలను, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని తనలో ఇముడ్చుకుంది. ఇది శతాబ్దాలుగా మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని తిరస్కరిస్తూ వస్తున్న సాంస్కృతిక నిబద్ధత స్ఫూర్తిని కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే కోట్లాది పౌరుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా 125కు పైగా ఆధ్యాత్మిక సంస్థలు ఈరోజు మాతో చేతులు కలిపాయి. సామాజిక సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు కూడా ఈ దిశగా సంకల్పం తీసుకున్నాయి.'కాశీ ప్రకటన' ద్వారా సమష్టిగా ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగింది. కాశీలో పుట్టిన సంక్షేమ ఆధారిత ఆలోచన నేడు ఒక జాతీయ ఉద్యమంగా రూపుదిద్దుకోవడాన్ని మనం చూస్తున్నాము. 'నశా ముక్త్ యువ' ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా ప్రారంభమైంది.

కొన్ని పనుల విషయంలో ఒంటరిగా ప్రయత్నిస్తు న్నప్పుడు మనిషి నిరుత్సాహానికి లేదా అలసటకు గురవ్వవచ్చు. ఆ సుదీర్ఘ ప్రయాణాన్ని కొనసాగించే సంకల్పం సన్నగిల్లవచ్చు. కానీ, అదే పని లక్షలాది మంది కలిసి, భుజం భుజం కలిపి సాగించే సామూహిక ఉద్యమంగా మారినప్పుడు, ఒంటరిగా ఏమీ సాధించలేకపోయిన వారు కూడా కొత్త ఉత్సాహంతో ఉత్తేజితులవుతారు. సమష్టి కృషితో గొప్ప శక్తి లభిస్తుంది. నేడు అదే స్ఫూర్తితో సాగుతున్న ఈ ప్రచార ఉద్యమం ప్రతి యువకుడి హృదయాన్ని తాకనుంది. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని కొద్దిసేపటి క్రితమే దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువతీయువకులు ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాలకు దూరంగా జీవించాలని దృఢ నిశ్చయం చేసుకోవడమే కాకుండా, మాదకద్రవ్య రహిత జీవనం గురించిన సందేశాన్ని మీ పాఠశాలలు, కళాశాలలు, సమాజంలో వ్యాప్తి చేయడానికి కూడా వీరు సంకల్పించారు.




# ్యాలపై సమరం

ఈ రోజు తీసుకున్న సంకల్పం వచ్చే 100 వారాల పాటు నిరంతరాయంగా ముందుకు సాగుతుంది. ప్రతి ఆదివారం కళలు, సంస్కృతి, క్రీడలు, ధ్యానం, ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలు జరుగుతాయి. వ్యసన విముక్తికి సంబంధించిన సందేశం కొత్త వ్యక్తులకు చేరుతుంది. వచ్చే 100 ఆదివారాలు మాదకద్రవ్య రహిత భారత్ దిశగా వేసే 100 బలమైన అడుగులుగా నిలుస్తాయి.

నేడు వేలాది పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లక్షలాది మంది 'మై భారత్' (My Bharat) స్వచ్ఛంద కార్యకర్తలు కూడా ఈ రోజు మాతో అనుసంధానమయ్యారు. ఎన్ఎస్ఎస్‌కు చెందిన యువ సభ్యులు కూడా మాతో చేరారు. వివిధ ప్రాంతాలు, విద్యాసంస్థలు, నేపథ్యాలకు చెందిన కోటి మందికి పైగా యువతీయువకులు ఈ రోజు ఏకమయ్యారు. మీరే ఈ గొప్ప ఉద్యమానికి నాయకులు. భారతీయ యువత తమ బాధ్యతల పట్ల ఎంతటి అవగాహన, వివేకం, చిత్తశుద్ధి కలిగి ఉన్నదనే విషయంపై నా నమ్మకాన్ని మీరు మరింత బలపరిచారు. ఈ ఉద్యమానికి సంబంధించి మీ అందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

మీరు భారతదేశపు 'అమృత తరానికి' (Amrit Generation) చెందినవారు. రాబోయే 20–25 ఏళ్లలో, మీరు మీ జీవన గమనాన్ని తీర్చిదిద్దుకోవడమే కాకుండా, 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు దేశాన్ని నడిపిస్తారు. మీరు ఆ (వికసిత్ భారత్) శిఖరాగ్రాన నిలిచి, దాని ఫలాలను పూర్తిగా అనుభవిస్తారు, ఆస్వాదిస్తారు. దేశానికి మీ శక్తిసామర్థ్యాలు, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి, దేశం కోసం, మీ భవిష్యత్తు కోసం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం చాలా ముఖ్యం. మాదకద్రవ్యాల వినియోగం మీ ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. అది యువతను వారి కలల నుంచి క్రమంగా దూరం చేస్తుంది. యువతీయువకులు ప్రదర్శించిన ఒక నాటకాన్ని మనం ఇప్పుడే చూశాము. వారు ఆ నాటకం ద్వారా చాలా తక్కువ సమయంలోనే, అత్యుత్తమ రీతిలో సమస్యను ఎత్తిచూపారు. దానివల్ల తలెత్తిన సంక్షోభాన్ని వివరించారు. సామూహిక కృషితో దానిని అధిగమించడానికి ఒక మార్గాన్ని చూపడం వంటివి చేయగలిగారు. ఆ ప్రదర్శన క్లుప్తంగానే ఉన్నప్పటికీ, “రండి, ఒక నాటకాన్ని చూద్దాం!” అన్న ఆహ్వానానికి అనుగుణంగా అది కేవలం ఒక నాటకం మాత్రమే కాకుండా, అంతకు మించిన గొప్ప సందేశాన్ని మనకు అందించింది. అది మనల్ని చైతన్యపరిచింది. ఆ సవాలు(మాదక ద్రవ్యం)ను ఎదుర్కోవడంలో స్ఫూర్తినిచ్చింది.

ఈ రోజుల్లో యువత స్టార్టప్‌ల ప్రపంచంలో ఆధిపత్యం చెలాయిస్తోంది. కృత్రిమ మేధస్సు(ఏఐ)ను ముందుండి నడిపిస్తోంది. క్రీడల్లో త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేస్తోంది. అంతరిక్ష పరిశోధన నుండి విజ్ఞాన శాస్త్రం వరకు కొత్త మైలురాళ్లను యువత నెలకొల్పడాన్ని మనం చూస్తున్నాం. కానీ మిత్రులారా, ఒక యువకుడు మాదకద్రవ్యాల వ్యసనానికి బలి అయినప్పుడు, నష్టపోయేది కేవలం ఆ వ్యక్తి మాత్రమే కాదు. ఒక కల కనుమరుగవు తుంది. అది అకాల మరణం చెందుతుంది. ఒక కుటుంబం ఓడిపోతుంది. యావత్ కుటుంబం ఛిన్నాభిన్నమైపోతుంది. అంతేకాకుండా అలాంటి వారిని సమాజం ద్వేషిస్తుంది.మత్తుపదార్థం శరీరానికి మాత్రమే హాని చేయదు. అది ఒక తల్లి చిరునవ్వును దూరం చేస్తుంది. ఒక తండ్రి కలలను ఛిద్రం చేస్తుంది. రాఖీ బంధంపై సోదరికున్న ఆశను బలహీనపరుస్తుంది. ఒక తమ్ముడికి ఆదర్శప్రాయుడైన

అన్నను లేకుండా చేస్తుంది. వృద్ధ తల్లిదండ్రులు తమ కళ్లెదుటే తమ సొంత బిడ్డ నెమ్మదిగా తనను తాను కోల్పోవడాన్ని, క్రమంగా క్షీణించి, నశించి పోతుండటాన్ని చూస్తూ ప్రతిరోజూ వేదనతో జీవిస్తారు. కుటుంబాలలో, సమాజంలో ఇలాంటివి జరిగినప్పుడు, దేశం అనివార్యంగా బలహీనపడు తుంది. తత్ఫలితంగా, మన యువతను మాదక ద్రవ్యాల వ్యసనం అనే ఉచ్చులోకి లాగడానికి శత్రు దేశాలు కుట్రలతో శాయశక్తులా ప్రయత్నిస్తాయి. మాదకద్రవ్యాల సరఫరా ద్వారా లాభపడటం, మనదేశం వంటి దేశాన్ని నాశనం చేయడం కూడా వారి ఉగ్రవాద కుట్రలో భాగమే. కాబట్టి, మాదకద్రవ్యాల ఊబిలో చిక్కుకోకుండా మన యువతను మనం కాపాడుకోవాలి.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ మీ సామర్థ్యాన్ని కాపాడుకోవాలి. మాదకద్రవ్యాలు తాత్కాలిక ఉల్లాసాన్ని ఇవ్వవచ్చు, కానీ అవి మీ



వృత్తిని, కుటుంబ జీవితాన్ని అధోగతికి లాగుతాయనే విషయాన్ని మీరు గుర్తుంచుకోవాలి. మాదక ద్రవ్యాలను మనం ఏ విధంగానూ ఆమోదించ కూడదు.

మన సమాజంలో కూడా మాదకద్రవ్యాల వినియోగాన్ని ఎల్లప్పుడూ ఒక దురాచారంగానే పరిగణిస్తూ వచ్చారు. మన సాధువులు, గురువులు దీని పట్ల మనల్ని హెచ్చరించారు. శ్రీ గురుగ్రంథ సాహిబ్‌లో కూడా ఈ విషయాన్ని "జితు పీతై మతి దూరి హెూయి బర్‌లు పవై విచి ఆయీ.. ఆప్‌నా పరాయియా న పఛానాయీ ఖస్‌మహు ధకే ఖాయీ" అని పేర్కొన్నారు. విచక్షణ జ్ఞానాన్ని , బుద్ధిని హరించి, స్వపర భేదాన్ని విస్మరించేలా చేసే మత్తుపదార్థం మనిషిని వినాశనం వైపు నడిపిస్తుంది అని దాని అర్థం.


వ్యసనం నుంచి బైటపడటంలో మన సంస్కృతి మార్గనిర్దేశం చేస్తుంది. దాని నివారణకు హెచ్చరికలను కూడా చేస్తుంది. యోగా, ధ్యాన శక్తితో పాటు సామాజిక మద్దతు, వ్యసనానికి వ్యతిరేకంగా మన అంతర్గత సంకల్పాన్ని బలపరుస్తుంది. అంతేకాకుండా, దానిని అధిగమించడానికి సహాయపడే పునరావాస కేంద్రాల వంటి సౌకర్యాలు కూడా ఈ రోజు మనకు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి, ఒక యువకుడు పొరపాటున మాదకద్రవ్యాల ఊబిలో చిక్కుకున్నంత మాత్రాన, దాని నుంచి బైటపడటానికి అతడికి ఇక ఎలాంటి మార్గాలు లేవని అనుకోరాదు. కుటుంబంలోని ఒకరు వ్యసనానికి బానిసలైతే, సామాజిక ప్రతిష్టను కాపాడుకునే నెపంతో, ఆ విషయాన్ని ఆ కుటుంబం దాచిపెట్టకూడదనే విషయాన్ని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. అలాంటప్పుడు సహాయం చేయగల వారిని సంప్రదించాలి. వారితో మనసు విప్పి మాట్లాడాలి. నిపుణుల సహాయం తీసుకోవాలి. వైద్యపరమైన సహాయంతో మీ బిడ్డ వ్యసనం నుండి బయటపడటానికి ప్రయత్నించండి. పిల్లలు అటువంటి ప్రమాదకరమైన ఊబిలో చిక్కుకోకముందే వారికి అండగా నిలిచేలా, కుటుంబంలో వారితో స్వేచ్ఛగా సంభాషించే ఒక వాతావరణాన్ని మనం పెంపొందించుకోవాలి. కొంచెం శ్రద్ధ వహిస్తే (వ్యసనానికి సంబంధించిన) ఆ మార్పులు మీకే కనిపిస్తాయి. అతడు లేదా ఆమె ఏదో అయోమయంలో ఉన్నట్లు అనిపించడం, కళ్లలోకి సూటిగా చూడకపోవడం, తన గదికే పరిమితం కావడం, అర్ధరాత్రి వేళ ఇంటికి రావడం, ఎక్కువ డబ్బులు అడగడం వంటి ఈ సంకేతాలన్నీ ఏదో తేడాగా ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తాయి.

ఈ సందర్భంగా కళాశాలలు, విశ్వవిద్యాలయా ల్లోని మన ప్రొఫెసర్లకు కూడా నేను ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. అదేమిటంటే.. దయచేసి మీ విద్యార్థులతో సాధారణ పాఠ్యాంశాలతో పాటు, మాదకద్రవ్యాల ముప్పును గురించి చర్చించండి. మీ విద్యా ప్రాంగణాలలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఒక ఉద్యమాన్ని ప్రారంభించండి. మీ ప్రయత్నాలు గణనీయమైన ఫలితాలను ఇవ్వగలవు. మిత్రులారా! మనం గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే–వ్యసనాన్ని జయించిన యువత బలహీనులు కాదు. వ్యసనాన్ని అధిగమించిన వ్యక్తి నిజమైన యోధుడు. సమాజం వారిని గౌరవించాలి, ఆదరించాలి. వారికి మరో అవకాశం ఇవ్వాలి. ఎందుకంటే, ఒక వ్యక్తిని నిర్వచించేది మాదక ద్రవ్యాలతో కూడిన అతడి లేదా ఆమె గతం కాదు. వారి ధైర్యమే వారిని నిర్వచిస్తుంది.

నేడు, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో యువతకు అండగా ప్రభుత్వం నిలిచింది. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాలను విక్రయించేవారిపైనా, వాటిని అక్రమంగా తరలించేవారిపైనా కఠినమైన చర్యలు తీసుకుంటు న్నాము. గతంతో పోలిస్తే అలాంటివారి అరెస్టుల సంఖ్య భారీగా పెరిగింది. వేల కోట్ల రూపాయల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంటు న్నాము. ఇది మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో మా ప్రభుత్వం ఎంత కఠినంగా ఉన్నదీ నిరూపి స్తోంది. ఈ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలన్నీ కలిసి 'మిషన్ మోడ్'లో (ప్రత్యేక కార్యాచరణతో) పరిష్కరిస్తాయనే పూర్తి నమ్మకం నాకు ఉంది. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా, యువశక్తిని కాపాడుకోవడమే కాకుండా, 'వికసిత్ భారత్' నిర్మాణ సంకల్పాన్ని మన దేశ యువత ముందుకు తీసుకువెళుతుందని నేను విశ్వసిస్తున్నాను. నేడు నా కనుల ఎదుట అనేక మంది గొప్ప సాధువులు ఉన్నారు. వారికి నేను దూరం నుండే నమస్కరిస్తున్నాను. ప్రస్తుతం నేను దేశం నలుమూలలా విస్తరించి ఉన్న సామాజిక, ఆధ్యాత్మిక సంస్థలు, ఆధ్యాత్మిక గురువులు, వారికి సంబంధించిన సమూహాలు, యువ భక్తులందరినీ ఉద్దేశించి మాట్లాడుతున్నాను. వచ్చే 100 వారాలలో, ఒక్కో సంస్థ ఒక్కో వారానికి బాధ్యత తీసుకోవాలి. ఆ వారం మొత్తం దేశవ్యాప్తంగా జరిగే కార్యక్రమానికి

**వచ్చే 100 వారాలలో, ఒక్కో సంస్థ ఒక్కో వారానికి బాధ్యత తీసుకోవాలి. ఆ వారం మొత్తం దేశవ్యాప్తంగా జరిగే కార్యక్రమానికి ఆ సంస్థ నాయకత్వం వహిస్తుంది. మిగిలిన వారంతా అందులో భాగస్వాములవుతారు. ఆదివారం జరిగే ఒక భారీ కార్యక్రమంతో ఆ వారపు కార్యక్రమం ముగుస్తుంది. రెండవ వారంలో, మరో సంస్థ, మరొక బృందం వారం పొడవునా కార్యక్రమాలను నిర్వహించి, ఆదివారంనాడు ఒక భారీ కార్యక్రమాన్ని చేపట్టాలి. మన దేశంలోని ఆధ్యాత్మిక, సామాజిక, యువజన సంస్థలు ఒక్కొక్కటి ఒక్కో వారం బాధ్యత తీసుకోవాలి. ఇతర వర్గాలను కూడా కలుపుకొనిపోవాలి. ఆదివారం నాడు సమష్టిగా ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఇలా 100 వారాల పాటు చేసుకుంటూ ముందుకు సాగిన పక్షంలో, దేశవ్యాప్తంగా ఎంతటి భారీ ఉద్యమం ఉద్భవిస్తుందో ఒక్కసారి ఊహించుకోండి.**

ఆ సంస్థ నాయకత్వం వహిస్తుంది. మిగిలిన వారంతా అందులో భాగస్వాములవుతారు. ఆదివారం జరిగే ఒక భారీ కార్యక్రమంతో ఆ వారపు కార్యక్రమం ముగుస్తుంది. రెండవ వారంలో, మరో సంస్థ, మరొక బృందం వారం పొడవునా కార్యక్రమాలను నిర్వహించి, ఆదివారం నాడు ఒక భారీ కార్యక్రమాన్ని చేపట్టాలి. మన దేశంలోని ఆధ్యాత్మిక, సామాజిక, యువజన సంస్థలు ఒక్కొక్కటి ఒక్కో వారం బాధ్యత తీసుకోవాలి. ఇతర వర్గాలను కూడా కలుపుకొని పోవాలి. ఆదివారం నాడు సమష్టిగా ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఇలా 100 వారాల పాటు చేసుకుంటూ ముందుకు సాగిన పక్షంలో, దేశవ్యాప్తంగా ఎంతటి భారీ ఉద్యమం ఉద్భవిస్తుందో ఒక్కసారి ఊహించుకోండి. పవిత్రమైన ఈ కార్యక్రమంలో పాల్గొని, మన అందరినీ ఆశీర్వదించడానికి సమయం కేటాయించిన సాధువులు, ఆచార్యులు, సంస్థల ప్రముఖులకు మరోసారి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు నిజంగా ఒక అద్భుతమైన కార్యాన్ని సాధిస్తున్నారు అని చెప్పడం ద్వారా ఇక్కడ సమావేశమైన కోటి మందికి పైగా యువతను నేను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. 'మై భారత్' (My Bharat)



స్వచ్ఛంద కార్యకర్తలను నేను అభినందిస్తున్నాను. వారు ఏదైనా సాధించాలని సంకల్పిస్తే, దానిని తప్పక పూర్తి చేస్తారు. ఇటీవల నాకు ఈ స్వచ్ఛంద కార్యకర్తలను కలిసే అవకాశం లభించింది. వారు భారతదేశ సరిహద్దు గ్రామాలను సందర్శించి, అక్కడ వారం రోజుల పాటు గడిపారు.ఒకప్పుడు దేశపు "చివరి గ్రామాలు"గా పేరొందిన ఆ ప్రాంతాలు, ఇప్పుడు దేశపు "మొదటి గ్రామాలు"గా గుర్తింపు పొందాయి. వారి అనుభవాలు నిజంగా స్ఫూర్తిదాయకం. అలాంటి కార్యకర్తలు నేడు ఇంత భారీ కార్యక్రమాన్ని నిర్వహించగలగడం, దేశం పట్ల వారికి ఉన్న అంకితభావానికి, బాధ్యతాయుతమైన సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుంది. వారికి నా అభినందనలు, ప్రశంసలు తెలియజేస్తున్నాను. మీ సామూహిక కృషి ద్వారా ఈ ఉద్యమం ప్రతి ఇంటికీ చేరుతుందని, ప్రతి యువకుని హృదయాన్ని తాకుతుందని, అదే సమయంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులకు పెను భయంగా మారుతుందనే పూర్తి విశ్వాసం నాకు ఉంది. మనం కలిసి ముందుకు సాగుదాం. మీ అందరికీ శుభాకాంక్షలు! ధన్యవాదాలు!

**– జాగృతి డెస్క్**




కీర్తిశేషులు శ్రీ వడ్లమూడి రామమోహనరావు 1985 నుంచి 2007 వరకు 22 సంవత్సరాలు జాగృతి వారపత్రిక సంపాదకుడిగా విశిష్ట సేవలు అందించిన ధన్యజీవి.

**జాగృతి ఆధ్వర్యంలో**

**స్వర్గీయ వడ్లమూడి రామమోహనరావు స్మారక**

**'నవలల పోటీ- 2026'**

రచనలను ఆహ్వానిస్తున్నాం..

**ప్రథమ బహుమతి**
**రూ. 25,000**

**ద్వితీయ బహుమతి**
**రూ. 20,000**

**సూచనలు :**

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

**నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 07 సెప్టెంబర్, 2026**




# భారత్‌పై మెటా కుట్ర


**భారత్‌పై అమెరికా సోషల్ మీడియా దిగ్గజం మెటా కుట్రకు పాల్పడుతోందనే సంగతి మరోసారి తేటతెల్లమైంది. ఫేస్‌బుక్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంతో కూడిన ఒక వీడియోను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఇటీవల తొలగించడం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఎన్‌డీఏ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిననాటి నుంచి దేశ సార్వభౌమత్వానికి, రాజ్యాంగానికి విరుద్ధంగా మెటా అధీనంలోని వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల చర్యలు మితిమీరిపోతున్నాయి. అయితే ఇన్ని విపరీతాలు జరుగుతుంటే చేతులు కట్టుకొని, చూస్తూ కూర్చోవడానికి మోదీ సర్కారు సిద్ధంగా లేదు.**

మెటా మెడలు వంచడానికి, దానితో తాడో పేడో తేల్చుకోవడానికి ఉపక్రమించింది. ఆ క్రమంలో సామాజిక మాధ్యమాల నియంత్రణపై చర్చించడానికి కమ్యూనికేషన్లు, సమాచార సాంకేతికతపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆగస్టు 3న సమావేశమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్ట్ తాత్కాలికంగా తొలగించిన విషయంపై మెటా ప్రతినిధులను కఠినంగా ప్రశ్నించింది. అయితే సాంకేతిక లోపం కారణంగా వీడియో తొలగింపు జరిగిందంటూ సమాధాన మిచ్చిన మెటా ప్రతినిధుల ఉదాసీన వైఖరి పట్ల కమిటీ మండిపడింది. ప్రధాని వీడియో ఐదు గంటలపాటు అందుబాటులో లేకపోవడం తీవ్రమైన విషయం అని హెచ్చరించింది. దీనిపై మెటా ప్రతినిధులు క్షమాపణ చెప్పారు. అయితే కేవలం క్షమాపణ చెప్పినంత మాత్రాన విషయ తీవ్రత తగ్గిపోదని కమిటీ వేలెత్తి చూపింది. దీనికి జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని స్పష్టం చేసింది. వీడియోను తొలగించిన అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మెటా ఇండియాపై తెలంగాణలో ఎఫ్ఐఆర్ నమోదైన విషయాన్ని కూడా ప్రస్తావించింది. ప్రధాని వీడియో తొలగింపునకు నైతిక బాధ్యత వహిస్తూ మెటా ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) మార్క్ జుకెర్‌బెర్గ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కమిటీ డిమాండ్ చేసింది. మెటా పరిధిలోని సామాజిక మాధ్యమాల్లో ఉన్న వివాదాస్పదమైన, అభ్యంతరకరమైన కంటెంట్‌పై కంపెనీ తీసుకున్న చర్యల వివరాలను అడిగింది. మహిళలు, బాలలు, రైతులు, పల్లె ప్రజలు, శ్రామికులు , సాధారణ ప్రజల గోప్యతను ఎలా రక్షిస్తారని, ప్రభుత్వ ప్రజా క్రమాన్ని ఎలా నిర్ధారిస్తారని కమిటీ ప్రశ్నించింది. బాలల లైంగిక వేధింపుల కంటెంట్ తొలగించకపోవడం, హోమ్ మంత్రిత్వ శాఖ, ఐటీ మంత్రిత్వ శాఖ సూచనలను



పాటించకపోవడంపై మెటా ప్రతినిధులను కమిటీ నిలదీసింది. సమావేశం అనంతరం కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే మాట్లాడుతూ ప్రధానమంత్రి కంటెంట్‌ను తొలగించడం మెటా ఇండియాకు ఇది మొదటిసారి కాదని ఆరోపించారు. 2024 ఎన్నికల ఫలితాలపై జుకెర్‌బెర్గ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు, ఆ తరువాత క్షమాపణ చెప్పిన విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. దేశాన్ని అస్థిరపరిచే ఉద్దేశ్యం మెటాకు ఉందని విమర్శించారు.

మెటా అనుచిత వైఖరి వివరాల్లోకి వెళితే.. విద్యార్థి నిరసనకారులను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన సెల్ఫీ వీడియో జూలై 28న తొలగింపునకు గురైంది. ఇదే విషయాన్ని వినియోగదారులు గుర్తించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకొనివచ్చారు. దీంతో వీడియోను ఫేస్‌బుక్ పునరుద్ధరించింది. పొరపాటు జరిగిందంటూ మెటా ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘటనను కేంద్రం చాలా తీవ్రంగా పరిగణించింది. మెటా, ఇన్‌స్టాగ్రామ్ అంతర్జాతీయ అధిపతులకు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సమన్లు జారీ చేసింది. జూలై 23న అప్‌లోడ్ చేసిన ఆ వీడియోలో, పేపర్ లీక్‌లను అరికట్టడానికి ప్రభుత్వం త్వరలో కఠినమైన చర్యలను ప్రకటిస్తుందని ప్రధాని మోదీ తెలిపారు.




**బాలల లైంగిక దోపిడీ ప్రకటనలపై కేంద్రం హెచ్చరిక**

జూలై ప్రారంభంలో, వినియోగదారులకు బాలల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన ప్రకటనలు, కంటెంట్‌ను ఇన్‌స్టాగ్రామ్ చూపిస్తోందనే ఆధారాలు బీబీసీ దర్యాప్తులో బయటపడటంతో భారత్ పట్ల మెటా కుట్ర వెలుగులోకి వచ్చింది . బీబీసీ దర్యాప్తు ప్రకారం, భారతదేశంలో బాలల లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహించే చెల్లింపు ప్రకటనలను ఇన్‌స్టాగ్రామ్ ప్రదర్శిస్తోంది. ఈ ప్రకటనలు వినియోగదారులను టెలిగ్రామ్ ఛానెళ్లకు మళ్లిస్తున్నాయని, అక్కడ అలాంటి కంటెంట్‌ను కొనుగోలు చేయవచ్చని ఆ దర్యాప్తులో తేలింది. బీబీసీ దర్యాప్తు ఆధారంగా, మరింత లోతుగా విచారణ చేయాలని అధికారులను ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదేశించారు. ఆ తర్వాత, ఇన్‌స్టాగ్రామ్‌లోని చెల్లింపు ప్రకటనలలో బాలల లైంగిక దోపిడీ సమాచారం ఉన్నందుకు ప్రభుత్వం మెటాకు గట్టి హెచ్చరిక జారీ చేసింది. బాలల దుర్వినియోగాన్ని ప్రోత్సహించే అన్ని ప్రకటనలు, కంటెంట్‌ను తక్షణమే నిలిపివేయాలని ఇన్‌స్టాగ్రామ్‌ను ఆదేశించింది. ఇదే నెలలో వినియోగదారులు ప్రత్యేకమైన యూజర్‌నేమ్‌లను ఉపయోగించి చాట్ చేయడానికి అనుమతించే వాట్సాప్ కొత్త ఫీచర్‌ను ప్రారంభించడాన్ని కూడా నిలిపివేయాలని కేంద్రం ఆదేశించింది. అది ఆన్‌లైన్ మోసాలు, స్కామ్‌లను పెంచే అవకాశం ఉందని హెచ్చరించింది.

**దేశం విడిచివెళ్లండి: వాట్సాప్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక**

ఈ ఏడాది ఫిబ్రవరిలో, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ వాట్సాప్‌ను తీవ్రంగా మందలించారు. “మీరు మా రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, భారతదేశం విడిచి వెళ్ళండి. పౌరుల గోప్యతకు భంగం కలగడాన్ని మేము అనుమతించము,” అని హెచ్చరించారు. వాట్సాప్ 2021 గోప్యతా విధానానికి సంబంధించిన ఒక పిటిషన్‌పై విచారణ జరుగుతున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విధానం ప్రకారం, వాణిజ్య ప్రకటనలు, మార్కెటింగ్ కోసం వినియోగదారుల డేటాను ఫేస్‌బుక్, దాని అన్ని గ్రూప్ కంపెనీలతో పంచుకోవడానికి వాట్సాప్‌కు అనుమతి ఉంది. ఈ విషయంపై విచారణ జరుపుతున్నప్పుడు వాట్సాప్ గుత్తాధిపత్యం వినియోగదారులకు ఎటువంటి నిజమైన ఎంపికను మిగల్చడం లేదని, దాని డేటా సేకరణ పద్ధతులను “వ్యక్తిగత సమాచార చౌర్యం”తో చీఫ్ జస్టిస్ పోల్చారు.



**జుకెర్‌బెర్గ్ వాచాలత్వం**

గతంలో జో రోగన్ పాడ్‌కాస్ట్‌లో 2024 భారత ఎన్నికల ఫలితాలపై మెటా సీఈఓ మార్క్ జుకెర్‌బెర్గ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై భారత్‌కు మెటా కంపెనీ క్షమాపణలు చెప్పింది. భారతదేశం సహా అనేక దేశాల్లోని ప్రభుత్వాలు కోవిడ్ అనంతర ఎన్నికలలో అధికారాన్ని కోల్పోయాయని ఆయన పేర్కొన్నారు. దీనిని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. 2024 ఎన్నికలు కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వానికి తిరిగి అధికారాన్ని ఇచ్చాయని ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం వరుసగా మూడవసారి అధికారాన్ని కైవసం చేసుకుందని అన్నారు. 2024 ఎన్నికల్లో కనివినీ ఎరుగని రీతిలో పెద్ద సంఖ్యలో ప్రజలు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. జుకెర్‌బెర్గ్ వ్యాఖ్యలు “వాస్తవాలకు విరుద్ధం” అని తోసిపుచ్చారు.

ఆగస్టు 3న బీజేపీ ఎంపీ దూబే చెప్పినట్టుగా భారత్‌ను అస్థిరపరిచే ఉద్దేశ్యంతో ఒక పథకం ప్రకారం కుట్రలు పన్నుతున్న మెటా లాంటి పాశ్చాత్య సామాజిక మాధ్యమ దిగ్గజాలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది. తమ వేదికలపై కుప్పలుతెప్పలుగా వచ్చిపడుతున్న డీప్ ఫేక్‌ల పట్ల తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్న సామాజిక మాధ్యమాలను కట్టడి చేయడానికి ఒక చట్టం చేసే ఆలోచనలో కేంద్రం ఉంది. అంతే కాకుండా వాట్సాప్ ద్వారా పెచ్చరిల్లిపోతున్న డిజిటల్ అరెస్టులను సమూలంగా నిర్మూలించే విధి, విధానాలకు కూడా ఈ చట్టంలో చోటు కల్పిస్తున్నట్టు సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలియపరచడం ఆ దిశగా ఒక శుభపరిణామం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

– జాగృతి డెస్క్



# ధర్మబద్ధతే ఆదర్శం

భగవద్గీతలో విభూతి యోగంలో భగవంతుడు తన విభూతుల (శక్తుల) వర్ణన చేశాడు. నేను మాసాలలో మార్గశిర మాసాన్ని, ప్రకాశాన్ని ఇచ్చే వస్తువుల్లో సూర్యుడిని. అస్త్రశస్త్రాలు ధరించడంలో రాముడిని. యాదవ వంశంలో నేను కృష్ణుడిని... పురుషవాచకమైన ఆ శక్తులన్నీ వ్యక్తిలో ఒక ఉన్నతమైన గుణం రూపంలో ఉన్నాయి. కానీ మహిళల విషయంలో ఒక్కొక్కటిగా ప్రస్తావన లేదు. సంపూర్ణ మహిళ ప్రస్తావన ఉంది. కీర్తి, శ్రీ, వాక్కు నారీ స్మృతి, మేధ, ధృతి, క్షమ వంటి ఉన్నతమైన గుణాలన్నీ మహిళల్లో కనిపిస్తాయి. అందుకే, మహిళాజాతి శక్తిమంతమైనది.

అందుకే, సంతు సన్యాసులు వచ్చినప్పుడు, చిన్న పిల్లలతో కూడా మాట్లాడతారు. పేరుపెట్టి పిలిచే పరిచయం లేనంతవరకూ ఆమెను అమ్మా అని పిలుస్తారు. జగత్‌జనని అనే అర్థంలో ఇక్కడ మహిళలకు మర్యాద ఎందుకంటే, ఆమె శక్తి, జగత్‌జనని, ఆమె దేవి. ఆమె ఏమైనా చేయగలదు. స్వయంగా శక్తి స్వరూపం. అందుకే, మోక్షం, పురుషార్థంలో స్వతంత్రురాలు. ప్రతి ఒక్కరి ఆత్మ సమానమే, కనుక ప్రతి ఒక్కరూ దానిని సాధించాలి. ఆత్మ నుంచి పరమాత్మ కావడంలో, అర్థకామాలలో కూడా ఇద్దరూ సమానమే. కానీ, అర్థకామాలు ఉపభోక్తలు, వాటి సాధనాలు మనకు తెలుసు. కానీ, మనం 'నేను సుఖంగా ఉంటే సంభవమ'ని అనుకున్నాం. ఎందుకంటే, సుఖంగా ఉండాలన్న కోరిక అనంతమైనది.

ఏమీ లేనప్పుడు నడిచి వెళ్లేవాళ్లం, బజారు దగ్గరగా ఉంటే బాగా అనిపించేది. తర్వాత సైకిల్ వచ్చింది. అప్పుడు అదే బజారుకు నడిచి వెళ్లడం కష్టంగా అనిపించింది. స్కూటర్ వచ్చింది, కారు వచ్చింది. ఇప్పుడు ఇంకా ఇంకా కావాలి. ఉన్నదాని గొప్పదనం ఏమీ లేదు. ఇది మనిషి గుణం. ఇది దుర్గుణమే. మనుషుల కోరికలు అనంతం. పృథ్విపై వనరులు పరిమితం. అందుకే, వనరులు అందరికీ దక్కాలి. అందరితో కలిసి నడవాలి. అందరి ఉన్నతి జరగాలి. ఎందుకంటే, అందరూ ఒక్కటే. కానీ, వేరువేరుగా కనిపిస్తారు. నమ్మకాలు వేరు, భక్తి వేరు, పూజ వేరు, భాష వేరు, బుద్ధి కూడా భిన్నంగా ఉంటుంది. ఆర్థిక స్థాయి వేరు. అందరూ సుఖంగా ఉండాలి. కనుక, అర్థం అంటే పని అనే ఒక క్రమశిక్షణ. దానిని ఒక ముఖ్య పురుషార్థంగా భావిస్తారు. ప్రధానంగా, గృహస్తులు ధర్మాన్ని నిర్వహించాలంటే, ఒక్కరూ సరిపోరు. కేవలం పురుషుడు ఒక్కడే పూజ చేయలేడు. అతడితో పాటు అతని భార్య ఉండాలి. కేవలం మహిళ మాత్రమే పూజ చేయలేరు. ఆమెతో పాటు ఆమె భర్త కూడా ఉండాలి. ఇదే ధర్మం.

ధర్మం అనేది క్రమశిక్షణ. దీని ద్వారా కామార్థాల కోసం సహజంగా శ్రమిస్తుంది కుటుంబం. అన్ని జీవులూ జీవించాలి, వారి పొట్టనింపుకోవాలి. అందుకు ఒక సాధానం కావాలి. అది నేర్పనవసరం లేదు. అది అందరూ చేస్తారు. కానీ, అందులో ఒక క్రమశిక్షణ, సంయమనం, మరొకరి కోసం త్యాగం ఉండాలి. త్యాగం లేకుండా ధర్మం ఉండదు.

ధర్మం మనుషులు చేసే త్యాగం ద్వారా నెరవేరుతుంది. త్యాగం మనుష్యుల బాధ్యత. ఇది మిగిలిన జీవులకు లేదు. మనుషులు, పశువులలో ఆహారం, నిద్ర, భయం, సంతానోత్పత్తి అనే నాలుగు విషయాలు సమానం. జీవశాస్త్రం మనం కూడా పశువులమే. కానీ, విశేషించి మనుషులు ధర్మాన్ని అనుసరిస్తారు. బుద్ధి కారణంగా ఇతర ప్రాణుల కన్నా మనిషి సమర్థవంతుడు. జ్ఞానంతో వనరులను ఉత్పన్నంచేసి, వాటి ఆధారంగా సమర్థుడై పాలిస్తాడు. అందుకే, అది అతడి బాధ్యత. సృష్టి నడవాలి, సృష్టిని నడిపించాలి, అందుకే ధర్మం అతడి ప్రత్యేకత. ధర్మం లేకుంటే అతడు పశువుతో సమానం.

విశ్వకళ్యాణం కోరుకునే రుషులు మునులు దీక్ష తీసుకొని కఠోర తపస్సు చేశారు. దాని నుంచి జాతీయ బలం, శక్తి ఉత్పన్నమయ్యాయి అని మన చరిత్ర చెబుతుంది. వేదం బాధ్యతను గుర్తు చేస్తుంది. ఈ బాధ్యతను తీసుకోవాలంటే, పెద్ద సమాజం అవసరం. మొత్తం ప్రపంచానికి ఇవ్వాలంటే, కనీసం 140 కోట్లమంది తమ జీవితాలను ప్రపంచానికి విషయం తెలిసేలా జీవించాలి. కానీ వీరందరికీ ఏక కాలంలో నేర్పలేం. అందుకని యూనిట్లుగా విభజించాలి. సమాజపు యూనిట్ కుటుంబం. సమాజంలో ఉన్నట్టే కుటుంబంలో కూడా పురుషుడు ఉంటాడు. మహిళ కూడా అంతే. వారు సమాజ స్థాయిలో, కుటుంబస్థాయిలో ఉంటారు. కుటుంబానికి ఒక ఇల్లు ఉంటుంది. అక్కడ పుట్టి పెరిగే పిల్లలను సామాజికంగా, యోగ్యంగా, ధార్మిక చరిత్ర ఉన్నవారిగా తయారు చేయాలి. తద్వారా తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ, విశ్వ అస్తిత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు దోహదం చేయగలరు. ఇది కుటుంబ విధి. కానీ ఇదంతా చేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటి? దీనితో ధర్మం పెరగాలి, మొత్తం ప్రపంచం సవ్యంగా సాగాలి. ఇది కుటుంబం పని. వివాహం అయిన తర్వాత కుటుంబం ఏర్పడుతుంది.

మన సంప్రదాయంలో వ్యక్తి వివాహం చేసుకునే అవసరం లేదనుకొనే పద్ధతి రుషుల కాలంలోనే భావించారు. కానీ, వివాహం చేసుకోకూడదనుకుంటే దాని క్రమశిక్షణ వేరే ఉంటుంది. బ్రహ్మచారిణి, బ్రహ్మచారి,సన్యాసి, సన్యాసిని వీరందరికీ నియమాలు భిన్నమైనవి. సమాజం వారిని క్రమశిక్షణలో ఉంచుతుంది. అందుకోసమే నియమాలు తయారుచేసింది. వాటికి అనుగుణంగా ఉండాలి. అలా ఎందుకుంటారంటే, వారికి ఈ భౌతిక విషయాల పట్ల ఆసక్తి ఉండదు. వీటన్నింటినీ వదిలిపెడతారు. కానీ, వాటిని వదలకపోతే ఏం చేయాలి? అందుకే, ధర్మాన్ని పాటించే సమాజంలో వివాహం ఒక క్రమశిక్షణ అవుతుంది. ఇప్పుడు దానికి పర్యాయం లివింగ్ రిలేషన్ షిప్. మోడర్నిటీ.. కానీ దీని పరిణామాలు ఏమిటి? దీనికి ఆధారం సరిగ్గాఉందా? వీరికి బాధ్యత వద్దు, సుఖం కావాలి. అందువల్ల, కావాలన్నప్పుడు కలిసి

ఉండ టం, లేదంటే వదిలిపోవడం. బాధ్యతలేదు. కానీ, దీనివల్ల ఏం వృద్ధి చెందుతుంది? మొత్తం ప్రపంచాన్ని చూడండి.

మోడర్నిటీ అవసరమే. సమయానికి అనుసారంగా మారాలన్నది కూడా మన పరంపరలో నియమం. గతంలో ఉన్నదంతా సరైనదే అని చెప్పడం లేదు. తెలివైన వారిని పరీక్షించి నియమిస్తారు. పరీక్ష మనకేం చెప్తోంది? మోడర్నిటీని స్వీకరించాలి, కానీ మోడర్నిటీ లేకపోతే డిగ్రేడేషన్ ఉంటుందని అనుకోనక్కరలేదు. కానీ వీరు కళ్లు మూసుకుని పాశ్చాత్యులను అనుకరిస్తారు. మనం నిస్సహాయులం కాము. మనం అంతా సరిగ్గా చేస్తాం, చేయగలం. అటువంటి వారసత్వం మనకు లభించింది. మనలో ఆ శక్తి ఉంది. దీని గురించి చింత వ్యక్తం అవుతోంది మీ నుంచి. ఇప్పుడు సంపన్న వర్గాల్లో ఇది ఎక్కువగా ఉంది. ఆంగ్ల విద్య వచ్చింది, దానివల్ల లాభం ఉంది. విద్య అవసరమే. కానీ, దానితో పాటుగా ఈ బ్యాగేజ్ వస్తుంది. ఈ విద్య లభ్యం కాని వారున్నారు. వారు కష్టంలో ఉన్నారు. వారికి విద్య లభించాలి, కానీ ఈ బ్యాగేజ్ కాదు.

సమాజంలో ఎల్జీబీటి ప్రవృత్తులు ఉంటాయి. కొన్ని ప్రకృతి సిద్ధంగా వచ్చినవి. మనమేం చేయలేం. వారు అలా జన్మించారు. కానీ, కొన్ని మానసికత కారణంగా తెచ్చుకున్నవి. కొన్ని శరీరానికి శస్త్రచికిత్స చేయించుకుని తెచ్చుకున్నవి. ఈ జాడ్యం మొత్తం ప్రపంచంలో ఉంది. కానీ మన దేశంలో లేదు అని అనుకోవచ్చు. ఇక్కడ కూడా ఉన్నారు. వారు కూడా మనుషులే. వారికి జీవించే అధికారం ఉంది. వారిని సమాజం నుంచి మనం దూరం చేయలేం. సమాజంలో వీరికి కూడా ఒక ఏర్పాటు ఉంది. వారిని హీనభావనతో చూడవద్దు. శిఖండి ఒక రాజు, ఇతర వీరులతో సమానంగా పోరాడాడు. వారికి కూడా దేవీ దేవతలు ఉన్నారని మనకు తెలుసు. కుంభమేళాకు వస్తుంటారు. అక్కడ కూడా ఏర్పాట్లు జరిగాయి. ఈ విషయాలన్నింటికీ సమాధానం చెప్పగల సమగ్ర ఏకాత్మదృష్టి ఆధారంగా మనం ఆలోచన చేస్తే, అంతా బాగానే ఉంటుంది. ఇక్కడ



ఉండే మాతృత్వ భావన పరంపరాగతంగా, కాలానుగుణంగా తయారు కాబడినదే. మాతృత్వానికి శక్తి ఉంది. ఒక కాలంలో తల్లిని దేవత అన్నాం, జగత్‌జనని శక్తి అన్నాం. అయితే విదేశీ దాడుల దుష్పరిణామంతో శక్తికి ప్రతిరూపంగా ఆరాధిస్తున్న ఆమెను బంధించటం ప్రారంభించాం. మధ్యలో కొంతకాలం సమాజం అస్థిరంగా ఉంది, దేవి అని భావిస్తూనే ఆమెను దాసిగా చేసి, ఇంట్లో కట్టి పడేశాం. ఇప్పుడు మనం స్వతంత్రులం. మన మెదడు కూడా మెల్లమెల్లగా స్వతంత్రం అవుతోంది. శక్తి స్వరూపిణియే మహిళ. ఆమెను గౌరవిస్తాం, మంచిదే. కానీ, భౌతికంగా, మానసికంగా ఆమె మనలాంటిదే. బుద్ధిపరంగా కూడా ఆమె మనిషే. ఆమెకు అవసరాలు, కోరికలు ఉంటాయి. కుటుంబం నడపడం అన్నది ఆమె పనే. ఎందుకంటే, కుటుంబాన్ని నిర్వహించాలంటే మమత, వాత్సల్యం అవసరం. అందుకే, ఆమె కుటుంబానికి కేంద్రం బిందువు అవుతుంది. పిల్లలకు తొలి గురువు అవుతుంది. కానీ, అదంతా చేసిన తర్వాత కూడా, ఆమెకు తనదైన జీవితం ఉంటుంది. ఆమెకు కూడా ఆకాంక్షలు ఉంటాయి. పూర్వకాలంలో మహిళలు పని చేయాల్సిన అవసరం పడేది కాదు. కొంచెం కష్టపడి సంపాదించిన దానితో సర్దుకునేవారు. ఇప్పుడు అలా కాదు, మహిళలు పని చేయవలసిందే, కలిసి కుటుంబాన్ని నడపాలి. తల్లిదండ్రుల నేతృత్వంలో అందరూ నడవాలి. కుటుంబంలో టీం వర్క్ అవసరం. మనం అసంపూర్ణ దృష్టితో అంధానుకరణం చేయడంవల్ల అనేక సమస్యలు వస్తున్నాయి. ఇప్పుడు కాలం మారింది కొత్త కొత్త అవసరాలు పెరుగుతున్నాయి. గతకాలపు శాశ్వత విలువలను బలంగా ఉంచుతూ, కాలానుగుణమైన రూపం కుటుంబానికి ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇది ఎవరు చేయగలరు? ఈ విషయంపై నా ఉపన్యాసం వినే బదులు, ఇక్కడున్నవారు సమర్ధులు. యుగయుగాలుగా వారు ఇదే పని చేస్తూ వస్తున్నారు. ఇది మీ పనే. మీరు కదలండి, అడుగువేయండి. భారతీయ మహిళలకు అన్నీ చేయడం తెలుసు, వారు అన్నీ చేయగలరు అని వివేకానందుడంతటివాడు అన్నాడు. మన (పురుషులం) పని ఏమిటంటే, మధ్యలో మనం జోక్యం చేసుకోకుండా ఉండడం. మన సమాజంలో ఏదైనా జరగాలంటే స్త్రీ పురుషులు ఐక్యంగా ఉండాలి. వాస్తవానికి, ఇదే మన సంప్రదాయ లక్షణం. అయినప్పటికీ, ఇది ఆధిపత్య ప్రాతిపదికన పనిచేసినట్లుగా ప్రచారం జరుగుతోంది, కొంతమంది దీనిని గుడ్డిగా అంగీకరించారు.

మన పూర్వీకులు సృష్టికి సంబంధించిన సత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, స్వీకరించి, భవిష్యత్ తరాలకు అందించి, మనమందరం ఒక్కటే అని బోధించే వారసత్వాన్ని మనకు వదిలివెళ్లారు. కుటుంబ విషయంలో మహిళలే పరిష్కారాలను వెతకండి, అమలు చేయండి, ఈ మహత్తరమైన ప్రయోగాన్ని ప్రపంచానికి చూపండి. ★

*మాతృత్వానికి శక్తి ఉంది. ఒక కాలంలో తల్లిని దేవత అన్నాం, జగత్‌జనని శక్తి అన్నాం. అయితే విదేశీ దాడుల దుష్పరిణామంతో శక్తికి ప్రతిరూపంగా ఆరాధిస్తున్న ఆమెను బంధించటం ప్రారంభించాం. మధ్యలో కొంతకాలం సమాజం అస్థిరంగా ఉంది, దేవి అని భావిస్తూనే ఆమెను దాసిగా చేసి, ఇంట్లో కట్టి పడేశాం. ఇప్పుడు మనం స్వతంత్రులం. మన మెదడు కూడా మెల్లమెల్లగా స్వతంత్రం అవుతోంది. శక్తి స్వరూపిణియే మహిళ. ఆమెను గౌరవిస్తాం, మంచిదే. కానీ, భౌతికంగా, మానసికంగా ఆమె మనలాంటిదే. బుద్ధిపరంగా కూడా ఆమె మనిషే. ఆమెకు అవసరాలు, కోరికలు ఉంటాయి. కుటుంబం నడపడం అన్నది ఆమె పనే. ఎందుకంటే, కుటుంబాన్ని నిర్వహించాలంటే మమత, వాత్సల్యం అవసరం. అందుకే, ఆమె కుటుంబానికి కేంద్రం బిందువు అవుతుంది. పిల్లలకు తొలి గురువు అవుతుంది.*



# జోగినీల నిరసనల మ

**తెలంగాణ ముఖ్యంగా హైదరాబాద్-సికింద్రాబాద్ జంటనగరాల సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే సికింద్రాబాద్ లష్కర్ బోనాలు ఈసారి కూడా అంగరంగ వైభవంగా జరిగాయి. జై మహంకాళి నినాదాలతో లష్కర్ వీధులు మార్మోగగా, భక్తి పారవశ్యంలో మునిగిన నగరం మొత్తం బోనమెత్తింది. ఆగస్టు 2వ తేదీ ఆదివారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు రంగం, అంబారీ ఊరేగింపుతో మరునాడు ఘనంగా ముగిశాయి. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో నగరం మొత్తం పండుగ శోభను సంతరించుకుంది. అయితే, వేడుకల మధ్యలో జోగినిల ఆందోళన కాసేపు ఉద్రిక్తతలకు కారణమైంది.**

బోనాలు మొదలైన రోజు తెల్లవారుజాము నుంచే సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని చారిత్రాత్మక శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు వేపాకులు, పసుపు, కుంకుమ, బెల్లం, ప్రత్యేక పాత్రలో వండిన అన్నంతో అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ తెచ్చి అమ్మవారికి సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణలు, తాత్కాలిక దుకాణాలు, పూల స్టాళ్లు, పిల్లల వినోద కార్యక్రమాలతో లష్కర్ కళకళలాడింది. ఊరేగింపు వాహనాలను ప్రత్యేకంగా అలంకరించారు. లక్షమందికి పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేయగా, ఆ అంచనాలను మించి జనం తరలివచ్చారు.

భక్తుల సౌకర్యార్థం సాధారణ దర్శనానికి మూడు, బోనాలు సమర్పించే మహిళల కోసం రెండు, వీఐపీల కోసం మరో ప్రత్యేక క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక కేంద్రాలు కేటాయించగా, సుమారు 1500 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ ప్రత్యేకంగా 175 బస్సులను నడిపింది.

**అమ్మవారికి సీఎం రేవంత్ పూజలు**

బోనాలు మొదటి రోజు మధ్యాహ్నం ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసిన ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని ప్రార్థించారు. అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనాలు అందించారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ తదితరులు సీఎం వెంట ఉన్నారు.

అంతకుముందు తెల్లవారు జామునే హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి తొలి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా బోనం సమర్పించారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద సహా పలువురు ప్రముఖులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ బోనం సమర్పించడం హైలైట్‌గా నిలిచింది. జాతర లాంఛనంగా మొదలు కావడానికి ముందు రోజే రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**జోగినిల ఆందోళనతో గందరగోళం**

తొలిరోజు మధ్యాహ్నం జోగినీలకు బోనాలు సమర్పించేందుకు ప్రత్యేకంగా ప్రభుత్వం సమయం కేటాయించింది. నిర్ణీత సమయానికే వారు బోనాలతో వచ్చినప్పటికీ పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆ సమయంలో జోగినీల బోనం పడిపోవడంతో జోగినీలంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బోనాలు తొలిరోజు వేడుకల్లో తమను అవమానపరిచారంటూ జోగినీలు రంగం జరిగే ముందు ఆలయం ముందు ధర్నాకు దిగారు. అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అవసరం వచ్చినప్పుడే ప్రభుత్వం తమను గుర్తు చేసుకుంటుంది. బోనాల సందర్భంగా జోగినీలకు కనీస ఏర్పాట్లు చేయలేదు. ఆలయ సిబ్బంది తమను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినీలను అవమానించారు. ఈ విషయంలో ఆలయ కమిటీ సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు తమను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. జోగినిలని కూడా చూడకుండా పోలీసులు బయటకు నెట్టేశారని ప్రశ్నిస్తూ, తమకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలో పోలీసులకు, జోగినీలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, బ్యారికేడ్లు తొలగించుకుని జోగినీలు ఆలయంలోకి ప్రవేశించారు. దీంతో కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. రంగం



# ...ధ్య 'లష్కర్'

కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమైంది. మంత్రి పొన్నం ప్రభాకర్ జోగినీలను చర్చలకు పిలిచి, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మాట్లాడి ఆందోళనను విరమించాలని కోరడంతో పరిస్థితి సద్దుమణిగింది.

**రంగం భవిష్యవాణిలో అమ్మవారి ఆగ్రహం**

జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం రంగంలో ఆలయ ఆవరణలో పచ్చి మట్టికుండపై నిలిచిన జోగిని మాతంగి స్వర్ణలత..అమ్మవారిని ఆవాహన చేసుకుని భవిష్యవాణి వినిపించారు. ఈసారి తాను సంతోషంగాలేనని, కాకుండా, ఏటా తాను చెప్పే మాటలను ఎవరూ ఆచరించడంలేదని, విగ్రహ ప్రతిష్ఠ చేస్తామన్న మాటను నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరునెలల్లోగా విగ్రహ ప్రతిష్ఠ జరగకపోతే వాడవాడలా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మాట ప్రకారం విగ్రహ ప్రతిష్ఠ పూర్తిచేస్తే భక్తులు కోరిన కోరికలన్నీ నెరవేరుతాయని, కొంగు బంగారమవుతుందని అభయమిచ్చారు.

రాష్ట్ర భవిష్యత్తు గురించి మాట్లాడుతూ, ఈ ఏడాది కుంభవృష్టి వర్షాలు కురుస్తాయని, వరద ఉధృతిలో ప్రజలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, అగ్ని ప్రమాదాలు కూడా సంభవించే అవకాశం ఉందని, తద్వారా భారీ ప్రాణనష్టం జరగనుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జనం వావివరసలు మరచి, అహంకారం పెరుగుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తూ కంటతడి పెట్టిన మాతంగి, తాను దోసెడంత ఇస్తే గోరంత కూడా తిరిగి ఇవ్వడం లేదని అన్నారు. ఇక్కడ అమ్మవారి ప్రతిరూపంగా జోగిని పలికే ప్రతి పలుకు నిజమవుతుందని భక్తుల విశ్వాసం.

**కోఆప్టెడ్ సభ్యులుగా జోగినీలు**

జోగినీలు ప్రత్యేక గుర్తింపు కావాలని కోరారని, భవిష్యత్‌లో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. గుర్తింపు కార్డుల ఇచ్చేలా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. పురపాలక సంఘాల్లో వారిని కో–ఆప్షన్ సభ్యులుగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.



రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అమ్మవారి ఆశీర్వచనం లభించిందని తెలిపారు..

**అరకొర నిధులు:బండి సంజయ్**

బోనాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బోనాల తొలిరోజు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రంజాన్ పండుగ నిర్వహణకు రూ.33 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బోనాలకు కేవలం రూ.20 కోట్లు మంజూరు చేసిందని తప్పుపట్టారు. రాష్ట్ర జనాభాలో 80 శాతానికి పైగా ఉన్న హిందువులు జరుపుకునే పండుగకు ఇంత తక్కువ నిధులివ్వడం వివక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. జంట నగరాల్లో మూడు వేలకుపైగా ఆలయాల్లో బోనాలు నిర్వహిస్తుండగా, ఈ నిధులు ఏమాత్రం సరిపోవని విమర్శించారు.గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే భక్తులకు కనీస తాగునీటి సదుపాయం కూడా లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు కేవలం ఆలయ దర్శనాలు చేయడమే కాకుండా భక్తుల సమస్యలను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా బోనాల ఉత్సవాలకు తగిన నిధులు కేటాయించలేదని గుర్తుచేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సహా అన్ని హిందూ పండుగలకు జనాభా నిష్పత్తి ప్రాతిపదికన నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ట్రాఫిక్ ఆంక్షలు, భద్రతా ఏర్పాట్లు**

జాతర సందర్భంగా ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ఆగస్టు 4వ తేదీ ఉదయం వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. పొగాకు బజార్, సుభాష్ రోడ్, జనరల్ బజార్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే మార్గాలను మూసివేయగా, కర్బాలా క్రాస్‌రోడ్స్ వద్ద వాహనాలను రాణిగంజ్ వైపు మళ్లించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ నుంచి మినిస్టర్ రోడ్డు, గోపాలపురం లైన్ మీదుగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. భక్తుల వాహనాల కోసం 14 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రెండోరోజు ఉదయం రంగం ద్వారా భవిష్యవాణి వినిపించిన అనంతరం.. సాయంత్రం ఏనుగు అంబారీపై అమ్మవారి చిత్రపటంతో భారీ ఊరేగింపు, పలహార బండ్ల ఊరేగింపులతో లష్కర్ బోనాల జాతర వైభవంగా ముగిసింది. లక్షలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. మాతంగి హెచ్చరికలు, జోగినిల ఆందోళన, రాజకీయ విమర్శల మధ్య ఈసారి బోనాలు ప్రత్యేక చర్చను లేవనెత్తాయి. వచ్చే ఏడాది మరింత ఘనంగా ఈ వేడుకలు జరగాలని, సంప్రదాయాలకు తగిన గౌరవం లభించాలని, అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

# ఉత్తరాంధ్ర వైభోగం




**విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1న జాతికి అంకితం చేశారు. రూ.17,900 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవ, శంకు స్థాపన కార్యక్రమాలు చేశారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ఈ రోజుకున్న విశేష ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ..శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి, శ్రీ కూర్మనాథస్వామి, పైడితల్లి అమ్మవార్లకు భక్తితో ప్రణామాలు సమర్పించారు. "ఈ చరిత్రాత్మక సందర్భానికి సాక్షిగా నిలిచేందుకు ఇవాళ ఉత్తరాంధ్ర పవిత్ర భూమిపై ఉన్నందుకు నాకెంతో గర్వంగా ఉంది" అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తోందని, కోస్టల్ ఎకనామిక్ కారిడార్‌తో 'నీలి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్య మంత్రులు చంద్రబాబునాయుడు,పవన్ కల్యాణ్ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి రెండింతల వేగంతో అభివృద్ధి చేస్తోందని అభినందించారు.

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి రన్‌వే వంటిదని, రాష్ట్ర యువత భవిష్యత్తుకు లాంచింగ్ ప్యాడ్ లాంటిదని అభివర్ణించారు. 'దేశంలో గతంలోని 74 విమానాశ్రయాల సంఖ్య ఎన్డీఏ అధికారానికి వచ్చిన తరువాత 166కు పెరిగింది. ఉడాన్ పథకంతో సామాన్యులకు విమానయానం అందుబాటులోకి వచ్చిందన్నారు. రాజకీయ నాయకుల కుటుంబాల పేర్ల సంస్కృతికి స్వస్తి పలికి ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతా రామరాజు పేరు పెట్టడం గర్వకారణం. పీఎం గతి శక్తి ద్వారా పాత రేవుల ఆధునికీకరణ, మూలపేట, రామాయపట్నంలో కొత్త రేవులు నిర్మాణం, విశాఖ–రాయపూర్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జరుగుతున్నాయి. రైల్వే అనుసంధానత రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తూ 70కి పైగా స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. ఐటీ రంగంలో ఏపీ యువత నైపుణ్యాలను ప్రోత్సహించేలా విశాఖలో సెమీ కండక్టర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశాయి. ఏఐ ఇన్ఫ్రా, గూగుల్ డేటా సెంటర్లు రాష్ట్రానికి రానున్నాయి. రాయలసీమలో గ్రీన్ ఎనర్జీ కోసం రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు, ఉత్తరాంధ్రలో రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం' అని వివరించారు. ఈ ప్రాజెక్టులతో స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలు నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతగానో సహకరిస్తున్నారని, విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను నిలబెట్టారని, విశాఖ రైల్వే జోన్, పోలవరం, రాజధాని అమరావతికి నిధులు ఇచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొంటూ, ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఏడాది నాటికి పోలవరాన్ని, 2028 నాటికి అమరావతి మొదటి దశ పనులను పూర్తిచేసి ప్రధాని నరేంద్ర మోదీతో ప్రారంభింపచేస్తామన ప్రకటించారు. గడచిన 12 ఏళ్లలో ప్రధాని మోదీ సహకారంతో ఉత్తరాంధ్రలో 189 ప్రాజెక్టులకు రూ.6.13 లక్షల పెట్టుబడులు వచ్చాయని, ఇవి పూర్తి అయితే 5.57 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే 3 ఏళ్లలో రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజికి అనుమతుల వచ్చాయని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే నాలుగో స్థానంలోకి తెచ్చిన ఘనత కూడా మోదీదేనన్నారు.

గవర్నర్‌లు అబ్దుల్ నజీర్, అశోక గజపతిరాజు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లోకం మాధవి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, జీఎంఆర్ సంస్థల అధినేత జీఎంఆర్ మల్లికార్జునరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతకుముందు ప్రధాని మోదీకి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన కళాకారులు ఘన స్వాగతం పలికారు. 13 వేల మంది గిరిజన యువతులు "ధింసా" నృత్యంతో స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీపులో మోదీతో పాటు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఈ నృత్యాన్ని తిలకించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలను మోదీ అభినందించారు.

**శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు**

విశాఖపట్నం తర్లువాడలో ఏఎస్ఐపీ టెక్నాలజీస్ సెమీకండక్టర్ ప్యాకేజింగ్ ,టెస్టింగ్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. కర్నూలులోని పవన, సౌరశక్తి జోన్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను, అనంతపురంలో 2500 మెగావాట్ల, కర్నూలులో 1000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్ మిషన్ పథకాలను ప్రారంభించారు. కర్నూలు–4 రెన్యూవబుల్ ఎనర్జీ జోన్ ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టు, పెంచలకోన–యూరపాడు మధ్యనున్న గ్రిడ్‌కు శంకుస్థాపన చేశారు. ఖమ్మం–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్




‘భోగాపురం’

నాలుగు వరుసల ఎక్స్‌ప్రెస్ రహదారి,ఖమ్మం–దేవరపల్లి ప్యాకేజీ, తాడిపత్రి నాలుగు వరుసల బైపాస్ రహదారులను ప్రారంభించారు.

**విమానాశ్రయం ప్రత్యేకతలు**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పలు ప్రత్యేకతలకు నిలయం. ఎగిరే చేప ఆకృతిలో, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం, ఆధునిక సాంకేతికత, పర్యావరణహిత సదుపాయాల మేళవింపుతో ప్రపంచస్థాయి ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచింది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు మెరుగైన అనుసంధానాన్ని అందిస్తూ, ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ విమానయాన వేదికగా ఇది నిలువనుంది. సాంకేతికత, సుస్థిరత, సంస్కృతి మూడింటినీ మేళవించుకున్న ఈ నిర్మాణం దేశంలోని ఇతర విమానాశ్రయాలకు ఒక కొత్త ప్రమాణంగా నిలుస్తుంది.

ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో రూ.5,640 కోట్ల వ్యయంతో 2,203 ఎకరాల్లో దీన్ని గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుగా జీఎంఆర్ సంస్థ నిర్మించింది. కొత్తగా, ఖాళీ భూమిపై ప్రణాళికాబద్ధంగా నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ తరహా ప్రాజెక్టు కావడంతో, పాత నిర్మాణాల పరిమితులేమీ లేకుండా ఆధునిక సదుపాయాలన్నింటినీ మొదటి నుంచే పొందుపరిచే వీలు లభించింది. ఏటా 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా దీనిని తీర్చిదిద్దారు. పెరుగుతున్న ప్రయాణికుల డిమాండ్‌ను తట్టుకునేలా 77,342 చదరపు మీటర్ల విస్తీర్ణంలో టెర్మినల్ భవనాన్ని నిర్మించారు. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలల ముందుగానే ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడం విశేషం.




కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచేలా, భవిష్యత్తు విమానయాన అవసరాలను తీర్చేలా విమానాశ్రయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. కృత్రిమ మేధ (ఏఐ), బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ (బీఐఎం), ఎయిర్‌సైడ్ 4.0 సాంకేతికత, ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్స్ సెంటర్ (ఏపీవోసీ), బయోమెట్రిక్ ప్యాసింజర్ ప్రాసెసింగ్, ఆటోమేటెడ్ బ్యాగేజీ హ్యాండ్లింగ్ వ్యవస్థలు, ఇంటెలిజెంట్ ఆపరేషనల్ మానిటరింగ్ సొల్యూషన్స్ వంటివి ఇక్కడి సాంకేతిక ప్రత్యేకతలు. ఆటోమేటెడ్ బ్యాగేజీ హ్యాండ్లింగ్ వ్యవస్థల వల్ల ప్రయాణికుల సామాన్లు వేగంగా, కచ్చితత్వంతో గమ్యస్థానం చేరనున్నాయి. వీటి సాయంతో ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేయడం, కార్యకలాపాలను కచ్చితత్వంతో పర్యవేక్షించడం సాధ్యమవుతుంది. ఏపీవోసీ కేంద్రం ద్వారా వాతావరణ పరిస్థితులు, గేట్ల కేటాయింపు, వనరుల నిర్వహణ వంటి అంశాలను ఒకేచోట నుంచి సమన్వయం చేసుకునే వీలుంటుంది. బయోమెట్రిక్ ప్యాసింజర్ ప్రాసెసింగ్ విధానంతో చెక్–ఇన్, భద్రతా తనిఖీల వద్ద నిరీక్షణ సమయం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం స్ఫూర్తిగా విమానాశ్రయ రూపకల్పన సాగింది. టెర్మినల్ పైకప్పు సంప్రదాయ కాటేజీలను, అరకు లోయ ప్రకృతి దృశ్యాలను తలపిస్తుంది. ప్రాంతీయ నిర్మాణ శైలి, ఆధునిక విమానాశ్రయ డిజైన్‌ను మేళవించి, రాష్ట్ర సాంస్కృతికత అడుగడుగునా ప్రతిబింబించేలా టెర్మినల్ రూపొందింది. దేశంలోని ఇతర విమానాశ్రయాలతో పోలిస్తే ఇలాంటి ప్రాంతీయ శైలి, ఆధునిక సాంకేతికత మేళవింపు అరుదైన ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

గంటకు 275 కిలోమీటర్ల వేగంతో తుఫాను గాలులు వీచినా చెక్కుచెదరని రీతిలో టెర్మినల్ భవనాన్ని పటిష్ఠంగా నిర్మించడం ఈ విమానాశ్రయ ప్రత్యేకతల్లో ఒకటి. తీర ప్రాంతంలో తరచూ తుఫానులు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ పటిష్ఠత ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. 3,800 మీటర్ల పొడవైన రన్‌వేతో పాటు సమాంతరంగా టాక్సీవేను ఏర్పాటు చేశారు. ఈ సుదీర్ఘ రన్‌వే భారీ వైడ్‌బాడీ విమానాలు రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. ఏకకాలంలో 18 విమానాలు నిలిపేందుకు వీలుగా స్టాండ్లు నిర్మించారు. 55 మీటర్ల ఎత్తులో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్‌ను నెలకొల్పారు. ఎలాంటి అంతరాయం లేకుండా భారీ సంఖ్యలో విమానాల రాకపోకలు సాగించేందుకు ఈ వసతులన్నీ దోహదపడతాయి. సరుకు రవాణా కోసం 5 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రత్యేక కార్గో టెర్మినల్ నిర్మించారు. దీని ద్వారా ఏటా 25 వేల టన్నుల సరుకును తరలించేందుకు వీలు కలుగుతుంది. ఔషధాలు, సముద్ర ఉత్పత్తులు, రెడీమేడ్ దుస్తులు వంటి ఉత్పత్తుల ఎగుమతికి ఉత్తరాంధ్ర పారిశ్రామిక వర్గాలకు కొత్త మార్గం అందుబాటులోకి రానుంది. భవిష్యత్తులో ఎగుమతులు మరింత పెరిగే కొద్దీ ఈ కార్గో సదుపాయాలను దశలవారీగా విస్తరించే వీలుంది.

పర్యావరణహిత సాంకేతికతలకు ఈ విమానాశ్రయంలో పెద్దపీట వేశారు. తక్కువ విద్యుత్తుతో పనిచేసే హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్ (హెచ్‌వీఏసీ) వ్యవస్థలు, విద్యుత్ ఆదా చేసే లైటింగ్ అమర్చారు. ఇవి నిర్వహణ వ్యయాన్ని తగ్గించడంతో పాటు విద్యుత్ వినియోగాన్ని హేతుబద్ధం చేస్తాయి. 5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ కేంద్రం, వర్షపు నీటి నిల్వ వ్యవస్థ, స్మార్ట్ బిల్డింగ్ నిర్వహణ వ్యవస్థలు, వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలు, విద్యుత్ వాహనాల చార్జింగ్ వసతులు, పర్యావరణ పర్యవేక్షణ మరిన్ని ప్రత్యేకతలు. హరిత భవన ప్రమాణాలకు అనుగుణంగా టెర్మినల్‌ను తీర్చిదిద్దగా, దీన్ని అమెరికా గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (యూఎస్‌జీబీసీ)లో నమోదు చేయడం విమానాశ్రయానికి మరో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. అంతర్జాతీయంగా పర్యావరణహిత భవనాలకు ప్రామాణికంగా భావించే ఈ కౌన్సిల్ గుర్తింపు దక్కడం విశేషం.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయ విస్తరణకు జీఎంఆర్ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది. మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌ఓ) కేంద్రం, లాజిస్టిక్స్ హబ్ కోసం 154 ఎకరాల్లో ఏరోసిటీని, సిబ్బంది కోసం 139 ఎకరాల్లో టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. వీటికి తోడు మరో 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీంతో భోగాపురం కేవలం ప్రయాణికుల విమానాశ్రయంగానే కాక, నిర్వహణ, రవాణా, లాజిస్టిక్స్ సేవలను ఒకచోట అందించే సమగ్ర విమానయాన కేంద్రంగా ఎదగనుంది. ఈ విస్తరణ ప్రణాళికలు పూర్తయితే విమానాశ్రయం చుట్టూ నూతన ఆర్థిక కార్యకలాపాలకు వేదిక ఏర్పడనుంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

మార్క్సిజం-శ్రీరామరాజ్యం



# ప్రజాస్వామ్యంలో రాజసత్త-2

**చరిత్రలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఒక్కసారిగా ఏర్పడినది కాదు. దానికి ముందు ఎందరో రాజనీతి శాస్త్రవేత్తలు తమ గ్రంథాల ద్వారా ప్రజలను, ప్రభుత్వాలను ప్రభావితం చేశారు. ఆదర్శవాదం, ఉదారవాదం వంటివెన్నో ప్రజాస్వామ్యానికి ఆధార స్తంభాలుగా నిలిచాయి.**

రూసో అభిప్రాయం ప్రకారం ప్రజాస్వామ్యం, నియంతృత్వం రెండూ ఏకకాలంలో కలిసి కొనసాగుతూ ఉంటాయి. నియంతృత్వం మానవతకు వ్యతిరేకమని భావిస్తారు. 'పౌరులు స్వతంత్రులుగా ఉండేందుకు బలవంతం చేయబడతారు' అనేది ఒక వింతైన విషయం. ప్రజా సంక్షేమం అనే కల్పనతో, స్వాతంత్ర్యం కల్పించడం అనే పేరుతో మరింతగా బంధ నాల్లోకి నెట్టే వ్యామోహక మాయాజాలం అది.

బోసన్ చెప్పినట్లు, 'అది నియంత ఇచ్ఛ అయినప్పటికీ, ప్రతి రాజ్యం ఇచ్ఛ సామాన్య ఇచ్ఛగానే పరిగణించబడుతుంది.' అతని ప్రకారం, 'పౌరుడు జీవనం సాగించేందుకు బలవంతం చేయాలి, అంటే స్వతంత్రుడిగా ఉండేందుకు బలవంతం చేయాలి.' ప్రజాహితం కోసం పౌరుల ఇష్టానికి వ్యతిరేకంగా కొన్ని పనులలో బలవంతం చేయడం సరైనదే కావచ్చు.

ఉదాహరణకు, ఒక అవివేకి అయిన బాలుడు పథ్యానికి పనికిరాని చెడు ఆహారాన్ని విడిచి, మంచి ఆహారం తీసుకోవడానికి లేదా చేదుగా ఉండే ఔషధాలు సేవించడానికి ఇష్టపడకపోతే, అతనికి హితైషిణి అయిన తల్లి ద్వారా బలవంతంగా అతనిచేత ఆయా పనులు చేయించవచ్చు.

మనకు మేలు చేకూర్చాలనే ఉద్దేశ్యంతోనే వైద్యుడు శస్త్రచికిత్స సమయంలో కోతలు వేస్తాడు; అదేవిధంగా దుష్టబుద్ధిగల కుటిల రాజనీతిజ్ఞుడు శత్రువును చీలుస్తాడు. నేటి కాలంలో వివిధ పాలక పక్షాలు ఇలాంటి పరిస్థితులను సృష్టించి, పౌరులు, ఇతర పక్షాల ప్రచార సాధనాలను అడ్డుకుని, తమ ప్రచారాన్ని మాత్రమే చేస్తాయి. ఇది తమ పార్టీ పాలనను శాశ్వతంగా కొనసాగించే కుట్రే. ఆరోగ్యకరమైన ఔషధం తీసుకోమని బలవంతం చేయడం ఒక విషయమైతే, విషం తినమని బలవంతం చేయడం మరొక విషయం.

పద్దెనిమిదవ శతాబ్దం మధ్యకాలం నుండి పందొమ్మిదవ శతాబ్దం వరకు బ్రిటన్ ,ఫ్రాన్స్ దేశాల్లో ఆధునిక ఆదర్శవాదం ప్రభావం పెరిగింది. స్వాతంత్ర్యం, సోదరభావం, సమానత్వం అనేవి ఫ్రెంచ్ విప్లవంనాటి ప్రధాన నినాదాలు. ఆ స్వరం యూరప్ అంతటా ప్రతిధ్వనించింది. దానిని పేదలు, రైతులు, కార్మికులు తమ సొంతం చేసుకున్నారు. జర్మనీ, ప్రష్యా వంటి మధ్య యూరప్ దేశాలలో జాతీయతాభావం వ్యాప్తి చెందుతోంది. దానికి అనుగుణంగా ఆదర్శవాదం జన్మించింది.

ఉదారవాదం ప్రకారం, రాజ్యం ఒక సాధనం మాత్రమే. దాని కార్యక్షేత్రం పరిమితమైనది. అందులో స్వతంత్రత అంటే స్వేచ్ఛగా జీవనం సాగించడం. దీనికి పూర్తి విరుద్ధంగా, ఆదర్శవాదం ప్రకారం ఆదర్శ రాజ్యం ఒక లక్ష్యం. అది అపరిమితమైనది, నిరపేక్షమైనది. రాజ్యంలోని వివిధ రంగాల్లో దాని జోక్యంపై ఎటువంటి ఆంక్షలు ఉండవు. దీని ప్రకారం స్వతంత్రత అంటే 'రాజ్య నియమాల ప్రకారం జీవనం నడపడం' అని అర్థం. మాంటెస్క్యూ అధికార విభజనను స్వతంత్రతకు అనివార్యమైనదిగా భావించాడు. ఆదర్శవాదులు అధికార విభజనకు అనుకూలంగా లేరు. ఉదార వాదంలో ప్రజాసమ్మతి ప్రధానమైనది.

కాంట్ (1724-1804)ను ఆధునిక ఆదర్శవాదానికి జన్మనిచ్చినవాడిగా పరిగణిస్తారు. అతను కోనిస్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. అతను తత్వశాస్త్రం, రాజనీతి శాస్త్రాలలో పండితుడు, ఆధ్యాత్మికవాది. అతని అభిప్రాయం ప్రకారం, ఒక వస్తువు గురించిన జ్ఞానం దాని నిర్మాణం ద్వారా ఏర్పడదు. కానీ మన మనస్సులో ఆ వస్తువు ప్రతిబింబం ఏర్పడడం ద్వారా లభిస్తుంది. ఒక వస్తువును మనం పుస్తకం అని ఎందుకు పిలుస్తామంటే, అది మన మనస్సుకు పుస్తకంలా కనిపిస్తుంది కాబట్టే. విశుద్ధమైన వివేకానికి జీవితంలో అనుభవం కంటే ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. లాంక్ సంప్రదాయం ప్రకారం కేవలం అనుభవం, ప్రయోగాల ద్వారా మాత్రమే కాదు, వివేకానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. రాజనీతిని గురించి అతను, 'చట్టాల విషయంలో సామాన్యత అవసరం; కానీ దాని ఆధారం వివేకం కావాలి' అని అన్నాడు. అతను ప్రజాస్వా మ్యాన్ని సమర్థిస్తూ, 'రాజతంత్రం ఆదర్శ వ్యవస్థ కాదు; ఎందుకంటే అందులో చట్టాలు వివేకానికి అనుగుణంగా ఉండవు' అన్నాడు.

ప్రజాస్వామ్యంలో కూడా వివేకం లోపిస్తుంది. నిష్పక్షపాతమైన దీర్ఘదృష్టి గల రుషులు ప్రసాదించిన రాజనీతి శాస్త్రాలు, ధార్మిక ఆధ్యాత్మిక తత్వాలు లేకుండా వివేకం భౌతిక జనతంత్రంలో లేదు, నిరపేక్ష రాజతంత్రంలో కూడా లేదు. ఆధ్యాత్మికవాదంపై ఆధారపడిన, ధర్మ నియంత్రిత పాలన వ్యవస్థలోనే వివేకానికి ప్రాముఖ్యత ఉంది. వాస్తవానికి, ఈ దృక్కోణంలో సంవిధానం, నియమాలు కూడా సనాతనమైనవి. వాటిని సృష్టించాల్సిన అవసరం లేదు, కానీ వాటిని నిర్ణయించాలి. అందుకే చట్టాలను రూపొందించే వ్యవస్థను కాకుండా చట్టాలను నిర్ణయించే సంస్థను ఏర్పాటు చేయాలి. కాంట్ సర్వవ్యాప్త నైతిక నియమాలను వ్యక్తికి ప్రేరణనిచ్చేవిగా భావించాడు. ఈ నియమాల ద్వారానే ఇచ్ఛలను నిర్వహించడం, నియంత్రించడం జరుగుతుందని అతను విశ్వసించాడు; లేకపోతే మనిషి నీచమైన నియమాలకు బలై నాశనమైపోతాడు. కాబట్టి, ఈ నైతిక నియమాల ద్వారానే పౌర జీవనం నడవాలని అతను భావించాడు.

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**

**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

80వ స్వాతంత్ర్య దినోత్సవం మరియు వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలు

ASVINS
Specialty Hospitals
Care • Cure • Comfort

40+ Years of Oncology Expertise
Over 7,00,000 Patients Treated
75,000 Successful Surgeries





Dr. G. Suryanarayana Raju
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience



Dr. D. Raghunadharao
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

Expert Treatment At Affordable Prices

We Expertise in Treating All Cancers

We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries

SERVICES

SURGICAL SPECIALTIES:

Anaesthesiology • Breast Surgery • Bone & Soft Tissue Tumors • Gynaecology & Gynaec Oncology Head & Neck Oncology • Minimal Access Surgery • Neurosurgery • Plastic & Reconstructive Surgery • Surgical Oncology Thoracic Oncology • Transplant Surgery • Urology, Andrology & Endo Urology • Vascular Surgery

MEDICAL SPECIALTIES:

Bone Marrow Transplant • Cardiology • Chest Medicine • Endocrinology • Gastroenterology Hematology & Hemato Oncology • Internal Medicine • Intensive Care • Medical Genetics • Medical Oncology • Nephrology & Dialysis • Neurology • Orthopaedic & Rheumatology

**Asvins Specialty Hospitals**

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.

Book Your Consultation Now +91 9440445775

www.asvinshospitals.com

భీమవరంలో
అశ్విన్ క్యాన్సర్ కేర్

ప్రతి నెల మొదటి ఆదివారం

ప్రముఖ సర్జికల్ అంకాలజిస్ట్



డా॥ జి. సూర్యనారాయణ రాజు
M.S. MCh, FRCS, FUICC సర్జికల్ అంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ అంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్

ప్రముఖ గైనో అంకాలజిస్ట్



డా॥ రమణి GSV
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ అంకాలజీ &
ప్రివెంటివ్ అంకాలజీ

అభినవ్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 224338

ప్రతి నెల రెండవ ఆదివారం

ప్రముఖ హెమాటో అంకాలజిస్ట్



డా॥ గెంటే. విక్రమ్ కుమార్
MBBS, MD ఇమ్యునో- హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్), కన్సల్టెంట్ హెమటాలజీ మరియు హెమటో- అంకాలజీ

లోటస్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం 08816 230555

మిత్రా మెడికేర్ హాస్పిటల్, నిర్మలాదేవి ఫంక్షన్ హాల్ దగ్గర, పెదమిరం, పెద్ద అమిరం.

అపాయింట్మెంట్ కొరకు అచ్చయ్య: 98858 45775 సీత: 9618161032

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

ఆ రోజు ఆగస్టు పదిహేను! మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు. అందుకే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో స్వాతంత్ర్యదిన వేడుకలు జరుగుతున్నాయి.

బలభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంతా మువ్వన్నెల రంగుల కాగితాలతో అందంగా అలంకరించబడింది. ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తిగారు జెండా ఎగురవేశారు. ఆ వెంటనే "జనగణమన అధినాయక జయహే" జాతీయ గీతాలాపన మొదలైంది. మువ్వన్నెల జెండా ఠీవిగా రెపరెపలాడుతూ కనిపిస్తోంది. సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీధర్ విద్యార్థులను ఉద్దేశించి...

''ప్రియమైన విద్యార్థినీ విద్యార్థులకు స్వాతంత్ర్యదిన శుభాకాంక్షలు. 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో సిపాయిలు, రాజులు ఓడిపోయారు. ఆ మరుసటి సంవత్సరంలో మన దేశం బ్రిటిష్ రాణి నాయకత్వంలో వారి పాలన కిందకు వెళ్లింది. అనంతరం గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి గొప్పదేశ భక్తుల పోరాటం ఫలితంగా ఆగస్టు 15,1947 మన దేశానికి స్వాతంత్ర్యం లభించింది. మనకు స్వాతంత్ర్యం ఇస్తున్నట్లు బ్రిటిష్ ఆఖరి గవర్నర్ జనరల్ మౌంట్ బాటన్ ప్రకటించడంతో మన దేశ ప్రజలు సంబరాలు జరుపుకున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన దేశం ఎంతో అభివృద్ధి చెందింది. దేశంలో ఎన్నో విశ్వ విద్యాలయాలు, ప్రసిద్ధి చెందిన ఐఐటీలు, ఎన్.ఐ.టీ.లు ఏర్పడ్డాయి. మన దేశానికి తూరుపు, పడమర ప్రాంతాల్లో ఎంతో విస్తారమైన సముద్రతీరం ఉంది. ఆ ప్రాంతాల్లో ఎన్నో నౌకాశ్రయాలు నిర్మితమయ్యాయి.

అలాగే భాక్రానంగల్, నాగార్జునసాగర్, హీరాకుడ్ వంటి భారీ ఆనకట్టలు నిర్మించడం వల్ల వ్యవసాయం ఎంతో అభివృద్ధి చెందింది. రైల్వేలు, రహదారులు, విమాన, నౌకారంగాలను కూడా అభివృద్ధి చేశారు. భిలాయ్, రూర్కెలా, విశాఖ పట్నం, దుర్గాపూర్ లాంటి నగరాలలో ఉక్కు పరిశ్రమలను నెలకొల్పారు.

దేశం ఎన్నో ఉపగ్రహాలను ప్రయోగించడం వల్ల సమాచార వ్యవస్థ బాగా మెరుగుపడింది. 15వేల కిలోమీటర్ల మేర రైల్వే మార్గాలను నిర్మించి రవాణా రంగాన్ని అభివృద్ధి చేశారు. ఇలా ఎన్నో రంగాలలో దేశం అభివృద్ధి చెంది ప్రపంచంలోనే నాలుగవ పెద్ద దేశంగా నిలిచింది. కాబట్టి మీరంతా బాగా చదివి మంచి పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధికి పాటు పడాలని కోరుతున్నాను" అని ప్రసంగాన్ని ముగించారు.


ఆ తరువాత ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి గారు ప్రసంగించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మిఠాయిలు పంచారు.

ఆవరణలో పిల్లలందరు మిఠాయిలు తింటూ ఆనందంగా కబుర్లు చెప్పుకుంటుంటే ఉపాధ్యాయులందరూ హెడ్మాస్టరు గారి గదిలోకి వెళ్లారు.

ప్రతి సంవత్సరం జెండా వందన కార్యక్రమం తరువాత హెడ్మాస్టరు గారి గదిలో ఉపాధ్యాయులకు తేనీటి విందు జరుగుతుంది. అది ఆ స్కూలు ఆనవాయితీ.

హెడ్మాస్టరు గదిలో మాస్టార్లంతా కూర్చున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు పార్వతీశం మాట్లాడుతూ "మాస్టారూ! ఈ రోజు జెండావందనం బాగా జరిగింది. శ్రీధర్ మాస్టారు చాలా ఉత్తేజకరంగా, స్ఫూర్తిదాయకంగా మాట్లాడారు. కానీ, కార్యక్రమానికి మన ఊరి సర్పంచ్ నాయుడుగారు రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు.

"నేను స్వయంగా వెళ్లి పిలిచాను. అయినా రాలేదు. ఆయన కొడుకు రాజుకి బాగా మార్కులు రాలేదని మొన్న ఆయనతో చెప్పాను. బహుశా ఆ కోపం వల్ల రాలేదేమో?" చెప్పారు కృష్ణమూర్తి.



1


# ఏ వెలుగులకీ ప్రస్థానం?



వెంటనే శ్రీధర్ కల్పించుకుంటూ "హెడ్మాస్టరు గారూ! మీరు సర్పంచ్ గురించి ప్రస్తావించారు కాబట్టి చెబుతున్నాను. ఆయన కొడుకు రాజు అల్లరి స్కూల్లో రాను రాను ఎక్కువై పోతోంది. అమ్మాయిల్ని బాగా ఏడిపిస్తున్నాడు. మొన్న సోషల్ మాస్టారు రామారావు గారి అమ్మాయి రోజాని, నిన్న మా అమ్మాయి ప్రియని ఏడిపించాడు. దీని గురించి మీరు ఆలోచించాలి. అవసరం అయితే ఆ నాయుడిని పిలిపించి, కొడుకుని అదుపులో పెట్టుకోవాలని చెప్పండి" అన్నాడు.

"శ్రీధర్! కొడుక్కి నచ్చచెప్పవలసిందిగా సర్పంచ్‌కి ఎన్నోసార్లు సూచించాను. అయినా ఫలితం లేదు. నా ఉద్దేశ్యంలో రాజు తండ్రిమాట వినే రకం కాదు. ఇప్పటికే వాడిని రెండుసార్లు స్కూలు నుంచి సస్పెండ్ చేశాను. అందుకే సర్పంచ్ నాయుడు, నా మీద, మన స్కూలు మీద రగిలిపోతున్నాడు. మన ఎమ్మెల్యే గారికి కూడా మన మీద ఫిర్యాదు చేశాడు.

నెల రోజుల్లో నేను ఇక్కడ నుంచి బదిలీ కావడం ఖాయం. కాబట్టి ఆ రాజు విషయంలో నేనేం చెయ్యలేను. మీరే పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయడం మంచిది. మీరంతా ఆలోచించుకొనీ ఓ నిర్ణయానికి రండి" అన్నారు హెడ్మాస్టర్.



"మాస్టారూ! మేము ఫిర్యాదు చేసేకన్నా ఈ స్కూలుకి హెడ్‌గా మీరు చేస్తేనే బాగుంటుంది. దానికి ఓ విలువ ఉంటుంది. అప్పుడు మనం అంతా ఒక్క మాటమీదే ఉన్నామన్న విషయం అందరికీ తెలుస్తుంది" అన్నాడు పార్వతీశం.

కృష్ణమూర్తి గారు బదులిస్తూ, "గ్రామాల్లో ఇటువంటి రాజకీయాలు సహజం. అయినా నేను బదిలీకి భయపడను. మీరు చెప్పినట్లు మన స్కూలు తరఫున ఒక ఫిర్యాదు పత్రం రాసిస్తాను. మీర ఎస్సైని కలసి దానినిన ఇవ్వండి.అప్పుడు వాళ్లే ఆ రాజు గాడి మీద చర్య తీసుకుంటారు" అన్నాడు.

ఆ తరువాత అందరూ టీ తాగి వెళ్లిపోయారు. బయట శ్రీధర్ కోసం ఆయన కూతురు ప్రియ మామిడి చెట్టు కింద ఎదురు చూస్తూ కనిపించింది. ఆమెను అక్కడ చూడగానే...

"ఏం తల్లీ! ఇంటికెళ్ల లేదా?"అడిగాడు శ్రీధర్.

"లేదు నాన్నగారూ! ఇప్పుడే వచ్చేస్తాను..ఇక్కడే ఉండు అని మీరే కదా చెప్పారు. అందుకే ఉన్నాను" అంది నవ్వుతూ ప్రియ.

"సారీ ప్రియా! హెడ్మాస్టర్ గారి గదిలో ఈరోజు మాకు మీటింగ్ ఇంత సేపు ఉంటుందని అనుకోలేదు" అని చెప్పాను.

తండ్రీకూతురు ఇంటికి బయల్దేరారు.

* * *

శ్రీధర్ బలభద్రపురం పాఠశాలలో సైన్సు టీచరుగా చేరి ఐదు సంవత్సరాలవుతోంది. ఆయనది ఆ ఊరే. ఆ బడిలోనే పదవ తరగతి వరకు చదివి ఆ తరువాత విజయనగరంలో డిగ్రీ వరకు చదివి, బి.ఈడీ చేశాడు.

అదృష్టవశాత్తూ అతనికి వెంటనే టీచరుగా ఉద్యోగం వచ్చింది. మొదట్లో అతడిని అరకు ఏజన్సీ ప్రాంతంలో వేసారు. ఆ తరువాత మళ్లీ డీయస్సీ రాసి బి.ఈడీ అసిస్టెంట్‌గా ఎంపికై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి మారిపోయాడు.

అతని భార్య కౌసల్య. ఆమె కూడా డిగ్రీ చదివినా గృహిణిగానే ఉండిపోయింది.

ఆ దంపతులకు ప్రియ ఒక్కర్తే కూతురు. ఆ ఊరి హైస్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతోంది. ఆమె క్లాసు ఫస్టు. ముఖ్యంగా లెక్కలు, సైన్స్‌లో మంచి మార్కులు వస్తుంటాయి.

''నాన్నగారూ! ఆ రాజు మమ్మల్ని అల్లరి పెడుతున్నాడని హెడ్మాస్టరు గారికి చెప్పారా?'' అడిగింది ప్రియ తండ్రిని.

"చెప్పానమ్మా! నేనే కాదు తెలుగు మాస్టారు, సోషలు మాస్టారు కూడా చెప్పారు.హెడ్మాస్టరు గారు రేపు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.అప్పుడు పోలీసులే వాడి భరతం పడతారు. నువ్వేం గాబరా పడకు. వాడి సంగతి మేము చూసుకుంటాము" అన్నాడు శ్రీధర్.

''నాన్నగారూ! ఎల్లుండి ఆదివారం మా క్లాసువాళ్లంతా పిక్‌నిక్‌కి వెళుతున్నారు. మన ఊరి ఏటి ఒడ్డు తోటలోనే. నేనూ వెళతాను. వంద రూపాయలిస్తే చాలు" అంది ప్రియ.

"మీ ఆడపిల్లలంతా అక్కడికి వెళితే మళ్లీ ఆ రాజుగాడు వాడి గ్యాంగ్‌తో వచ్చి మిమ్మల్ని అల్లరి పెడతాడేమో?మళ్లీ వారం మా మేస్టర్లంతా పిక్‌నిక్ వెళుతున్నాము. అప్పుడు మాతో వద్దువుగానిలే!" చెప్పాడు శ్రీధర్.


"వాడేం రాడు నాన్నా! మా ఫ్రెండ్సు వాళ్ల నాన్నలొస్తామంటున్నారు కాబట్టి భయమేం ఉండదు. వెళతాను నాన్నా" అంది ప్రియ.

"సరేలే! అలాగే వెళ్లు. అమ్మకి చెబుతాను. డబ్బులిస్తుంది" చెప్పాడు శ్రీధర్.

కొద్ది సేపటికి ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు.

''ఇంత ఆలస్యం అయిందేంటి?''అడిగింది కౌసల్య వాళ్లకి నీళ్లు ఇస్తూ...

"హెడ్మాస్టరు గారు టీపార్టీ ఇచ్చారు. అందుకే ఆలస్యమైంది" చెప్పాడు శ్రీధర్.



గన్నవరపు నరసింహమూర్తి

"అమ్మా! నాన్నగారు ఇప్పుడే వస్తానని చెప్పి గంట వరకూ బయటకురాలేదు. అంతవరకూ నేను చెట్టుకింద ఎదురు చూస్తూ నిలబడ్డాను" అంది ప్రియ తండ్రిమీద తల్లికి ఫిర్యాదు చేస్తూ.

"మీ నాన్న ఎప్పుడూ అంతే! కబుర్లలో పడితే ఎవ్వరూ గుర్తుండరు. పదండి భోజనాలు చేద్దురు గాని" అంది లోపలికి వెళుతూ...

ఆ తరువాత ఇద్దరికీ డైనింగ్ టేబుల్ మీద భోజనాలు వడ్డించింది.

"ప్రియ పిక్‌నిక్ వెళతానంటోంది. ఏం చేద్దాం?" అడిగాడు శ్రీధర్ కూర కలుపుకుంటూ.

"నేను వద్దంటే మాత్రం మీరు వింటారా ఏమిటి? కూతురు ఏం అడిగినా ఈ తండ్రి కాదనడని నాకు బాగా తెలుసు? పంపండి. వెళుతున్నది తన స్నేహితురాళ్లతోనే కదా?" అంది కౌసల్య.

"నేను ఏం చేసినా ఈ ఇంటి ఇల్లాలిగా నీకు చెప్పడం నా ధర్మం. నువ్వు వద్దంటే కాదనే ధైర్యం ఎవరికి ఉంది చెప్పు ఈ ఇంట్లో?" అన్నాడు నవ్వుతూ.

ఇంతలో ప్రియ తల్లివైపు చూస్తూ "అమ్మా! మా ఫ్రెండ్స్ చాలా మంది నా పేరు ప్రియ అయితే చేతి మీద 'వనజ' అని పచ్చబొట్టు ఎందుకుంది?అని అడుగుతున్నారు?" అంది తన ఎడమ చేయి మీద 'వనజ' అని రాసి ఉన్న పచ్చబొట్టును చూపిస్తూ.

ఆమె మాటలకు కూతురుకి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక భర్త వైపు చూసింది కౌసల్య.

శ్రీధర్ వెంటనే "ప్రియా! నేను చిన్నప్పుడు అరకు-పాడేరు ఏజన్సీ ప్రాంతంలో పని చేసాను. అప్పుడే నువ్వు పుట్టావు. అక్కడ పుట్టిన వాళ్లకు అక్కడి గిరిజనుల ఆచారం ప్రకారం 'వనజ' అంటే 'అడవి బిడ్డ' అని పచ్చబొట్టు పొడుస్తారు. అందుకే నీకు అలా పచ్చబొట్టు వేయించాము" చెప్పాడు శ్రీధర్.

"అంటే పుట్టగానే నా పేరు 'ప్రియ' అనీ పెట్టలేదా మీరు?" అడిగింది ప్రియ.

"పెట్టాము కానీ అక్కడి వాళ్ల ఆచారం కాబట్టి అలా వేయించాము. అయినా వనజ పేరు కూడా బాగుంది కదా? అయినా పచ్చబొట్టు ఏదైతేనేం నీ పేరు ప్రియే కదా" అన్నాడు శ్రీధర్.

"కానీ ప్రతివాళ్లు 'వనజ' పేరు చూసి నన్ను ఈ ప్రశ్నే అడుగుతుంటారు. ఎంతమందికని చెప్పాలి చెప్పండి?" అంది ప్రియ కోపంగా.

"ఈసారికి అందరికీ ఒకేసారి చెప్పేయ్. అప్పుడు ఇంకెవ్వరూ అడగరు" అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

వాళ్ల మాటలకు విసుక్కున్న కౌసల్య "పచ్చబొట్టు సంగతి సరే! ఆ రాజు గాడు స్కూల్లో అమ్మాయిల్ని ఏడిపిస్తున్నాడట. మొన్న ప్రియ వెంట పడ్డాడట. ఆ విషయం హెడ్మాస్టరు గారికి చెప్పారా?" అడిగింది.

"ఇవాళ మా మేస్టార్లందరం టీ పార్టీ సందర్భంగా హెడ్మాస్టరు గారితో ఈ విషయం చెప్పాం. దీనిపై పోలీసు స్టేషన్‌కి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. రేపో



శ్రీధర్ వెంటనే "ప్రియా! నేను చిన్నప్పుడు అరకు-పాడేరు ఏజన్సీ ప్రాంతంలో పని చేసాను. అప్పుడే నువ్వు పుట్టావు. అక్కడ పుట్టిన వాళ్లకు అక్కడి గిరిజనుల ఆచారం ప్రకారం 'వనజ' అంటే 'అడవి బిడ్డ' అని పచ్చబొట్టు పొడుస్తారు. అందుకే నీకు అలా పచ్చబొట్టు వేయించాము" చెప్పాడు శ్రీధర్. "అంటే పుట్టగానే నా పేరు 'ప్రియ' అనీ పెట్టలేదా మీరు?" అడిగింది ప్రియ. "పెట్టాము కానీ అక్కడి వాళ్ల ఆచారం కాబట్టి అలా వేయించాము. అయినా వనజ పేరు కూడా బాగుంది కదా? అయినా పచ్చబొట్టు ఏదైతేనేం నీ పేరు ప్రియే కదా" అన్నాడు శ్రీధర్.

ఎల్లుండో పోలీసులొచ్చి వాడికి గట్టిగా బుద్ధి చెబుతారు"అన్నాడు శ్రీధర్.

"బుద్ధి చెబుతారో లేక వాడిచ్చే డబ్బులకు కక్కుర్తిపడి వదిలేస్తారో? ఆ పోలీసులు గానీ ఏమీ చెయ్యకపోతే వాడు మరీ రెచ్చిపోతాడు. ఇంక వాణ్ణెవ్వరూ పట్టుకోలేరు. సోషలు మాస్టారు గారైతే వాడి బాధ పడలేక తన కుటుంబాన్ని విజయ నగరానికి మార్చేస్తానంటున్నారట" అంది కౌసల్య.

"నువ్వేం గాబరా పడకు కౌసల్యా! రేపు ఎస్సై గారొస్తే మేము ఆయనతో మాట్లాడతాము. అప్పుడు వాడి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది" అన్నాడు శ్రీధర్.

* * *

ఆ మర్నాడు మధ్యాహ్నం వేళ ఎస్సై సుధీర్ హైస్కూలుకి ముగ్గురు కానిస్టేబుళ్లతో కలసి వచ్చాడు.

హెడ్మాస్టరు కృష్ణమూర్తి ఉపాధ్యాయులందరితో తన గదిలో ఎస్సైతో సమావేశమయ్యారు.

"ఎస్సైగారూ! మా హైస్కూల్లో రెండు వందల మంది పిల్లలు చదువుతున్నారు. చుట్టుపక్కల ఐదు ఊళ్ల నుంచీ కూడా పిల్లలు ఇక్కడికి చదువుకోవడానికి వస్తుంటారు. నాలుగేళ్ల క్రితం ఇదే స్కూల్లో 10వ తరగతి వరకూ చదివిన ఈ ఊరి సర్పంచ్ నాయుడు గారి కొడుకు రాజు మా స్కూలు ఆడపిల్లల్ని బాగా అల్లరి పెడుతున్నాడు.అంటే ఈవ్‌టీజింగ్ చేస్తున్నాడు.

అతనికి ఐదుగురు అనుచరులున్నారు. ఒక విధంగా ఆ ఆరుగురు ఈ ఊరికే కాదు చుట్టుపక్కల ఊళ్లకు కూడా 'రౌడీగ్యాంగ్' అన్నమాట. రోజూ ఉదయం, సాయంత్రం స్కూలు దగ్గరకు వచ్చి అమ్మాయిలను మారుపేర్లు పెట్టి ఏడిపించటం, వాళ్లకి వాట్సాప్‌ల్లో అసభ్యకరమైన మెసేజెస్ పెట్టడం లాంటివి చేస్తుంటారు. ఇది రెండు సంవత్సరాల నుంచీ బాగా ఎక్కువై పోయింది. క్రితం సంవత్సరం ఇదే స్కూల్లో నుంచి ఆరుగురు అమ్మాయిలు వాడి బాధపడలేక టీసీలు తీసుకొని వెళ్లిపోయారు. ఇప్పుడు మా ఉపాధ్యాయులు కూడా తమ పిల్లల్ని ఈ స్కూలులో చదివించడానికి భయపడుతున్నారు.

వారం క్రితం మా సోషలు మాస్టారి గారి అమ్మాయిని, మొన్న సైన్స్ మాస్టారు గారి అమ్మాయిని వాళ్లు బాగా ఏడిపించారు. ఈ స్కూలు హెడ్మాస్టరుగా రెండుసార్లు మీ స్టేషన్లో ఫిర్యాదులిచ్చా. కానీ వాడి మీద ఏ విధమైన చర్య తీసుకోలేదు. దాని వల్ల వాడు మరింత రెచ్చిపోతున్నాడు. మీవల్ల కాకపోతే మేము ఎస్పీగారిని కలుస్తాము" చెప్పారు హెడ్మాస్టరు.

"హెడ్మాస్టరు గారూ! నేను కూడా పదిహేనేళ్ల క్రితం ఇదే స్కూల్లో చదివాను. మండల పోలీస్ స్టేషన్‌కి ఎస్సైగా వచ్చి నాలుగు నెలలవుతోంది. కాబట్టి క్రితంసారి ఏం జరిగిందో నాకు తెలియదు. నిన్ననే మీ పిర్యాదు అందింది. దానిని పరిశీలించి.. అది నిజమైతే తప్పక వాడిమీద చర్యలు తీసు కొంటాను" చెప్పాడు ఎస్సై సుధీర్.

"మీరు ఆ పని చేస్తే ఈ స్కూలుకి, మా అందరికీ ఎంతో మంచి చేసిన వారవుతారు. ఎమ్మెల్యే, సర్పంచ్ గార్ల గురించి మీరేం భయపడకండి. అతనితో మేము మాట్లాడతాము. ఇలా ఆడపిల్లలను ఏడిపించే వాళ్లను ఎవ్వరూ సమర్థించరు" అన్నాడు కృష్ణమూర్తి.

''మాస్టారుగారూ! అతను ఎవరెవరిని ఏడిపించాడో వాళ్లను పిలిపించండి.వాళ్లతోనూ, వారి తల్లితండ్రులతో మాట్లాడతాను. వాళ్ల దగ్గరి నుంచి స్టేట్‌మెంట్లు తీసుకొని వాడిని అరెస్ట్ చేస్తాను" భరోసా ఇచ్చాడు సుధీర్.

వెంటనే హెడ్మాస్టర్ ఆ అమ్మాయిలను పిలిచాడు. వారిలో శ్రీధర్ కూతురు ప్రియ కూడా ఉంది. ఎస్సై వాళ్లతో మాట్లాడి స్టేట్‌మెంట్లు తీసుకున్నాడు. సోషల్, సైన్స్ మాస్టార్లు కూడా తండ్రుల హోదాలో, సర్పంచ్ కొడుకు రాజుకి వ్యతిరేకంగా స్టేట్‌మెంట్లు ఇచ్చారు.

ఆ మర్నాడు ఎస్సై పదిమంది కానిస్టేబుళ్లతో వెళ్లి రాజును, అతని నలుగురు అనుచరులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కి తీసికెళ్లాడు. దాంతో ఊళ్లో గొడవ మొదలైంది. సర్పంచ్ నాయుడు బడి దగ్గరికి వచ్చి హెడ్మాస్టర్‌తో గొడవకి దిగాడు. ఈ విషయం తెలిసిన అతని వ్యతిరేకవర్గం వారు కూడా అక్కడికి భారీగా చేరుకున్నారు. దాంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ మొదలైంది.

గంట తరువాత అక్కడికి భారీగా పోలీసులు చేరుకున్నారు.రెండు వర్గాల వారిని చెదరగొట్టి వాళ్లలో చాలామందిని అరెస్ట్ చేయడంతో సద్దుమణిగింది.

(సశేషం)


# విలువల రాజకీయాలకు ప్రతీక....

ఉన్నత విలువలతో రాజకీయాలు చేయాలనే భావన గల పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ్ ప్రజా సమస్యలపై...ప్రధానంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి అంశాలపై దృష్టి సారించారు. ఎంత ఎదిగినా మూలాలు మరువకపోవడం, నిరాడంబర జీవితం గడిపిన అరుదైన వారిలో ఆయన ఒకరు. దీనదయాళ్ జీవితాన్ని, వ్యక్తిత్వ కోణాలను అధ్యయం చేస్తుంటే సార్థక నామధేయులు (దీన్‌దయాళ్) అనిపించక మానదు. ఆయన సత్యశీలతను మెచ్చి చిన్నప్పుడు 'దీనా' అని పిలిచే వారట. వారి జీవితం, సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిదాయకాలు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, భారతీయ జనసంఘ్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా వారి జీవితం, ప్రసంగాలు సామాజిక, రాజకీయ కార్యకర్తలకు ప్రేరణనిస్తాయి.

దీన్‌దయాళ్ జీవితంలోని అనేకానేక విలువైన ఘటనలు, అనుభవాలను 100 ఎంపిక చేసి ప్రచురించిన గ్రంథం 'పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ (వ్యక్తిత్వం- విభిన్న కోణాలు). క్లుప్తంగా, సరళంగా,సూటిగా చెప్పిన అలనాటి సంఘటనలను, విశేషాలనుబట్టి ఆయన గొప్పతనం, విశిష్టత ఈతరం యువతకు అవగతమవుతా యనడంలో, పాఠకులను ఆకట్టుకుంటాయనడంలో సందేహం లేదు.

దీనదయాళ్ వ్యవహారశైలి, నిబద్ధత పార్టీలకు అతీతంగా అందరికీ ఆదర్శనీయం. ముఖ్యంగా నాయకులు కార్యకర్తలను ఆదరించవలసినతీరు, అదే సమయంలో కార్యకర్తలు వ్యవస్థ/సంస్థ పట్ల చూపవలసిన అంకితభావం వెల్లడవుతుంది. ఎవరు ఏ స్థాయిలో ఉన్నా ఆయా సంస్థలకు అతీతులుకారన్న విషయాన్ని ఆచరణలో చూపారు. 'భావప్రకటన స్వేచ్ఛ' 'ఒకే దేశం-ఒకే సంస్కృతి', సాధారణ ప్రజల స్థాయికి దిగి విషయాన్ని వారికి అర్థమయ్యే భాషలో చెప్పడం (కఠినమైన విషయాన్ని సులభంగా చెప్పడం), పార్టీలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా, వివిధ అంశాలపై కార్యకర్తలతో విస్తృతంగా సకారాత్మక చర్చలు అవసరమని భావించారు.

ఉన్నతులైనా సామాన్యులతో వ్యవహరించిన ఆయన శైలి ఇతరులకు మార్గదర్శకం. మంచి ఎక్కడ ఉన్నా స్వీకరించాలనేందుకు దీనదయాళ్ అనుసరించిన వాటిలో ఒక ఉదాహరణను ప్రస్తావించారు రచయిత. పండిట్‌జీ వామపక్ష భావజాలాన్ని వ్యతిరేకించారేమో కానీ..పార్టీ నిర్మాణంలో ఆ పక్షం అనుసరించే పద్ధతిని కాదనలేకపోయారు. జనసంఘ్‌ను బలోపేతం చేసే యత్నంలో భాగంగా, దేశవిదేశాల్లోని ప్రధాన రాజకీయ పక్షాలను నిశితంగా పరిశీలించిన ఆయనకు 'కమ్యూనిస్టు పార్టీ శిక్షణ శిబిరాలు నిర్వహించే సంప్రదాయం బాగా నచ్చింది'ట. అలాగే, కేవలం ఓట్ల కోసం కులమత రాజకీయాలకు ఆయన బద్ధవ్యతిరేకి. 'కాంగ్రెస్ ముస్లింలీగ్‌తో ఒప్పందం చేసుకొన్న తరహాలో మనం వ్యవహరించలేమా?' అన్న జనసంఘ్ కార్యకర్తల ప్రశ్నలకు, 'వారితో (ముస్లింలు) స్నేహ సంబంధాలు కలిగి ఉండాలి కానీ ఓట్లను దృష్టిలో ఉంచుకొని ఏమీ చేయలేం' అన్నది ఆయన జవాబు. విలువల రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం అనేందుకు మరో సంఘటనను ఉదహరించింది ఈ గ్రంథం. ఎన్నికల ప్రచార సభలలో ప్రతిపక్షాలపై విమర్శలను సంధించకపోతే, ఓటర్లపై ప్రభావం ఉండదనే వాదనను మృదువుగా తోసిపుచ్చుతూ, 'ఓట్ల కోసం నా భాషను, శైలిని మార్చుకోను. నా దృష్టిలో ప్రతిపక్షాన్ని కానీ, ప్రత్యర్థులను కానీ విమర్శించడం అనైతికం' అన్న మాటలు వర్తమాన రాజకీయవాదులకు వింతగా అనిపించవచ్చు కానీ ఆ పలుకులు సార్వకాలీక అనుసరణీయాలు.




**పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్**
(వ్యక్తిత్వం-విభిన్న కోణాలు)
మరాఠీ మూలం: **డా.నితిన్ ఖర్చే**
తెలుగు అనువాదం: **డా. దోనెపూడి రామాంజనేయ శర్మ**
వెల: **రూ.150**, పే.: **114**
ప్రతులకు:
**డా. డి.ఆర్. శర్మ, 7013473708**
**డా. డి. నరేశ్ బాబు, 9491416696**

అత్యంత శాంతమూర్తిగా పేరున్న ఆయనలో ఆగ్రహమూ అప్పుడప్పుడు తొంగిచూసేదట. ఒకసారి రైలు బోగీలో ఇద్దరు బిచ్చగత్తెలకు దొంగతనం ఆపాదించి లాఠీతో కొడుతున్న పోలీసు చేయి పట్టుకొని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, 'ఒకవేళ ఈ మహిళలు నేరస్తులే అయితే న్యాయస్థానాలు శిక్షిస్తాయి. ఇలా గొడ్డును బాదినట్లు కొట్టే అధికారం మీకు లేదు' అని వారించారు. 'నేను ఉపాధ్యాయ్‌గారితో కలిసి ఇన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాను, కానీ ఆయన రౌద్ర రూపం ఇలా ఎప్పుడూ చూడలేదు' అన్న జనసంఘ్ కార్యకర్త మాటలు ఆయన ఈ ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేస్తాయి.

'పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ వ్యక్తిత్వం, ఆలోచనలు, వివిధ కోణాలు చాలామంది యువకులను మానసిక వ్యాకులత నుంచి బయటికి తీసుకురాగల సామర్థ్యం కలిగి ఉన్నాయి' అని ఈ గ్రంథాన్ని హిందీలోకి అనువదించిన డాక్టర్ సునీల్ బాబూరావు కులకర్ణి ఒక వాక్యంలో పండిట్‌జీ ఉన్నతిని పేర్కొన్నారు. మరాఠాలో డాక్టర్ నితిన్ ఖర్చే రాసిన పుస్తకాన్ని డాక్టర్ కులకర్ణి హిందీలోకి, ఢాక్టర్ భూషణ్ భావే కొంకణి భాషలోకి అనువదించగా, డాక్టర్ దోనేపూడి రామాంజనేయశర్మ తెలుగులోకి తర్జుమా చేశారు. సమాజ, ప్రజల సంక్షేమమే తప్ప, సంస్థను, వ్యవస్థను అడ్డుపెట్టుకొని పబ్బం గడుపుకోవడం తమ విధానం కాదన్నది దీన్‌దయాళ్ నిర్దిష్ట అభిప్రాయం. దేశనిర్మాణమే ప్రధాన ధ్యేయంగా భారతీయ జనసంఘ్ ఆవిర్భవించింది. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అవినీతికి పాల్పడుతున్నట్లే, మీరు అధికారానికి వస్తే అలా వ్యవహరించరన్న నమ్మకం ఏమిటి?' అన్న ఒక ప్రముఖుడి ప్రశ్నకు 'అలా జరిగితే పార్టీని రద్దుచేసి, మరో జనసంఘ్‌ను ఏర్పాటు చేస్తాం. అది సరిగా పనిచేయకపోతే మరో జనసంఘ్‌ను స్థాపిస్తాం' అని (దేశమే సర్వోన్నతం.. వ్యవస్థ కాదు) జవాబు. అఖండ భారత నిర్మాణం దీనదయాళ్ ధ్యేయం.అది తమ పార్టీకి అత్యంత మౌలిక అంశమని భారతీయ జన్‌సంఘ్ ఆవిర్భావం లోనే స్పష్టంగా చెప్పారు.

**– డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**




# బహుముఖ యుద...

# ప్రపంచ వాణి...

**ఉక్రెయిన్, రష్యా, ఇరాన్ దేశాల మధ్య సంబంధాలు ఉద్రిక్త స్థాయికి చేరుకోవడం తాజా పరిణామం! పశ్చిమాసియా సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఒకదానితో ఒకటి ముడిపడి ప్రాంతీయ యుద్ధంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఈ మూడు దేశాల మధ్య నడుస్తున్న తాజా రాజకీయ, సైనిక పరిణామాలు ఈ విధంగా ఉన్నాయి. జూలై 25న కాస్పియన్ సముద్రంలో ఇరాన్‌కు చెందిన ఒక వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ డ్రోన్ దాడిచేసింది. రష్యా, ఇరాన్‌ల మధ్య సైనిక సామగ్రిని, డ్రోన్ల విడిభాగాలను రవాణా చేస్తున్న మార్గాలను లక్ష్యంగా చేసుకునే తాము ఈ దాడి చేశామని ఉక్రెయిన్ ప్రకటించింది. ఈ దాడికి ప్రతీకారంగా ఉక్రెయిన్‌కు చెందిన ఓడరేవుపై చిన్న స్థాయి బాలిస్టిక్ క్షిపణితో దాడి చేయాలని ఇరాన్ భావించింది. అయితే తీవ్ర దౌత్య చర్చల తర్వాత ప్రస్తుతానికి ఆ పరిస్థితి సర్దుమణిగింది.**

రష్యా ఉక్రెయిన్‌పై వాడుతున్న 'షాహిద్ రకం డ్రోన్లను ఇరాన్ లైసెన్స్‌తోనే రష్యా భారీగా ఉత్పత్తి చేస్తోంది. వీటికి ప్రతిగా రష్యా ఇరాన్‌కు ఎలక్ట్రానిక్ ఆయుధ సాంకేతికతను అందిస్తోంది. అమెరికా అభ్యర్థన మేరకు ఇరాన్ డ్రోన్ దాడులను తిప్పికొట్టడంలో సహాయం చేయడానికి ఉక్రెయిన్ తన సైనిక నిపుణులను ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలకు పంపింది. రష్యా డ్రోన్లను ఎదుర్కోవడంలో తమకున్న నాలుగేళ్ల అనుభవాన్ని ఉక్రెయిన్ ఇప్పుడు గల్ఫ్ దేశాలకు, అమెరికా బలగాలకు అందిస్తోంది. మొత్తంగా, ఇరాన్ రష్యాకు అనుకూలంగా పనిచేస్తుండగా, ఉక్రెయిన్ అమెరికా-ఇజ్రాయెల్ కూటమికి మద్దతుగా నిలుస్తూ ఇరాన్ సరఫరా మార్గాలను దెబ్బతీస్తోంది.

**ప్రపంచ యుద్ధంగా మారే ప్రమాదం**


ఉక్రెయిన్, రష్యా, ఇరాన్, అమెరికాల మధ్య ప్రస్తుత ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే, ఇది ఒకే ఒక ప్రపంచ యుద్ధంగా మారే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవలి పరిణామాల వల్ల యుద్ధం నల్లసముద్రం నుండి కాస్పియన్ సముద్రం వరకు విస్తరిస్తోంది. రష్యా పరోక్షంగా అమెరికాపై దాడులకు ఇరాన్‌కు తోడ్పడుతుంటే, ఉక్రెయిన్ అమెరికాకు సాయపడుతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అమెరికా-ఇరాన్ సంక్షోభం విడివిడిగా కాకుండా ఒకే పెద్ద అంతర్జాతీయ యుద్ధంగా రూపాంతరం చెందే అవకాశం ఉంది. ఒకవేళ ఇరాన్ లేదా రష్యా నేరుగా ఏదైనా నాటో దేశాన్ని లక్ష్యంగా చేసుకుంటే, పశ్చిమ దేశాలన్నీ నేరుగా యుద్ధంలోకి రాక తప్పదు. ఈ ఉద్రిక్తతల క్రమంలో అమెరికా, యూరప్, జపాన్‌లతో పాటు భారత్ వంటి దేశాలలో తీవ్ర ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం వచ్చే ముప్పు ఉంది.

**అమెరికా, చైనాల పాత్ర కీలకం**

ఉక్రెయిన్, రష్యా, ఇరాన్ సంక్షోభంలో అమెరికా, చైనాలపాత్ర అత్యంత కీలకంగా మారింది. ఈ రెండు దేశాలు భిన్నమైన వ్యూహాలతో ఈ అంతర్జాతీయ రాజకీయాలను నడిపిస్తున్నాయి. అమెరికా ఒకే సమయంలో అటు ఉక్రెయిన్‌కు, ఇటు ఇజ్రాయెల్‌కు భారీగా ఆయుధాలు, నిఘా సమాచారాన్ని అందిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒకవైపు ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తే తీవ్ర సైనిక చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూనే, మరోవైపు యుద్ధం మరింత విస్తరించకుండా తెరవెనుక దౌత్య చర్చలు జరుపుతున్నారు. ఇక చైనా ఈ సంక్షోభంలో నేరుగా సైనిక జోక్యం చేసు కోకుండా, రష్యా-ఇరాన్ కూటమికి ఆర్థిక, దౌత్య పరమైన కొండంత అండగా నిలుస్తోంది. అమెరికా, ఐరోపా దేశాలు రష్యా, ఇరాన్‌లపై కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ, చైనా ఆ దేశాల నుండి భారీగా ముడి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తూ వారి ఆర్థిక వ్యవస్థలు పతనం కాకుండా కాపాడు తోంది. ఐక్యరాజ్య సమితిలో రష్యా, ఇరాన్‌లకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాలు తెచ్చే తీర్మానాలను చైనా అడ్డుకుంటోంది. తద్వారా, ఈ ప్రాంతంలో అమెరికా ప్రభావాన్ని తగ్గించాలని ప్రయత్నిస్తోంది.

**భారత్-గల్ఫ్ దేశాల ప్రత్యామ్నాయ ప్రణాళికలు**

హోర్మూజ్ జలసంధి సంక్షోభం నేపథ్యంలో, భారతదేశం, గల్ఫ్ దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ భారీ వ్యూహాత్మక ప్రణాళికలను అమలు చేస్తున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఇంధన సరఫరా నిలిచిపోకుండా ఉండేందుకు గల్ఫ్ దేశాలు కొత్త పైప్‌లైన్లు, పోర్టులను నిర్మిస్తున్నాయి. సౌదీ అరేబియా, యూఏఈలు తమ ముడి చమురును హోర్మూజ్ గుండా కాకుండా భూమార్గంలో పైప్‌లైన్ల ద్వారా నేరుగా అరేబియా సముద్ర తీరానికి చేర్చేలా కొత్త మాస్టర్ ప్లాన్‌ను వేగవంతం చేశాయి. భారత్ తన ముడిచమురు అవసరాలలో 80% పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. హోర్మూజ్ జలసంధి మూతపడినా గల్ఫ్ దేశాల బైపాస్ మార్గాల వల్ల భారత్‌కు చమురు కొరత రాకుండా రక్షణ లభిస్తుంది. యుద్ధ వాతావరణంఉన్న మార్గాలలో నౌకల ప్రయాణ బీమాఖర్చు విపరీతంగా పెరుగుతున్నది. భారత్ వంటి అతిపెద్ద కొనుగోలుదారుకు నిరంతరం సరఫరాచేయడం గల్ఫ్‌దేశాల ఆర్థికవ్యవస్థకు అత్యంత కీలకం. అంతర్జాతీయ చమురు మార్కెట్‌ను బ్లాక్ మెయిల్ చేసే ఇరాన్ భౌగోళిక వ్యూహాలకు ఈ కొత్త మార్గాలు అడ్డుకట్టవేస్తాయి. గతంలో ప్రకటించిన ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ) ప్రస్తుత యుద్ధం కారణంగా నెమ్మదించినప్పటికీ, ఇప్పుడు దీనిని రక్షణ కవచంగా మారుస్తున్నారు. ఇందులో రెండు మార్గాలున్నాయి, భారతదేశాన్ని గల్ఫ్ దేశాలతో కలిపే తూర్పు


సిల్క్ రోడ్ ఆన్ ఐస్




# ...ద్ధాలతో ...ణిజ్యం కుదేలు!

కారిడార్, రెండవది గల్ఫ్‌ను ఐరోపాతో కలిపే ఉత్తర కారిడార్. ఇజ్రాయెల్–ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా ఉత్తర కారిడార్ (జోర్డాన్, ఇజ్రాయెల్ మార్గం) కొంత నెమ్మదించింది. దీనివల్ల భారత్, యూఏఈ, సౌదీ అరేబియాలు ప్రస్తుతానికి తూర్పు కారిడార్‌ను పూర్తి స్థాయిలో బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాయి. దీనికి సంబంధించిన నిర్వహణ ఒప్పందాలు జరిగాయి. ఎర్ర సముద్రం, సూయజ్ కెనాల్ మార్గాల్లో హూతీల దాడులవల్ల సముద్ర గర్భంలో ఉండే ఇంటర్నెట్ డేటా కేబుల్స్ దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఐఎంఈసీ ఇప్పుడు ప్రపంచ డేటా రక్షణకు ఒక ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈమార్గం ద్వారా భారతదేశం నుండి గల్ఫ్ దేశాల మీదుగా ఐరోపాకు అత్యంత వేగవంతమైన ఫైబర్–ఆప్టిక్ డిజిటల్ కేబుల్స్ వేస్తున్నారు. గల్ఫ్ దేశాలలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ హైడ్రోజన్, విద్యుత్తును క్లీన్‌ఎనర్జీ పైప్‌లైన్లు, గ్రిడ్లద్వారా భారత్‌ను, ఐరోపాను అనుసంధానించేలా మౌలిక వసతులను రూపొందిస్తున్నారు. భారత ఓడరేవుల నుండి యూఏఈ పోర్టులకు, అక్కడి నుండి సౌదీ అరేబియా మీదుగా రైలు మార్గాల ద్వారా సరుకు రవాణా చేసేలా మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇది కేవలం చమురుకే కాకుండా మొత్తం ద్వైపాక్షిక వాణిజ్యానికి కొత్త రూపునిస్తుంది. సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించి, రైల్ నెట్‌వర్క్ ద్వారా సరుకులను ఓడరేవులకు చేర్చడంవల్ల రవాణా సమయం 40%, ఖర్చు 30% వరకు తగ్గుతుందని అంచనా. మొత్తంగా, ఐఎంఈసీ కారిడార్ అనేది కేవలం చైనా 'బెల్ట్ అండ్ రోడ్స్ (బీఆర్ఐ) ప్రాజెక్టుకు పోటీ మాత్రమే కాకుండా, మారుతున్న అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులలో ప్రపంచ సరఫరా గొలుసును కాపాడే ఒక లైఫ్ లైన్‌గా రూపాంతరం చెందుతోంది.

**అమెరికా వ్యూహాత్మక పాత్ర**

ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌లో అమెరికా పాత్ర అత్యంత వ్యూహాత్మకమైనది. ఈ ప్రాజెక్టును కేవలం ఒక రవాణా మార్గంగా కాకుండా, చైనా ప్రాభవాన్ని తగ్గించడానికి, ఇరాన్ ఉద్రిక్తతల నడుమ తన జాతీయ భద్రతను కాపాడుకోవడానికి అమెరికా ఒక ప్రధాన ఆయుధంగా వాడుకుంటోంది. నియమ నిబంధనలతో కూడిన అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి ఈ కారిడార్‌ను గట్టిగా సమర్థిస్తోంది. అరబ్ దేశాలు, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలను సాధారణీకరించి, పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి దీనిని అమెరికా ఒక వారధిగా వాడుకుంటోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత దేశాన్ని ఒక తయారీ, సేవల హబ్‌గా మార్చడం ద్వారా చైనాపై ప్రపంచ దేశాలు ఆధారపడటాన్ని తగ్గించాలని అమెరికా వ్యూహం. ఈ కారిడార్ వెంబడి వేసే డిజిటల్ నెట్‌వర్క్‌లలో చైనా హ్యాకింగ్ టెక్నాలజీ లేకుండా, అత్యంత సురక్షిత మైన సాంకేతిక సహాయం అమెరికా అందిస్తోంది. అయితే యుద్ధం వల్ల ప్రాజెక్ట్ కొంత నెమ్మదించింది.

**రష్యా, చైనాల సొంత వాణిజ్యమార్గాలు**

అమెరికా–భారత్ నేతృత్వంలోని ఐఎంఈసీ కారిడార్‌కు పోటీగా చైనా, రష్యాలు తమ సొంత అంతర్జాతీయ వాణిజ్య మార్గాలను అత్యంత వేగంగా అభివృద్ధి చేస్తున్నాయి. ప్రపంచ వాణిజ్యంపై తమ పట్టును పెంచుకోవడానికి ఈ రెండు దేశాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. చైనా–రష్యా దేశాలు ముందుకు తెస్తున్న ప్రధాన ప్రత్యామ్నాయ మార్గాలీవిధంగా వున్నాయి.

**రష్యా–ఇరాన్–భారత్ మార్గం:** ఇది రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నుండి ఇరాన్ మీదుగా భారతదేశంలోని ముంబై ఓడరేవును కలిపే 7,200 కిలోమీటర్ల పొడవైన నౌక, రైలు, రహదారి మార్గం. తన ముడిచమురును ఈ మార్గం ద్వారానే రష్యా ఎగుమతులు చేస్తోంది.


**చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ ఐ):** చైనా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బిలియన్ డాలర్ల 'బెల్ట్ అండ్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (బీఆర్ఐ)లో భాగమైన చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) గుండా వెళుతుంది. చైనా ఈ మార్గం ద్వారా పాకిస్తాన్‌లోని గ్వాదర్ పోర్ట్‌ను తన దేశంతో అనుసంధానించి, అవసరమైతే నేరుగా ఇక్కడి నుండి భూమార్గం ద్వారా చమురు రవాణా చేసుకోగలదు.

**రష్యా నార్తర్న్ సీ రూట్ (ఎన్ఎస్ఆర్):** గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఆర్కిటిక్ మహాసముద్రంలోని మంచు కరుగుతుండటంతో రష్యా ఈ కొత్త సముద్ర మార్గాన్ని తెరిచింది. ఇది ఆసియా, ఐరోపాలను రష్యా ఉత్తర తీరం గుండా కలుపుతుంది. దీని అభివృద్ధికై చైనా రష్యాకు భారీగా నిధులు సమకూరుస్తోంది. నాటో జోక్యం చేసుకోలేని, రష్యా పూర్తి అధీనంలో ఉన్న దీనిని "సిల్క్ రోడ్ ఆన్ ఐస్" అంటున్నారు. ప్రస్తుతం ప్రపంచం రెండు పెద్ద వాణిజ్య కూటములుగా విడిపోతోంది. భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఏ కూటమి శాసిస్తుందనేది ఈ మార్గాల విజయంపైనే ఆధారపడి ఉంటుంది.

**వాణిజ్య మార్గాలపై బహుముఖ యుద్ధాల ప్రభావం**

ఈ బహుముఖ యుద్ధాలు అంతర్జాతీయ వాణిజ్య మార్గాలపై తీవ్రమైన ప్రభావం చూపుతూ, ఈ వాణిజ్య కారిడార్లను దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యంగా సాగుతున్నాయి. ఐఎంఈసీ ప్లాన్ ప్రకారం గల్ఫ్ దేశాల నుండి సరుకులు రైలు మార్గంలో జోర్డాన్ మీదుగా ఇజ్రాయెల్‌లోని హైఫా పోర్టుకు చేరాలి. అక్కడి నుండి సముద్ర మార్గంలో యూరప్‌కు వెళ్లాలి. యుద్ధం కారణంగా పశ్చిమ దేశాల ప్రైవేట్ కంపెనీలు ఈ ప్రాంతంలో మౌలిక వసతులపై పెట్టుబడులు పెట్టడానికి వెనకాడుతున్నాయి. దీనివల్ల ఐరోపా వైపు వెళ్లే మార్గం తీవ్రంగా ఆలస్యమవుతోంది. రష్యా–ఇరాన్–భారత్‌లను కలిపే ఐఎన్ఎస్‌టీసీ మార్గానికి కాస్పియన్ సముద్రం అత్యంత కీలకం. అయితే ఇటీవలి ఉద్రిక్తతల వల్ల ఈ సురక్షిత మార్గం కూడా ఇప్పుడు యుద్ధరంగంగా మారింది. ఇది భారత్–రష్యా వాణిజ్యవేగాన్ని తగ్గిస్తోంది. చైనా తన బీఆర్ఐ మార్గాలను ఇరాన్, ఇరాక్, సిరియా మీదుగా ఐరోపాకు అనుసంధానించాలని చూసింది.

హూతీలు వాణిజ్య నౌకలపై చేస్తున్న క్షిపణి దాడుల వల్ల ప్రపంచ నౌకలన్నీ సూయజ్ కెనాల్‌ను వదిలేసి, ఆఫ్రికా ఖండాన్ని చుట్టుకుని వెళ్తున్నాయి. ఈ సంక్షోభమే భారత్, గల్ఫ్ దేశాలు హోర్ముజ్, ఎర్ర సముద్రాలకు దూరంగా కొత్త ప్రత్యామ్నాయ మార్గాలను వేగంగా పూర్తి చేయాలనే పట్టుదలను పెంచింది. ప్రస్తుత యుద్ధాలు ఈ వాణిజ్య మార్గాలను తాత్కాలికంగా దెబ్బతీసినప్పటికీ, దీర్ఘకాలంలో వీటి ప్రాధాన్యతను మరింత పెంచాయి.




**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

**ప్రధాని నరేంద్రమోదీ 12 సంవత్సరాల పాలన దాటిన వేళ మన దేశంలో ఒక చిత్రమైన చర్చ జరిగింది. ప్రజలచేత ఎన్నికైన ప్రధానిగా నరేంద్రమోదీ జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించాడు అంటూ కొందరు సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టారు. వెంటనే కాంగ్రెస్‌పార్టీవారు, ఆ పార్టీలతో సంబంధంలేని నెహ్రూ అంధభక్తులు రంగంలోకి దిగారు. నెహ్రూ ప్రధాని పదవీ కాలాన్ని ప్రజలు ఎన్నుకున్న, ప్రజల మద్దతు లేనిదిగా విడగొట్టి చూడడం ఒక నేరంగా వారి వాదనలు సాగాయి. ఈ నెహ్రూ భక్త బృందానికి ఆయన పటం మీద ఈగ వాలినా ఇబ్బందే. ఇక ఆయన కీర్తి కిరీటంలోని ఒక రాయిని తొలగిస్తామంటే ఎలా ఊరుకుంటారు. వారిష్టం వచ్చినట్టు వారి పోస్టులు పెట్టారు. అదంతా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగం అని, రాజ్యాంగం ప్రసాదించినదని అన్నారు. వారి మీద తిరిగి అలాంటివి గుప్పిస్తే ఆ భక్తులంతా తమని ట్రోలింగ్ చేస్తున్నారంటూ గింజుకున్నారు. తమ విమర్శలు సహేతుకం, ఇతరులు చేసే విమర్శలు దురద్దేశపూర్వకం అనే ఈ అంధభక్తుల ధోరణితోనే అసలు చిక్కు**

# నెహ్రూ నిర్వాకాలు (1947-52)

జవహర్‌లాల్ నెహ్రూ విమర్శలకు అతీతుడని, ఆయన మీద ఉమ్మేయడమంటే ఆకాశంలోకి ఉమ్మేయడమేనంటూ ఒక నెహ్రూ భక్తుడు, కమ్యూనిస్టు ఒకరు, తమ సొంత దినపత్రికలో వ్యాసం రాశాడు. అంత అంధభక్తి పనికి రాదని, నెహ్రూ చేసిన తప్పు లను ఎత్తి చూపటం ఎంత అవసరమో వివరిస్తూ నేను అదే పత్రికకు సమాధాన వ్యాసం రాసి పంపాను. కాని ఆ నెహ్రూ భక్త కమ్యూనిస్టు పత్రిక వారు దానిని ప్రచురించలేదు. నేను రాసిన దానిలో ఒక్కటంటే ఒక్కటి కూడా వ్యక్తిగత విమర్శ కాదు. అంతా నెహ్రూ అనుసరించిన విధి, విధానాలకు సంబంధించినది మాత్రమే. ఆ ప్రధానివల్ల దేశానికి జరిగిన నష్టం గురించే. అయినా ఆ ప్రశ్నించేవర్గం, భావవ్యక్తీకరణకు కట్టుబడి ఉంటామనే ఎర్రోళ్ల పత్రికలో నెహ్రూ మీద విమర్శనకు స్థానం ఇవ్వలేదు.

జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని పదవి ప్రారంభ దినం నుండి మరణం వరకు సాగిన కాలాన్ని నిశితంగా పరిశీలించటం, విమర్శ నాత్మకంగా విశ్లేషించటం ఈ దేశంలో జరగనివ్వ లేదు. ఆయన ప్రభుత్వ నిధులు, ప్రభుత్వ పదవుల నిచ్చి ఒక మేధోవర్గపు కంచెను తన చుట్టూ నిర్మించుకున్నాడు. ఆ కంచెగా ఏర్పడిన వర్గంలో విశ్వవిద్యాలయాల్లో



డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు

సీనియర్ జర్నలిస్ట్

ఆయన ద్వారా ప్రొఫెసర్ పోస్ట్ పొందినవారు, చరిత్రకారులు చాలామంది ఉన్నారు. విమర్శలను నెహ్రూని తాకకుండా అడ్డు గోడలా నిలవటమేకాదు ఆయన ఒక మేధావి, సైంటిఫిక్ టెంపర్ ఉన్నవాడు, విజ్ఞానశాస్త్రం ఔపాసనం పట్టినవాడూ, విమర్శలను సహించే సహనశీలి వంటి పలురకాల భుజకీర్తులు తగిలిస్తూ ప్రభుత్వ ఖర్చుతో, ప్రభుత్వ విభాగాల ద్వారా ప్రజలలోకి తీసుకువెళ్లారు. ఆ విధంగా నెహ్రూని అంత ఎత్తున, మరే భారతీయ నాయకుడు చేరుకోలేని స్థానంలో నిలిపే ప్రయత్నం మేధో అంధభక్తులు చేశారు.

అయితే వాస్తవం భిన్నమైనది. నెహ్రూను ప్రజలు ఎన్నుకున్నాక,ఆయన పాలించిన కాలం 12ఏళ్లు మాత్రమే అనేది నిజం. భారతదేశానికి స్వతంత్రం ప్రకటించాలన్న నిర్ణయం తీసుకున్న బ్రిటీష్‌పాలకులు తమ భావజాలం భారత దేశంలో కొనసాగించే మనిషి కోసం వెతికి, నెహ్రూని ఎంచుకున్నారు. భారతీయత నచ్చని, హిందూ అనే పదం వినటానికి ఇష్టపడని, భారతీయ సంస్కృతి మెచ్చలేని లక్షణాలను ప్రధానిని చెయ్యటానికి తగిన అర్హతలుగా బ్రిటీష్‌వారు భావించారు.

నెహ్రూ ఆలోచనల్లో తెల్లదొర.అందుకే ఆయనకు భారతదేశంలో ఉన్న విశిష్టత తెలియక, దానిని వెతుక్కోవాల్సి వచ్చింది. 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' అంటే తనకు తెలియనిది వెతుక్కోవటమే కదా! అదే ఆయన రాసిన గొప్ప పుస్తకం పేరు అని నెహ్రూ అంధభక్తులు అంటారు.

ఆగస్టు 14-15 తేదీల్లో జరిగిన అంశాలు నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు, ఆయన చేసిన ప్రసంగం జాగ్రత్తగా గమనిస్తే ఆయనలోని డొల్లతనం అర్థమవుతుంది.

స్వతంత్ర భారతదేశంలో తొలి 'క్విడ్‌ప్రోకో' నెహ్రూని ప్రధానిగా మౌంట్‌బ్యాటన్ నియమించటం. దానికి ప్రతిఫలంగా మౌంట్‌బ్యాటన్‌ని తొలి గవర్నర్ జనరల్‌గా నెహ్రూ అంగీకరించటం, బ్రిటిష్ సైనిక అధికారిని భారత సైనికజనరల్‌గా కొనసాగించడం. అంతేకాదు, భారత్‌ను రెండూ దేశాలుగా విడదీసి ఇటు భారత్, అటు పాకిస్తాన్ సైనిక దళాలకు బ్రిటీష్ జనరల్స్ ఉండి 1947 కశ్మీర్ యుద్ధం నడిపించారు. దీనివలన బ్రిటీష్‌వారి కుట్ర కొనసాగుతోందన్న ఆలోచన నెహ్రూకు రాలేదు. తనకి ప్రధాని పదవి దక్కితే చాలనుకున్నాడు.

ప్రధాని పదవికోసం ఆయన ఎంతగానో వేచి చూశాడు. అది అందుకున్న సమయంలో, ఆ ఉత్సాహంలో ఆయన ఏం చేస్తున్నాడో తెలియనంత ఆనందంలో తేలిపోతున్న వైనం రామచంద్ర గుహ పుస్తకం, 'ఇండియా ఆఫ్టర్ గాంధీ'లో చూడవచ్చు. ఇదీ నా మంత్రివర్గం అంటూ కవర్ తీసుకువెళ్లి, గవర్నర్ జనరల్ మౌంట్‌బ్యాటన్‌కి ఇచ్చాడు నెహ్రూ. మౌంట్ బ్యాటన్ కవర్ తెరిస్తే అది ఖాళీ కవరు. అందులో అసలు కాగితమే లేదు. నెహ్రూ పాలన ఎలా ఉండబోతున్నదో ఆ రోజే తెలిసింది.

ఇక అర్ధరాత్రి ఆయన చేసిన 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని అతి గొప్ప ప్రసంగంగా ప్రస్తావిస్తుంటారు అంధభక్తులు. నెహ్రూ ప్రసంగం టైటిల్‌లోనే 'డెస్టినీ' అనే పదం ఉంది. దానికి తెలుగు అర్థం 'విధి' అంతగా హేతువాద, నాస్తికవాదిగా చెప్పుకునే నెహ్రూ 'విధి'ని నమ్మటం ఏమిటి? నేను యిలా పాలిస్తా అని చెప్పలేక 'విధి' మీద వదిలినవాడు మన తొలి ప్రధాని. అందుకే భారతదేశం, భారతీయత పునాది మీదకాక విదేశీ ఆలోచనాధోరణి, విధానాల మీద సాగింది ఆయన పాలన.

నెహ్రూ తొలి ప్రసంగ ప్రారంభవాక్యం

గుర్తుందా?

When the whole world is sleeping India is raising (ప్రపంచమంతా నిద్రపోతుండగా భారత్ నిద్రలేస్తున్నది) అన్నది ఆ తొలివాక్యం. సైన్స్‌ని ఔపాసన పట్టినవాడు నెహ్రూ అని ఆయన భక్తులు చెపుతారు. వారి కుహనాదేవుడు నెహ్రూకి భూమి తన చుట్టూ తాను తిరుగుతుందని, ప్రపంచమంతా ఏకకాలంలో నిద్రపోదని, ఒక్కొక్క ప్రదేశంలో ఒక్కో టైమ్‌జోన్ ఉంటుందని తెలియని సైంటిస్టా మన తొలి ప్రధాని!


బ్రిటీష్‌వాడు గవర్నర్ జనరల్‌గా, ఆ దేశంవాళ్లే సైనిక జనరల్స్‌గా ఉంటే వచ్చే ప్రమాదం ఏమిటో పాకిస్తాన్ నేత మహమ్మదాలి జిన్నా ముందుగా గుర్తించి వదిలించుకున్నాడు. కాని మన ప్రపంచ మేధావి నెహ్రూకి మాత్రం ఆ ప్రమాదం అర్థం కాలేదు. జూన్ 1948వరకు మౌంట్‌బ్యాటన్ గవర్నర్ జనరల్‌గా కొనసాగించాడు. అప్పుడు నెహ్రూ చూపు ఎవరి మీద ఉండేదో భారతీయు లందరికీ తెలుసు కాబట్టి వేరుగా చెప్పటం లేదు.

మన దేశం జనవరి 15ని ప్రతి సంవత్సరం ఆర్మీడేగా జరుపుకుంటుంది. 1949లో ఆ తేదీనగానీ నెహ్రూ బ్రిటీష్ జనరల్స్‌ని వదిలించుకునే నిర్ణయం తీసుకోలేదు. దీనికి అసలు కారణం తనను భారతీయ సైనిక జనరల్స్ పదవీచ్యుతుడిని చేస్తారన్న భయం. కాని, బయటకు చెప్పిన కారణం మన దేశ సైనిక అధికారులకు యుద్ధ అనుభవంలేదన్నది. ఈ విషయం ఒకసారి భారతీయ సైనికాధికారుల సమావేశంలో ప్రస్తావిస్తే, నాటి సైనిక అధికారి తిమ్మప్ప లేచి "మీకు ప్రధానిగా పాలన అనుభవం లేదు కదా. మనం కూడా బ్రిటీష్ ప్రధానికి ఆ సీటు అప్పగిద్దాం" అనేసరికి నెహ్రూ షాక్ తిన్నాడు. కోపంతో ఎవరున్నారు సమర్థ అధికారి అని అడిగితే అధికారులందరూ జనరల్ కరియప్ప పేరు సూచించారు. అంతేకాక,రెండవ ప్రపంచ యుద్ధ నైపుణ్యానికి, సాధించిన విజయాలకు మెచ్చి బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చిన మెడల్స్, టైటిల్స్ చిన్నవరుస నెహ్రూ ముందు ఉంచారన్నది కథనం. అంత షాక్ ఇస్తేగాని నాటి ప్రధానికి బ్రిటిష్‌వారి మీదున్న వ్యామోహం తొలగలేదు.

నెహ్రూ అంధభక్తులు ఆయనకు ఎన్నెన్నో భుజకీర్తులు పెట్టారు. అందులో ఆయన ప్రజాస్వామ్యవాది అని, విమర్శలను స్వీకరిస్తాడు గాని ఆగ్రహించడు అనేవి కొన్ని. అందుకు సాక్ష్యంగా నాటి మేటి కార్టూనిస్టు శంకర్‌తో ఆయన అన్నట్లుగా చెప్పిన డైలాగ్ "డోంట్ స్పేర్ మీ శంకర్" (శంకర్ నన్ను వదిలి పెట్టవద్దు)ని ఉటంకిస్తుంటారు. అంత తన మీద విమర్శలను ఆయనే ప్రోత్సహించారంటారు.

కాని వాస్తవంలో నెహ్రూ తనని విమర్శించిన వారిని జైళ్లకు పంపాడు. ప్రముఖ హిందీ కవి మజ్రూహ్ సుల్తాన్‌పురి స్వతంత్రం వచ్చిన తర్వాత ఆయన పద్ధతులు, పాలన గమనించి 'ఖాదీ అనే పాము చర్మం కప్పుకున్న విషపురుగు వంటివాడు, హిట్లర్‌కి ఏ మాత్రం తీసిపోడు' అని అన్నాడు. అంత పెద్ద కవిని అరెస్టు చేయించి, అతి వేగంగా విచారణ జరిపించి జైలుశిక్ష విధించి, దాదాపు రెండేళ్లు జైలులో పెట్టాడు.

హిట్లర్ వంటి నెహ్రూను తప్పించుకోనివ్వకుండా దాడి చేయండి. అతగాడు బ్రిటీష్ (కామన్‌వెల్త్) వారి బానిస. ప్రజలు దాడిచేసి, అతడు తప్పించుకునేందుకు వీలు లేకుండా చూడమన్నాడు సుల్తాన్‌పురి.



తన హిట్లర్ మనస్తత్వం బయట పెట్టాడు అని ఆ కవి మీద కోపం నెహ్రూకి.

ఇక తమ నాయకుడి పాలన గురించి కొండా వెంకటప్పయ్య పంతులు వ్యంగ్యంగా గాంధీకి ఒక ఉత్తరం రాసాడు. 1947లో స్వతంత్రం వచ్చింది, ఆగస్టు 15న నెహ్రూ ప్రధాని అయ్యాడు. గాంధీ హత్య జనవరి 30, 1948న జరిగింది. అంటే అప్పటికి నెహ్రూ పాలన మొదలై ఆరునెలలకు అటూ ఇటూ ఆ కొద్ది నెలల్లోనే ఆయన అసలు స్వరూపం కొండా వెంకటప్పయ్య పంతులుగారికి అర్థమైంది. "మహాత్మా, మనం ఏదో అనుకున్నాంగాని, బ్రిటీష్ వారే మెరుగైనవారు అనిపిస్తున్నారు మన పాలకులు" అన్నది కొండావారి ఉత్తరంలోని సారాంశం.

ఎంత వేగంగా పెద్దలు అతడి నిజస్వరూపం తెలుసుకున్నారనే విషయం బయటకు రానివ్వకుండా కాంగ్రెస్, నెహ్రూ అంధభక్తులు వాస్తవాన్ని ఎలా పాతర వేశారో అర్థమవుతుంది.

1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చింది. నాటికి నెహ్రూది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కాదు. 1952లో తొలి సారస్వత ఎన్నికలకు నిర్ణయం జరిగింది. అప్పటివరకు ఆగి, ఆ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలిచి, అప్పుడు రాజ్యాంగ సవరణకు పూనుకోవటం ఒక ప్రజాస్వామ్యవాది చెయ్యాల్సినది. కాని జవాహర్‌లాల్‌లోని హిట్లర్ 1951లోనే తొలి రాజ్యాంగ సవరణ తెచ్చాడు. అది భావవ్యక్తీకరణ మీద ఆంక్షలు విధించేందుకు, మరెవరూ మజ్రూహ్ సుల్తాన్ పురి బాటలో తన మీద విమర్శలకు వినకుండా ఉండేందుకు తెచ్చిన సవరణ అనేది నిపుణుల అభిప్రాయం.

కాంగ్రెస్‌పార్టీవల్లనే స్వాతంత్ర్యం వచ్చి ఉంటే 1947 తర్వాత నెహ్రూ ప్రధానిగా దేశాన్ని అద్భుతంగా నడిపి ఉంటే అపుడు మరో పార్టీకి ఓటువేసే ఆలోచన చెయ్యకూడదు. పోలైన ఓట్లలో కనీసం 90 శాతం ఆ పార్టీకి దక్కాలి. కాని వాస్తవంలో నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీకి దక్కింది దాదాపు 45 శాతం మాత్రమే. బీజేపీకి, నరేంద్రమోదీకి 40శాతం ఓట్లకన్నా తక్కువ వచ్చాయి. అంటే 60 % ఓటు బీజేపీ, మోదీ వ్యతిరేక ఓటు అని వాదించే కాంగ్రెస్, నెహ్రూ అంధభక్తులకు 1952లోనే 55% ఆ పార్టీకి, నెహ్రూ నాయకత్వానికి వ్యతిరేకం అనే విషయం గుర్తుచేయాలి.

జాతీయ స్థాయిలో నెహ్రూకి సాటి నిలువగలిగిన నాయకుడు మరొకరు లేరు అని అంధభక్తులు ప్రచారంలోకి తెచ్చారు. కాని 1952 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి ఆయన పోటీ చేసిన నియోజక వర్గంలో వచ్చిన మెజారిటీ కన్నా నాటి హైదరాబాద్ రాష్ట్రంలోని నల్గొండ నియోజక వర్గంలో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థికి అధిక మెజారిటీ వచ్చింది.

భారత్‌కి చెందాల్సిన కశ్మీర్ భాగం పాకిస్తాన్ చేతిలోకి పోయింది. కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేసింది, భారత్‌లో కలవటానికి సిద్ధపడ్డ కలాత్ సంస్థానం (నేటి బలూచిస్తాన్‌ని) మన దేశంలో కలవనివ్వనిది, టిబెట్ విషయంలో మనమేమి చెయ్యలేం అని బహిరంగంగా చేతులెత్తి, చైనా టిబెట్‌ని ఆక్రమించేలా చేసింది, కశ్మీర్‌కి ఆర్టికల్ 370 ద్వారా ప్రత్యేక హోదా కల్పించింది జవాహర్ లాల్ నెహ్రూనే.

జునాఘడ్ సంస్థానం విలీనంలో, హైదరాబాద్ సంస్థానాన్ని లొంగదీసుకోవటం రెండూ సర్దార్‌పటేల్ ద్వారా జరిగాయి కాబట్టి గానీ, లేకుంటే నెహ్రూ వాటి విషయంలోనూ సమస్యను జటిలం చేసేవాడు.

తన వ్యక్తిగత ఇమేజ్, తన రొమాంటిక్ జీవనానికి ప్రాధాన్యతనిచ్చినందుకే జవహర్‌లాల్ నెహ్రూ 1947–52 మధ్య కాలం భారత్‌కి డిజాస్టర్. అయినా ఆ ఐదు సంవత్సరాలు ప్రధాని నెహ్రూ 'క్రెడిట్' లోకెయ్యాలని వాదిస్తారు ఆయన అంధభక్తులు. కాని ఈ అయిదేళ్ల కాలంలో ఆయన చేసిన తప్పిదాలు బయటకు రానివ్వరు. దాచేస్తే దాగవు వాస్తవాలు. ఇప్పటికైనా బయట పెట్టకపోతే భారత్‌కి ద్రోహంచేసిన వారమవుతాం. ★



# యువతకు భ

**నీట్-యూజీ లీకేజీ తర్వాత కేంద్ర ప్రభుత్వం మొత్తం పరీక్షల ప్రక్రియ ప్రక్షాళన చేపట్టింది. ఇప్పటికే ఎన్‌టీఏ సంస్కరణల కోసం నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు చట్ట సవరణ  బిల్లును పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదింపచి చట్టరూపం ఇచ్చింది. దేశంలో పరీక్షవ్యవస్థను మరింత పటిష్ఠంగా, విశ్వసనీయంగా మార్చేందుకు కఠిన చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మరోవైపు వందేమాతరం గీతానికి జనగణమన గీతంతో సమాన హోదా కల్పిస్తూ చారిత్రక బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది.**

ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొన్ని కీలక బిల్లులను ప్రభుత్వం ఆమోదించింది. ఇందులో కీలకమైనవి ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు చట్ట సవరణ బిల్లు, వందేమాతరం బిల్లు, విదేశీ విరాళాల నియంత్రణ బిల్లు, సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు.. ఇందులో అత్యంత కీలకంగా నిలిచింది ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు చట్ట సవరణ బిల్లు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్-యూజీ లీకేజీ తర్వాత జరిగిన వరుస పరిణామాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం కఠిన చర్యలకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఎన్‌టీఏ పనితీరులో సాంకేతిక, నిర్మాణాత్మక మార్పులు సూచించేందుకు కేంద్రం ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు, ఆధార్ రూపకర్త నందన్ నీలేకని ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణ పారదర్శకంగా, సురక్షితంగా, సాంకేతికత ఆధారంగా జరిగేలా తగిన సంస్కరణలను ఈ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా ఈ కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఎన్‌టీఏ పరీక్షల్లో ఇకపై ఎలాంటి అవకతవకలు జరగకుండా టెక్నాలజీని గరిష్ఠంగా ఎలా వాడుకోవాలనే విషయంపై వీరు ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఈ కమిటీలో ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ దేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కామకోటి, కేంద్ర ఉన్నత విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, ప్రముఖ లాజిస్టిక్స్ నిపుణుడు అమృత్ లాల్ మీనా ఉన్నారు.

పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనా పరమైన చర్యలు ప్రారంభించింది. ఎన్‌టీఏలో 47మంది అధికారులను తొలగించారు. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్ సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**యాంటీ పేపర్ లీక్ చట్టం**


ప్రశ్నపత్రాల లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించే దిశగా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయమంత్రి జితేంద్ర సింగ్ సభలో ప్రవేశపెట్టారు. లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటిరోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దీనికి ఆమోదముద్ర వేశారు. దీనితో 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు' చట్టంగా మారినట్లు పేర్కొంటూ న్యాయశాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త చట్టం ప్రకారం ప్రశ్నపత్రాల లీకేజీ పాల్పడిన వారికి రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. ఒకవేళ సంస్థలు, వ్యవస్థీకృతంగా నేరానికి పాల్పడితే రూ.10కోట్ల వరకు జరిమానా విధిస్తారు. ఐదు నుంచి పదేళ్ల వరకు జైలుశిక్ష వేస్తారు. ఇంతకుముందు కేంద్ర దర్యాప్తు సంస్థలు పేపర్ లీకేజీ కేసులపై విచారణ జరిపేది. కానీ, ఇకపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు ఈ కేసుల్ని విచారిస్తాయి. పేపర్ లీక్ కేసుల త్వరితగతి విచారణకోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు.

గతంలో పేపర్ లీకేజీ కేసుల విచారణకు కాల పరిమితి అంటూ లేదు. కొత్త బిల్లు ప్రకారం ఈ కేసుల విచారణను రెండు నెలల్లో పూర్తి చేయాలి. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. తీర్పుపై హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాలు, పరీక్షార్థుల తనిఖీ, బయోమెట్రిక్ నమోదు, భద్రతా ప్రమాణాలు, సీట్ల కేటాయింపు, ప్రశ్నపత్రాల కూర్పు, పేపర్‌ల లోడింగ్, ఇన్విజిలేషన్‌లకు సంబంధించి కొత్త నిబంధనలు, ప్రమాణాల రూపకల్పనకు సంబంధించి బిల్లులో ప్రతిపాదనలు చేశారు. పేపర్ లీక్ చేయడం, ఓఎంఆర్ షీట్ ట్యాంపరింగ్, నకిలీ వెబ్‌సైట్ల రూపకల్పన, నకిలీ ఐడీ కార్డులను జారీచేయడం.. ఇలా 15 అనైతిక చర్యలను నేరాలుగా పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మళ్లీ విశ్వాసం పెరిగే అవకాశం ఉంది.

**మరింత బలోపేతం: మోదీ**

దేశంలో పరీక్షవ్యవస్థను మరింత పటిష్ఠంగా, విశ్వసనీయంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.



2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయమంత్రి జితేంద్ర సింగ్ సభలో ప్రవేశపెట్టారు. లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటిరోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లును ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం. రాష్ట్రపతి వెంటనే ఆమోదముద్ర వేశారు.



# రోసాగా బిల్లు

పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఈ బిల్లును ఆమోదించడం దేశానికి ఒక చారిత్రాత్మక సందర్భమని పేర్కొన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణలో మరిన్ని సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. గతంలో అనేక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేపర్ లీక్ ఘటనలను ఎదుర్కొన్నాయని, అందుకే పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలు అవసరమయ్యాయని తెలిపారు. ఈ దిశగా ఇది ఒక కీలక అడుగు అని మోదీ తెలిపారు. పేపర్ లీక్‌లాంటి పరిస్థితులను ఇకపై ఎక్కువకాలం కొనసాగనివ్వబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఇకపై అవసరమైన చర్యలు నిరంతరం తీసుకుంటూనే ఉంటుందని ప్రధాని మోదీ చెప్పటం హర్షణీయం. అయితే ఇది కేంద్రస్థాయిలో మాత్రమే కాదు, రాష్ట్రాల స్థాయిలో కూడా జరగాలి.

**వందేమాతరానికి మరింత గౌరవం**

యావత్ భారతావని వందేమాతర గేయం 150 సంవత్సరాల వేడుకను జరుపుకుంటున్న తరుణంలో అత్యంత కీలకమైన వందేమాతరం బిల్లును పార్లమెంట్ ఉభయసభలు ఆమోదించడం మరో గొప్ప విజయం. ప్రధానంగా 1971నాటి "ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ యాక్ట్" (జాతీయ గౌరవ నిరోధక చట్టం)కు సవరణలు చేస్తూ ఈ నూతన బిల్లును ప్రవేశపెట్టారు. ఇకపై వందేమాతరం గీతంలోని పూర్తి ఆరు చరణాలనూ పాడాలి. ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందడం అత్యంత ప్రధానమైన మైలురాయిలాంటిది. ఈ నూతన సవరణ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత, వందే మాతరం ఆలాపనను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, గానం జరుగుతున్న అధికారిక లేదా సభాపూర్వక కార్యక్రమాలకు భంగం కలిగించడం లేదా అవమానించడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. ఇందుకు మూడేళ్ల జైలుశిక్ష పడుతుంది.

ఇది కేవలం ఒకసాధారణ చట్ట సవరణ మాత్రమేకాదని, దేశ సమైక్యతను, అఖండతను, జాతీయ ప్రతీకల గౌరవాన్ని మరింత బలోపేతం చేసే అత్యున్నత చర్యని పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా కేంద్రప్రభుత్వం నొక్కి చెప్పింది. లక్షలాది మంది వీరులు ప్రాణత్యాగాలు చేసి సంపాదించిన స్వాతంత్ర్యానికి ఊపిరిగా నిలిచిన గేయానికి చట్టభద్రత కల్పించడం భావితరాలకు ఇచ్చే గొప్ప నివాళి అని వాదించింది. ప్రతిపక్షాలకు చెందిన కొందరు ఈ బిల్లుపై తీవ్ర వ్యతిరేకత కనబరచినా చివరకు పార్లమెంట్ ఉభయసభల్లోనూ మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది

ఇప్పటి వరకు కేవలం జాతీయ పతాకం, భారత రాజ్యాంగం, జాతీయ గీతమైన 'జనగణమన'లకు మాత్రమే పరిమితమైన చట్టబద్ధమైన రక్షణను, శిక్షార్హమైన అధికార పరిధిని ఇకపై వందేమాతర గీతానికి కూడా వర్తిస్తాయి. మొదటిసారి ఈ నేరానికి పాల్పడిన వ్యక్తికి మూడేళ్లవరకు జైలుశిక్ష లేదా భారీ జరిమానా లేదా రెండూ విధించేందుకు చట్టంలో స్పష్టమైన నిబంధనలు చేర్చారు. ఒకవేళ ఇదే నేరాన్ని పునరావృతంచేస్తే, మరింత కఠినమైన శిక్షలు, నాన్ బెయిలబుల్ ప్రక్రియలు ఆమలవుతాయి. భారత రాజ్యాంగంలోని 51(ఎ) అధికరణం కింద పేర్కొన్న మౌలిక విధులలో ప్రతీ పౌరుడు జాతీయ చిహ్నాలను, గీతాలను గౌరవించాలని ఉటంకించిన అంశానికి ఈ చట్టం ఒక బలమైన న్యాయపరమైన రక్షణ కవచంగా మారుతుంది.


**చారిత్రిక నేపథ్యం..**

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో వందేమాతరం గీతానికి అపూర్వ స్థానం ఉంది. ప్రముఖ సాహితీవేత్త బంకించంద్ర చటోపాధ్యాయ 1875 డిసెంబరు 7న ఈ అమృతగీతాన్ని సంస్కృత, బెంగాలీ భాషల కలయిగా రాశారు. ఆ తర్వాత 1882లో వెలువడిన ప్రసిద్ధ నవల ఆనందమఠంలో చేర్చారు. 1896 కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ టాగూర్ వందేమాతర గీతాన్ని స్వయంగా స్వరపరచి ఆలపించడంతో ప్రాచుర్యం లోకి వచ్చింది. అప్పటి కింకా ఆయన జనగణమన గీతం రాయలేదు. 1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వందేమాతరం ఉద్యమ నినాదంగా మారింది. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం దీన్ని నిషేధించింది. క్రమంగా క్విట్ ఇండియా, స్వదేశీ ఉద్యమాల్లో వందేమాతరం ప్రముఖంగా వినిపించింది. ఎందరో దేశ భక్తులు కొరడా దెబ్బలు తింటూ, ఉరికంబ మెక్కినప్పుడు వందేమాతరం అంటూ నినాదం చేయడం ఆంగ్లేయులను హడలెత్తించింది

**సంతుష్టీకరణతో అన్యాయం**

స్వాతంత్రోద్యమ సమయంలో కాంగ్రెస్ వేదికలపై వందేమాతర గీతాన్ని ఆలపించేవారు. 1930 ప్రాంతంలో జాతీయ గీతంగా గుర్తించాలనే చర్చ మొదలు కాగా ముస్లింలీగ్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వందేమాతర గీతంలో దేశాన్ని తల్లితో, కాళితో, సరస్వతితో, లక్ష్మితో పోల్చడం వారికి నచ్చ లేదు. కాంగ్రెస్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ కూడా వ్యతిరేకులతో గొంతు కలిపారు. కాంగ్రెస్ పార్టీలో వందేమాతర గీతానికి వ్యతిరేకంగా ఒత్తిడి పెరిగింది. ముస్లింలను దూరం చేసుకోవడం వారికి ఇష్టంలేదు. అప్పటికే కాంగ్రెస్‌పార్టీలో సంతుష్టీకరణ విధానాలు మొదలయ్యాయి. వందేమాతరం గీతంలో మొదటి రెండు చరణాలు పాడితే చాలనే నిర్ణయం తీసేసు కున్నారు. ఒక దేశభక్తి గీతాన్ని మతపరమైన ఎజెండాగా మార్చడం జాతీయవాదులకు నచ్చలేదు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950 జనవరి 24న నాటి రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటన చేశారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమనను దేశ అధికారిక జాతీయ గీతంగా, వందేమాతరం తొలి రెండు చరణాలను జాతీయ గేయంగా గుర్తించారు. అంతేకాక, జాతీయ గీతంతో పాటు జాతీయ గేయమైన వందేమాతరానికి కూడా సమానమైన రాజ్య గౌరవం, హోదా ఉంటా యని స్పష్టంచేశారు. కాగా 1971లో తీసుకొచ్చిన జాతీయ గౌరవ నిరోధక చట్టం ప్రకారం జాతీయ పతాకాన్ని అవమానించడం, రాజ్యాంగాన్ని ధిక్క రించడం, జనగణమన ఆలాపనను ఉద్దేశ పూర్వకంగా అడ్డుకోవడం, భంగం కలిగించడం శిక్షార్హమైన నేరాలుగా నిర్దేశించారు. కానీ వందే మాతరానికి అదే స్థాయిలో చట్టబద్ధమైన రక్షణ నివ్వలేదు. తాజాగా మోదీ ప్రభుత్వం ఈ తప్పిదాన్ని సరిదిద్దింది. 1971 నాటి 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ యాక్ట్' పరిధిలోకి వందే మాతరంను కూడా చేర్చింది. నిజంగా ఇది ఒక సాధారణ చట్ట సవరణ మాత్రమే కాదు.. దేశ సమైక్యతను, అఖండతను, జాతీయ ప్రతీకల గౌరవాన్ని మరింత బలోపేతం చేసే అత్యున్నత చర్య.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్







# అల్లూరి పేరు

**పేరు పెట్టడం ఆనందదాయకం**
**అంతర్జాతీయ స్థాయి సదస్సులకు వేదికగా విశాఖ నిలుస్తుంది. రాష్ట్ర కార్యనిర్వాహక రాజధానిగా కొత్త రూపు దాల్చనుంది. దీనికి తోడు కొత్త రైల్వేజోను, పోర్టులు, జలరవాణా, జాతీయ రహదారులు ఇలా విశిష్ట సామర్థ్యమున్న విశాఖకు కాలాను గుణంగా అనుసంధానం పెరగాల్సి ఉంది. అయితే నేవీ ఇచ్చిన స్లాట్స్ ప్రకారం 85 విమానాల కంటే ఎక్కువ నడపలేని పరిస్థితి ఉంది. గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంగా ప్రసిద్ధి చెందిన ఈ భోగాపురం విమానాశ్రయం, విజయనగరానికి 28 కిలోమీటర్లు, విశాఖకు 48 కిలోమీటర్లు, శ్రీకాకుళానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉండి, ఈ మూడు జిల్లాలతోపాటు ఒడిశా ప్రజలకు కూడా సౌకర్యంగా ఉంటుంది.**

**అ**ల్లూరి సీతారామరాజు మీద ఎన్నో గ్రంథాలు (సుమారు 40 పైన) వచ్చినా డాక్టర్ గోపరాజు నారాయణ రావు రాసిన "ఆకుపచ్చ సూర్యోదయం: మన్యం వీరుడు అల్లూరి గాథ" గ్రంథం సమగ్ర రచన అని చెప్పవచ్చు. అల్లూరి సీతారామరాజు 1897 జూలై 4న విశాఖ జిల్లాలోని పండ్రంగి గ్రామంలో జన్మించారు. తండ్రి వెంకట రామరాజు, తల్లి సూర్య నారాయణమ్మ. ఆయన స్వగ్రామం పశ్చిమగోదావరి జిల్లాలోని మోగల్లు. 1908లో తండ్రి మరణించడంతో కుటుంబం ఆర్థికంగా చాలా కష్టాలు పడ్డది. భీమవరం, కొవ్వాడ, రాజమండ్రి, కాకినాడ లలో విద్యా భ్యాసం జరిగింది. కాకినాడలో మద్దూరి అన్నపూర్ణయ్య (గోదావరి జిల్లా స్వాతంత్ర్య సమరయోధుడు)కి సహాధ్యాయి అయ్యాడు. చివరగా విశాఖపట్నం మిసెస్స్ ఎ.వి.ఎన్. కళాశాలలో ఉండగా, ఉద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు.

అల్లూరి సీతారామరాజు, మద్దూరి అన్నపూర్ణయ్య కాకినాడ పాఠశాలలో కలిసి చదువుకున్నారు. బానిస చదువులు వద్దు దేశసేవే ముఖ్యమని ఇద్దరూ చర్చించుకునేవారు. బ్రిటిష్ వారి చిహ్నాలున్న పతాకాలను నిరసిస్తూ వాటిని నేలకేసి కొట్టేవారు. మన్యంలో అల్లూరి పోరాట వార్తలను ప్రజలకు తెలియజేస్తూ విప్లవ బీజాలను ప్రోత్సహించారు మద్దూరి.

మన్యం ప్రాంతంలో బ్రిటిష్‌వారు గిరిజనులను వేధించడాన్ని అల్లూరి తీవ్రంగా వ్యతిరేకించారు. సాంప్రదాయ విల్లంబులు, పోలీసుస్టేషన్ల నుండి ఎత్తుకొచ్చిన తుపాకులతో బ్రిటిష్‌సైన్యంపై గెరిల్లా దాడి పద్ధతిలో పోరాడాడు. ఆయుధాల కోసం చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి పోలీసు స్టేషన్ల పై విజయవంతంగా దాడులు చేశారు. తన ఆచూకీ కోసం గిరిజనులను బ్రిటిష్ పోలీసులు హింసించడాన్ని చూసి మనస్సు కరిగి ఆ ఘోరాలను ఆపడానికి 1924 మే 7న స్వయంగా లొంగిపోయారు అల్లూరి. ఆ తరువాత బ్రిటిష్ వారు ఆయన్ను చెట్టుకు కట్టి కాల్చిచంపారు.

మద్దూరి అన్నపూర్ణయ్య, "కాంగ్రెసు, నవ్య" అనే పత్రికలను స్థాపించి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా వ్యాసాలు రాశారు. అల్లూరి సీతారామరాజు మన్య విప్లవ విశేషాలు, ఆయన వీరత్వాన్ని తన పత్రికల ద్వారా మైదానప్రాంత ప్రజల్లోకి తీసుకెళ్ళారు. ఆ రాతల కారణంగా మద్దూరిని దాదాపు 12 సంవత్సరాలకు పైగా జైలులో నిర్బంధించారు.

ఆయన్ను ఒక జైలులో స్థిరంగా ఉంచలేదు. జైలు నుంచి జైలుకు మారుస్తూ చివరకు మధ్య భారత్‌లోని (నేటి మధ్యప్రదేశ్) జైలుకు పంపారు. కూతురుకు మేనమామతో వివాహం జరిగింది. కూతురు పెళ్లికి వెళ్లడానికి పెరోల్ రాలేదు. తరువాత అన్నపూర్ణయ్య భార్య వెంకటరమణమ్మ అల్లుడి ఇంట్లో ఉండి పోయింది. దుర్భరదారిద్ర్యం, భర్తకు ఉత్తరం రాయ డానికి మూడు పైసలు అల్లుడిని అడగలేక ఉత్తరం రాయలేక సతమతమయ్యేది. చివరకు మూడు పైసలు సంపాదించి తారీఖు వేయకుండా కార్డు రాసి పోస్టు చేసింది. దానిలో ఇలా వ్రాసింది "ఇంటి దగ్గర నుంచి మీకు ఉత్తరం రావాలని ఎప్పుడు అనిపించినా ఈ కార్డే తీసుకొని చదువుకోవలసినది, దీని మీద తేదీ వేయనిది అందుకే." అదే ఉత్తరాన్ని ఆయన పదే పదే చదువుకునేవారు. ఆయన జైలులో ఉండగానే భార్య వేంకటరణమ్మ మరణించింది. స్వతంత్ర భారతాన్ని అన్నపూర్ణయ్య చూశాడు కాని ఆమె చూడలేదు.

మద్దూరి వేంకటరమణమ్మ కొల్లూరి వారి ఆడపడచు పెద్దాపురం వాసి. కొల్లూరు కామేశ్వరమ్మ, రామశర్మలకు జన్మించింది. భర్తతోపాటు అనేక కార్యక్రమాలలో పాల్గొంది. రాజమండ్రిలో విదేశీ వస్తువులు అమ్మే షాపు దగ్గర ధర్నా చేసి జైలుకు వెళ్ళి 6 మాసాలు జైలుశిక్ష అనుభవించింది. రాత్రులు సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చేది. సీతానగరంలో మహిళల సంక్షేమం కోసం ఉన్న ఆశ్రమంలో ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వ హించింది. 1943 జనవరి 6న మరణించింది. వీరి సోదరుడు కె.ఎన్. శాస్త్రి విశాఖకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు.


మహాత్మాగాంధీ తన Young India పత్రికలో అల్లూరి సీతారామరాజు వీరత్వాన్ని, త్యాగాన్ని గురించి కొనియాడుతూ వ్రాసిన వ్యాసంలో "Calling him a 'great hero' and bowing head

**భారతదేశంలో అనేక విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టారు. వాటిలో**

1) వీరసావర్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం (పోర్ట్‌బ్లెయిర్, అండమాన్ నికోబార్ దీవులు)
2) నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం (కలకత్తా, పశ్చిమ బెంగాల్).
3) సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం (అహ్మదాబాద్, గుజరాత్).
4) షహీద్ భగత్‌సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం (చండీఘర్).
5) బిర్సాముండా విమానాశ్రయం (రాంచి, ఝార్ఖండ్)
6) లోక్‌ప్రియ గోపీనాథ్ బోర్దోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం (గౌహతీ, అస్సాం)
7) ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయం (కర్నూల్, ఆంధ్రప్రదేశ్)
8) అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం, భోగాపురం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైనవి.




# తో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం



to Raju's Supreme bravery and sacrifice". Even though Gandhi was fully committed to non violence (Ahimsa). He publicly recognized Raju's extraordinary dedication to liberating the mother land.

Gandhiji Wrote "Though I have no sympathy with and cannot admire armed rebellion, I cannot withhold my homage .. a Youth so brave, so sacrificing, so simple and so noble in character as young Shri Rama Raju".

"I bow my head to the bravery and sacrifice of Sitaramaraju. His dedication to the country is unparalleled, "Raju was not a fituri but a great hero".

బ్రిటిష్ పోలీసులు తీసిన అల్లూరి సీతారామ రాజు మృతదేహం ఫోటోను ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు మద్దూరి అన్నపూర్ణయ్య అంగీకరించలేదు. కారణం, అల్లూరి సీతారామరాజు కాకినాడలోని పిఠాపురం రాజా పాఠశాలలో 3వఫారం (నేటి 8వ తరగతి) కలిసి చదువుకున్నారు. చిన్నప్పటి నుండి ఎంతో అందంగా ఉండి నాటకాలలో 'శశిరేఖ' వంటి పాత్రలు వేసేవారని అన్నపూర్ణయ్యకి బాగా తెలుసును. బ్రిటిష్ వారు విడుదల చేసిన ఫోటో అల్లూరిది కాదని వారివాదన. ఇది నకిలీ ఎన్‌కౌంటర్ అని, అల్లూరి బ్రతికే ఉన్నాడని వాదన చేశాడు. గిరిజనులు నేటికి దీన్ని నమ్ముతారు.

అల్లూరి సీతారామరాజు మరణం (1924 మే 7) తర్వాత నాటి జాతీయ నాయకులు, పాత్రికేయులు అయిన భోగరాజు పట్టాభి సీతారామయ్య, మద్దూరి అన్నపూర్ణయ్య రాసిన వ్యాసాలు, సంపాదకీయాలు బ్రిటిష్ వారి క్రూరత్వాన్ని ఎండగట్టడంలో కీలక పాత్రను పోషించాయి. నాటి కాంగ్రెసు సాయుధపోరాటాన్ని సమర్థించకపోయినా, అల్లూరి మరణం తర్వాత వీరత్వాన్ని చారిత్రాత్మకంగా నమోదు చేశారు. "ది హిస్టరీ ఆఫ్ ది కాంగ్రెసు"లో పట్టాభి బ్రిటిష్‌వారి క్రూరమైన పాలనవలన ఏజెన్సీలో అల్లూరి తిరుగుబాటు, కేరళలో మోప్లా తిరుగుబాటు వచ్చాయని, అడవులపై గిరిజన హక్కులను కాలరాయడమే దానికి కారణమని ఆయన స్పష్టం చేశారు.

అల్లూరి సీతారామరాజు భౌతికంగా మనకు దూరమైనా ఆయన రగిల్చిన విప్లవజ్వాలలు దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యకాంక్షను రగిల్చింది. గిరిజనుల గుండెల్లో ఆయన దేవుడిగా నిలిచి పోయాడు. అల్లూరి త్యాగానికి గుర్తుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక జిల్లాకు అల్లూరిసీతారామరాజు జిల్లా అని పేరు పెట్టి ఆయనను గౌరవించుకుంది. భారతీయుల గుండెల్లో ఆయన ఇప్పటికీ మన్యం వీరుడు గానే చిరస్మరణీయుడు.


భారత ప్రధాని నరేంద్రమోదీ జూలై 4, 2022లో భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా తెలుగులో "ఆంధ్రప్రదేశ్ పుణ్యభూమికి నా నమస్కారములు. మన్యం వీరుడు తెలుగుజాతి యుగపురుషుడు అల్లూరి సీతారామరాజు గారికి నా శతకోటి ప్రణామాలు. ఈ చారిత్రాత్మక వేడుకలో పాల్గొనడం నా అదృష్టం" అంటూ ఉపన్యాసం మొదలు పెట్టారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా అల్లూరి చేసిన పోరాటం దేశయువతకు ఎప్పటికి ఒక గొప్ప స్ఫూర్తి. పింగళి వెంకయ్య, పొట్టిశ్రీరాములు, కందుకూరి వీరేశలింగం వంటి ఎందరో మహానుభావులను కన్న పుణ్యభూమి. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రంపా విప్ల వానికి వందేళ్లు నిండిన సందర్భంగా దేశస్వాతంత్ర సమరంలో గిరిజనుల పాత్రను కేంద్రప్రభుత్వం గౌరవిస్తోంది. మనదేశం మన సంస్కృతి అనే అల్లూరి సిద్ధాంతాలతోనే నవభారత నిర్మాణం సాధ్య మవుతుంది.

సీతారామరాజు పేరును భారతదేశ సాంస్కృతిక ఏకత్వానికి, గిరిజన గుర్తింపునకు, ధైర్య సాహసాలకు నిదర్శనంగా మోదీ అభివర్ణించారు. సీతారామ రాజు అనే పేరు కేవలం ఒక వ్యక్తిది మాత్రమే కాదు. అది భారతదేశపు ఆత్మకు ప్రతిరూపం అని మోదీ పేర్కొన్నారు.

ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్‌కు ప్రతీక అల్లూరి సీతారామరాజు జీవితం. ఆయన పేరు మన దేశాన్ని ఏకం చేసే సమైక్యభారత సిద్ధాంతాన్ని ప్రతిబింబి స్తుంది. సీతారామ అనే పదం భారతదేశ సంస్కృతిని విలువలను, ఆదర్శాలను గుర్తు చేస్తుందని ప్రధాని పేర్కొన్నారు. కేవలం 27 సంవత్సరాల వయస్సులోనే భారతస్వాతంత్ర్యం కోసం, గిరిజన సమాజ హక్కుల రక్షణకోసం ప్రాణాలర్పించిన అల్లూరి పేరు వింటేనే బ్రిటిష్ పాలకుల గుండెల్లో వణుకు పుట్టిందని అది మన్యం ప్రజల తెగువకు బ్రాండ్ అంబాసిడర్ లాంటిదని మోదీ ప్రశంసించారు.

అల్లూరి జననం నుండి బలిదానం వరకు సాగిన జీవితం యావత్ దేశానికి స్ఫూర్తిదాయక మంటూ, మోదీ ఆయనను "మన్యం వీరుడు, తెలుగు జాతియుగ పురుషుడని కీర్తించారు". విజయనగరం జిల్లా, భోగాపురంలో నిర్మించిన ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్ర యంగా పేరు పెట్టడం ముదావహం

ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సుమారు 2,200 ఎకరాల్లో 4,500 కోట్లతో నిర్మించారు. దానివల్ల భారీ ఎయిర్‌బస్సులు, బోయింగ్ విమానాలు దిగేలా పెద్ద రన్‌వే కలిగి వుండటం, ఉత్తర ఆంధ్రా అభివృద్ధికి గేమ్ చేంజర్‌గా మారనుంది. ఎగిరేపక్షి ఆకారంలో టెర్మినల్ కలిగి ఉండటం దీని ప్రత్యేకత.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

# గ్రామ వికాసమే జీవనాధారం




గ్రామవికాసానికి పెద్దలు, యువత తమ అమూల్యమైన జీవితాన్ని సమర్పించి నపుడే భారత భవిష్యత్తు బంగారుమయమవుతుందనే ఉద్దేశంతో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ప్రారంభమైంది. ఇది వికారాబాద్ జిల్లాలోని తాండూరు సమీపంలో జింగుర్తిగ్రామంలో 104 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. రసాయన విషాలు లేని ఆరోగ్య వంతమైన ఆహారాన్ని సమాజానికి అందించాలి. దానితోపాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను కూడా ఈ ప్రాంగణంలో నిర్వహించడం విశేషం. సహజ వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ గ్రామస్తులు వలస పోకుండా, తమ సొంత ఊరిలోనే ఆత్మాభిమానంతో జీవించే టట్లుగా రైతులకు తగిన మార్గదర్శనం చేయడమే లక్ష్యంగా ఈ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఈ సంస్థకు డైరెక్టర్‌గా బర్ల సుందర్‌రెడ్డి, ఛైర్మన్‌గా డా॥ పీవీరావు, రిటైర్డ్ డీన్ (అగ్రికల్చరల్ యూనివర్సిటీ, తెలంగాణ) వ్యవహరిస్తున్నారు.

ఏకలవ్య గ్రామీణ ఫౌండేషన్ ద్వారా వికారాబాద్, మెదక్ జిల్లాలలో ప్రస్తుతం

**1. రసాయనం లేని వ్యవసాయం చేసేందుకు రైతులను ప్రోత్సహించటం, మానసికంగా తయారు చేయటం.**

**2. భారతీయ గో ఆధారిత వ్యవసాయం శిక్షణ రైతులకు ఇవ్వడం**

**3. దేశీయ విత్తనాలు, జీవన ఎరువులు, కీటకనాశిని తయారుచేసే పద్ధతిని నేర్పి, మార్కెటింగ్ గొలుసులకు సహకరించడం**

**4. గ్రామాలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకి విశేష తరగతులు నిర్వహించడం**

**5. హెర్బల్ ఉత్పత్తులు: రసాయనం లేని పళ్లపొడి, సబ్బులు, హెయిర్ ఆయిల్, షాంపూలాంటి దైనందిన ఉపయోగపడే వస్తువుల ఉత్పత్తి చేయడంతో పాటు, మార్కెటింగ్‌కు ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల నిర్వహిస్తున్నారు.**

దీనిద్వారా కష్టపడి పనిచేసే గ్రామీణ యువతీ




యువకులు నెలకు 15 నుండి 20 వేల రూపాయలు గ్రామాలలో ఉంటూనే సంపాదించుకో వచ్చు.

**6. మహిళలకు కుట్టుశిక్షణ, ఆవకాయ వంటి చట్నీలు, విస్తరాకులు కుట్టటం మొదలైన పనులద్వారా ఆర్థిక స్వావలంబన కలిగించడం.**

**7. ఆయుర్వేదం, పంచకర్మ**

**8. స్వర్ణామృత ప్రాశన ఔషధం ద్వారా వేలాదిమంది బాల బాలికలకు**

రోగనిరోధక శక్తి పెంచేందుకు విశేషమైన కృషి జరుగుతోంది.

– యోగ తరగతులు గ్రామాలలో నిర్వహించడం ద్వారా సకారాత్మక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడం కోసం ఫౌండేషన్ కృషి చేస్తోంది.

గ్రామాలలో ఆర్థిక అభివృద్ధి, సాంస్కృతిక జాగరణ, మహిళల ఆర్థిక వికాసం, ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యలో స్థాయిని పెంచటం సాధ్యమే అని అనుభ వం ద్వారా అర్థ మవు తున్నది. అయితే ప్రజల స్వభా వంలో సరైన మార్పు రావాలంటే సాంకేతిక పరిజ్ఞానం రైతులకు, యువతీ యువకులకు అందాలి. అందుకొరకు ప్రారం భంలో అవసరమైన సహకారాన్ని అందించే పనిని ఈ ఫౌండేషన్




చేపట్టింది. దీనినే 'హ్యాండ్ హోల్డింగ్' అంటారు. ఇలా పనిచేసే అన్ని సంస్థలు, నిపుణులు, పెద్దలు కలిసి పనిచేసేందుకు (వర్కింగ్ టుగెదర్ సపరేట్లీ) అనే పద్ధతిలో ప్రయత్నం జరుగుతోంది.

దీనికి యువకులు తమ సమయాన్ని అంకితం చేయాలి. హైదరాబాద్‌లోను, జిల్లాలలోను ఉన్న పెద్దలు, మహిళలు తమ సమయాన్ని కేటాయించాలి. ఇది నియమితమైన నిరంతర వ్రతం. కొంతమంది తమ పూర్తి జీవితాన్ని అంకితం చేయాలి. వారిని సేవావ్రతులు అంటాం. వారందరి శక్తిని సుదృఢం చేయటానికి ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కృషి చేస్తుంది.

ఐఐటి విద్యార్థులు ఇప్పటికే కొంత సమయాన్ని కేటాయించి ఈ దిశలో పనిచేస్తున్నారు. మన జీవితాలను సార్థకం చేసుకుందాం, మన వారి కొరకు మనం పనిచేద్దాం. మార్గం ఏర్పడింది. దిశ కూడా సరైనదే. అయితే వేగం పెరగాలి. ఇది నేటి యుగ అవసరం. గ్రామాలలో ప్రతి చెట్టు ప్రతి ఆకు మన సంపద. కానీ గ్రామాలలో ఆర్థికంగా వెనుకబాటు తనం ఉంది. ఈ విచిత్రమైన పరిస్థితిని మార్చాలి. చేయి చేయి కలిపి సేవచేసేందుకు కదలుదాం రండి.

ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వివరాలు తెలుసుకొనుటకు ఈ క్రింది వారిని సంప్రదించండి.

**1. శ్రీనివాస్ (సీఈఓ) 9866339866**

**2. ప్రేమ్‌కుమార్ (ఏజీఎమ్) 9160165164**

**3. ప్రొ.మల్లారెడ్డి (గురుకులం ఛైర్మన్) 9830370458**

**4. కృష్ణబాబు, 8522849677**

ప్రచారక్–ప్రీమియర్ ఇన్‌స్ట్యూషన్స్





# శ్రావణం వెనుక శాస్త్రీయత

భారతదేశపు సనాతన సంప్రదాయాలు కేవలం ఆధ్యాత్మిక నమ్మకాలు మాత్రమే కావు, అవి వేలసంవత్సరాల క్రితమే రూపుదిద్దుకున్న అత్యున్నత వైజ్ఞానిక సూత్రాలు. మనం చేసే ప్రతి పూజ వెనుక, ఆచరించే వ్రతం వెనుక ఒక శాస్త్రీయత ఉంది. సమాజంలో ఐక్యతను పెంపొందించడం, ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను పొందడం అనే మూలసూత్రాలపైనే భారతీయ సంప్రదాయాలు నిర్మితమయ్యాయి. మన పూజలు, వ్రతాల వెనుక శాస్త్రీయ విజ్ఞానం దాగుంది.

శ్రావణమాసం హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైంది. దీనిని మహిళలమాసంగా చెప్పొచ్చు. ఆధ్యాత్మికంగానే కాకుండా, ఆరోగ్య, శాస్త్రీయ దృక్పథంలో కూడా ఈ మాసానికి ఎంతో విశిష్టత ఉంది. శ్రావణ మాసం శ్రీమహా విష్ణువుకు, పరమశివునికి, లక్ష్మీదేవికి ఎంతో ప్రీతిపాత్రమైన మాసం. ఈ నెలలో ప్రతిరోజూ ఒక పండుగలానే సాగుతుంది. కొత్తగా పెళ్లయిన మహిళలు తమ సౌభాగ్యం కోసం మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. అలాగే పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో చేస్తారు. ఇది అష్టలక్ష్ముల అనుగ్రహం కోసం, ఆయురారోగ్య అష్టైశ్వర్యాల కోసం ఆచరించే వ్రతం. శ్రావణ బహుళ అష్టమినాడు శ్రీకృష్ణుని జన్మదినాన్ని మహోత్సవంగా జరుపుకుం టారు. అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీ కట్టే వేడుకతో పాటు ద్విజులు నూతన యజ్ఞోపవీతాన్ని ధరించే రోజురాఖీ పౌర్ణమి. ఇలా నెలంతా పండుగ వాతావరణం నెలకొని ఉంటుంది.

**ఆరోగ్య, శాస్త్రీయ దృక్పథం:** శ్రావణ మాసం వర్షకాలంలో వస్తుంది. ఈ సమయంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండి, శరీరంలో జీర్ణశక్తి మందగిస్తుంది. అందుకే ఈ మాసంలో వ్రతాల పేరుతో శాకాహారం తీసుకోవడం, ఉపవాసాలు ఉండడంవల్ల జీర్ణవ్యవస్థకు విశ్రాంతి లభించి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వర్షాకాలంలో వచ్చే క్రిమి కీటకాలు, వ్యాధుల నివారణకు పూజల్లో వాడే పసుపు, తోరణాలు, ముగ్గులు, ధూపం ఎంతగానో సహాయపడతాయి. మన పూర్వీకులు ధర్మం, శాస్త్రం, ఆరోగ్యాన్ని ఒకే తాటిపైకి తెచ్చి పండుగలు, పూజల రూపంలో మనకు అందించారు. ఈ మాసంలో మహిళలు చేసే పూజలు, వ్రతాలు వాటి వెనుక ఉన్న ఆరోగ్య, మానసిక విజ్ఞానం చాలా విశేషమైనవి.


ఉదయాన్నే తలస్నానం చేసి, పూజచేయడం, గంటలు మోగించడం, మంత్రాలు జపించడం వల్ల మెదడు ప్రశాంతత పొంది, ఒత్తిడి తగ్గి సానుకూల శక్తి వస్తుంది. ఈ కాలంలో రావి, మర్రి, తులసి మొక్కలను పూజించడం వల్ల ఆక్సిజన్ అందడమే కాక, ప్రకృతిని గౌరవించే అలవాటు పెరుగుతుంది. మంత్రోచ్చారణలో ఉండే శబ్దప్రకంపనలు మెదడులోని ఆల్ఫాతరంగాలను పెంచి ఏకాగ్రతను, జ్ఞాపక శక్తిని పెంచుతాయి. తెల్లవారుజామున నిద్రలేవడం, పూజలు చేయడం వల్ల లభించే విటమిన్ డి, తాజా గాలి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

**పేరంటాలు-ఆధ్యాత్మిక భావన:** ఈ మాసంలో ఇంట్లో పూజ లేదా శుభకార్యం ముగిసిన తర్వాత ముత్తైదువులను ఆహ్వానించి, సత్కరించడాన్ని పేరంటం అంటారు. ఆహ్వానించిన మహిళలందరినీ సాక్షాత్తూ గృహలక్ష్మి, గౌరీస్వరూపాలుగా భావిస్తారు. తెలుగు సంస్కృతిలో పేరంటాలు, శనగల తాంబూలం, పసుపుబొట్టు అనగానే లక్ష్మీదేవి కటాక్షం, మంగళకరమైన వాతావరణం, స్త్రీ సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారు. ముఖ్యంగా శ్రావణ, కార్తీక మాసాల్లోనూ, పూజలు, నోములు, శుభకార్యాల సమయంలోనూ వీటిని ఇస్తుంటారు.

ఇవి మతపరమైన ఆచారాలు మాత్రమే కావు... స్త్రీల ఆరోగ్యాన్ని, మానసిక ఆనందాన్ని, సామాజిక సంబంధాలను, పర్యావరణ పరిరక్షణను మేళవించిన అద్భుతమైన సనాతన సంప్రదాయం. పేరంటంలో ఇచ్చే తాంబూలంలో తమలపాకులు, వక్కలు, పసుపు, కుంకుమ, పండు, పువ్వులు, శనగలు ఉంటాయి. తమలపాకు అగ్రభాగంలో లక్ష్మీదేవి, మొదలులో జ్యేష్ఠాదేవి, మధ్యలో సరస్వతి ఉంటారని నమ్మకం. అందుకే అగ్రభాగం ఇతరుల వైపు ఉండేలా తాంబూలం ఇస్తారు. తమలపాకులు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. పూజ ప్రసాదాలు తిన్నతర్వాత తాంబూలం సేవిస్తే అజీర్తి సమస్యలురావు. ఇక నానబెట్టిన లేదా ఉడక బెట్టిన శనగలు ప్రొటీన్లు, ఫైబర్, ఐరన్ పుష్కలంగా ఉన్న పోషకాహారం.

పేరంటంలో పసుపుబొట్టు ఇచ్చే సంప్రదాయం ఉంది. పసుపు సహజసిద్ధమైన యాంటీబయోటిక్, యాంటీసెప్టిక్. క్రిమిసంహారక గుణం కలిగిఉన్న పసుపు కాళ్లకు రాసుకోవడం వల్ల చర్మవ్యాధులు, పాదాల పగుళ్లు రాకుండా ఉంటాయి. పసుపు, కుంకుమలు మంగళకరం, గౌరీదేవికి అత్యంత ప్రీతిపాత్రమైనవి. రెండు కనుబొమ్మల మధ్య భాగంలో ఆజ్ఞాచక్రం ఉంటుంది. బొట్టు పెట్టినపుడు ఒత్తిడి కలగడం వల్ల నాడులు శాంతించి, మానసిక ప్రశాంతత లభిస్తుంది. మానసిక ఏకాగ్రత కూడా పెరుగుతుంది.

సనాతనంగా వస్తున్న ఇటువంటి ఆచారాలు కేవలం మూఢనమ్మకాలు మాత్రమే కాదు. రోజువారీ పనుల ఒత్తిడి నుండి స్త్రీలకు లభించే విశ్రాంతి, ఒకరినొకరు కలుసుకుని కష్టసుఖాలు పంచుకునే మంచి అవకాశం.మరోవైపు జ్యోతిష్య శాస్త్రం ప్రకారం శనగలు 'గురు గ్రహానికి' ప్రతీక. గురుబలం ఉంటే సౌభాగ్యం, సంతాన ప్రాప్తి, బుద్ధి వికాసం కలుగుతాయి. అద్భుతమైన వైజ్ఞానిక సమాహారమే మన సంస్కృతి. మూలాలను కాపాడు కుంటూ, వాటి వెనుక ఉన్న శాస్త్రీయతను గ్రహించి ఆచరించడమే మనం భావితరాలకు ఇచ్చే గొప్ప కానుక. శ్రావణ మాసం మనిషికి, ప్రకృతికి ఉన్న పవిత్రమైన బంధాన్ని గుర్తుచేసే ఉత్సవాలు. శాస్త్రీయ విజ్ఞానంతో కూడిన మన సంప్రదాయాల సారం ఆధునిక జీవన విధానంతోనూ అనుసంధానం చేయాలి. అమూల్యమైన జీవనాన్ని ఆస్వాదించాలి.



**జయశ్రీ ఆచంట,** సీనియర్ జర్నలిస్ట్

# దేశ నిర్మాణంలో

**గురూజీగా ప్రసిద్ధి చెందిన శ్రీ మాధవరావు సదాశివ గోల్వాల్కర్ ఆర్‌ఎస్‌ఎస్‌కు రెండవ సర్‌సంఘచాలక్‌గా 1940లో బాధ్యత స్వీకరించి 33 సంవత్సరాలపాటు యావత్ భారతదేశం పర్యటిస్తూ భారతీయ ఆత్మను అర్థం చేసుకున్న గొప్ప సామాజికవేత్త. వారు ఆజన్మాంతం భారతజాతి నిత్య యవ్వనానికి ప్రేరణదాతగా నిలిచారు. గొప్ప మేధావి. సంఘటనాశిల్పి. వివిధ సందర్భాలలో ఆయన యువకులకు ఇచ్చిన మార్గదర్శనం, స్ఫూర్తి నేటికి కూడా అర్థవంతమైనదే.**



యవ్వనాన్ని సుదీర్ఘకాలం నిలబెట్టుకోవడం సాధ్యమేనని చెబుతూ, అందుకు మార్గమేమిటో శ్రీ గురూజీ వివరించారు. "శాఖకు వెళ్లాలి, మనకు ముసలితనం రాలేదని గుర్తుంచుకోవాలి. మహాభారతకాలం నాటికి అర్జునుని వయస్సు 70 సంవత్సరాలు. అప్పటికి అతడిని యువకుడనే అన్నారు. మనలోని ఉత్సాహాన్ని పనిలో పెట్టాలి. వ్యాయామం చెయ్యాలి. ఆటలాడాలి. ఇతరులతో సామరస్యంగా ఉండడానికి వీలైన వాతావరణాన్ని నిర్మించే ప్రయత్నం చెయ్యాలి. కాని, ఇప్పుడు చాలామందిలో వ్యాయామంపట్ల విముఖత పెరిగి పోతోంది. మహారాష్ట్రలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటున్న ఒక యువకుడు జైలుకువెళ్లాడు. అతడు జైలులో రోజూ ఉదయంలేచి సూర్య నమస్కారాలు చేసేవాడు. ఇది చూసిన ఒక పెద్ద కాంగ్రెసు నేత అతడిని సూర్యనమస్కారాలు చెయ్యవద్దని అన్నాడు. ఎందుకు చెయ్యకూడదని ఆ యువకుడు అడిగితే, ఆ కాంగ్రెస్ నాయకుడు– నువ్వు చేస్తున్న వ్యాయామం కూడా ఒక రకం హింసే. నువ్వు శక్తిని ఉపాసిస్తున్నావు. అందువల్ల ఇతరులలో భయం ఉత్పన్నమవుతుంది. ఎవరి మనసులోనైనా భయాన్ని పుట్టించడం హింసే అవుతుంది అని చెప్పాడు. దేహబలంవల్ల ఇతరులకు భయం పుడుతుంది. కనుక దేహంలో బలం ఉండకూడదన్న వికృత భావన కూడా కొందరిలో ఉంది.

"రామకృష్ణ పరమహంస తనువు చాలించిన పిమ్మట ఆయన శిష్యులందరూ ఒక అద్దె ఇంట్లో ఉంటూ ఉపాసన ఆరంభించారు. రామకృష్ణునివలె తాము కూడా భావ సమాధిని పొందినట్లు కనిపించడం కోసం చాలామంది శిష్యులు అశ్రువులు కారుస్తూ కూర్చోసాగారు. కన్నీరు కార్చడం పెద్ద కష్టమైన పనికాదు. కాస్త ప్రయత్నం చేస్తే వచ్చేస్తాయి. అలా వాళ్లు ఏడుస్తూ కూర్చోవడం నచ్చక వివేకానందుడు "ఇలా ఏడుస్తున్నారెందుకు?" అని అడిగాడు. "ఇవి భావ సమాధిలో వస్తున్న ఆనందాశ్రువులు" అని వాళ్లు చెప్పారు. "ఈ ఉత్తుత్తి వేషాలు కట్టిపెట్టండి. శ్రీరామకృష్ణులతో సమానమైన తపశ్శక్తి, వైరాగ్యం, భావతాదాత్మ్యం మనకు లేవు. నేను ఇదంతా సాగనివ్వను. తపస్సు చేయండి. శరీరాలను శక్తి సంపన్నం చేసుకోండి. బలిష్ఠులు కండి. ఏడ్చే సన్యాసులు నాకక్కరలేదు" అన్నాడు వివేకానందుడు.

సమర్థరామదాసు కూడా "మనం ఢీకొంటే రాళ్లు పగిలిపోవాలి. అలా ఉండాలి మన శరీరాలు" అని అనేవారు. మన స్వయంసేవకులు కూడా ఈ విధంగా చురుకైన, ఉత్సాహభరితమైన, బలిష్ఠమైన, తేజోవంతమైన శరీరాలను నిర్మించుకోవాలి. ఎటువంటి శ్రమపడవలసి వచ్చినా వెనుదీయకూడదు."

**తమ కాళ్లనే నరుక్కున్నారు:** జీవితానికి నిబద్ధత అనేది ఉండి తీరాలని చెబుతూ, "సత్సంబంధాలు స్థాపించుకొనడానికి, ఎదుటివారికి ఇష్టంలేని వాటిని విడిచిపెట్టడం అవసరమవుతూ ఉంటుంది. కాని ఏమి విడిచిపెట్టవచ్చు, ఎంత వరకు విడిచిపెట్టవచ్చు అనేదానికి ఒక పరిమితి ఉంది. ఈ సామరస్య నిర్మాణం మన నాయకుల దృష్టిలో ఎంత ముఖ్యమైపోయిందంటే, వాళ్లు మిగిలిన విషయాల న్నిటినీ మరిచిపోయారు. దేశ శ్రేయస్సును పక్కన పెట్టడానికి కూడా వాళ్లకేమీ సంకోచమనిపించలేదు. ఇదంతా వాళ్లు దేశ స్వాతంత్ర్యం సాధన పేరు మీదే జరిపారు. కాని ఎవరి నుంచి, ఎవరికొరకు స్వాతంత్ర్యాన్ని సాధించాలో వాళ్లు మరిచిపోయారు. వందేమాతరాన్ని వదులుకున్నారు. ధర్మం ప్రసక్తిని విడిచిపెట్టారు. మన ప్రాచీన కాలాన్ని విస్మరించారు. స్వాభిమానాన్ని వదిలేశారు. చివరకు మన సొంత దేశంలోనే హిందువు అన్న మాటను ఉచ్చరించడం, హిందువుల శ్రేయస్సు గురించి మాట్లాడడం అపరాధంగా మారిపోయింది. మన మాతృభూమి విభజనకు, మనం మాతృభావనతో పూజించుకొనే గోవుల హత్య కొనసాగడానికి కూడా మన నేతలు సమ్మతించారు. హిందూ మహిళలకు మానహాని జరుగుతున్నా కూడా నేతలకు ఏ బాధా కలగటం లేదు" అన్నారు శ్రీగురూజీ.

"ఇలా జీవితంలో ఏ రకమైన నిబద్ధత లేకపోవడంవల్ల కలిగిన పరిణామమే నైతిక విలువల పతనం. అన్ని దిక్కుల స్వార్థచింతన విజృంభించింది. ధనం, అధికారం ప్రాబల్యాన్ని చెలాయిస్తున్నాయి. సమాజానికి మంచిదారి చూపే సంస్థలన్నిటినీ పనిగట్టుకుని విచ్ఛిన్నం చేశారు. మనకు ఇంత అనర్థం జరిగిందన్న స్పృహ కూడా మనలో లేకపోవడం చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. పైపెచ్చు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడమే తమ ప్రగతిశీలత అని చదువుకున్నవారు అనుకుంటున్నారు. 'హిందూ' అన్నమాట వినబడితే వాళ్లు ముఖం తిప్పేసుకుంటారు. హిందువు కావడమే అపరాధమైనట్లు, తమ గురించి తమకు

ఇంత బుద్ధి భ్రమ, సమాజం పట్ల ఇంత హీనభావన ఉన్న పరిస్థితి ప్రపంచంలో మరెక్కడా కానరాదు.”

**బంధనాలవల్ల కలిగే భయాన్ని పట్టించుకో కూడదు:** వర్షపు నీరు కొండలపై పడి జారిపోతుంది. దాన్ని అలాగే పోనిస్తే ఏ ఉపయోగమూ ఉండదు. అలా ప్రవహించిపోయే నీటికి ఆనకట్ట కట్టి జలాశయంలో దానిని నింపామంటే ఆ నీరు విద్యుత్తు ఉత్పాదనకు, వ్యవసాయానికి, ఇతర పనులకి ఉపయోగపడుతుంది. ఆ విధంగా మన జీవితాలు సుఖమయమవుతాయి. ఇదంతా బంధనంవల్ల సాధ్యం కాగలదు తప్ప బంధనముక్తి ద్వారా కాదు. ఇలా నిలవ చేసిన నీటిని కూడా ఒక క్రమపద్ధతిలో విడుదల చెయ్యాలి తప్ప ఎలా పడితే అలా వదిలిపెడితే బంధనాలు తప్పకుండా ఎదురవుతాయి. వాటిని మనం తప్పించుకోలేము. కనుక కావలసింది బంధనాల నుంచి విముక్తి కాదు, బంధనాలవల్ల భయాన్ని లెక్కచెయ్యకపోవడమే.

# యువత

**సమాజ రుణాన్ని తీర్చుకోవాలి:** మనిషి సమాజ రుణాన్ని మరిచిపోకూడదనేది శ్రీ గురూజీ బోధనలలో ముఖ్యాంశంగా ఉండేది. “సమాజంవల్లనే వ్యక్తికి కీర్తి, సౌకర్యాలు, రక్షణ లభిస్తాయి. మనకి సమాజం పట్ల కలుగుచున్న ఉపకారాలు లెక్కలేనన్ని. కాని ఈ ఉపకారాలను పొందడం రుణం తీసు కోవ డంతో సమానమే అవుతుంది. రుణం తీసుకుంటూ, దానిని తిరిగి చెల్లించకపోవడం మర్యాదస్తుల లక్షణం కాదు. మనిషి రుణ విముక్తుడై ఉండాలని మన ధర్మశాస్త్రాలలో చెప్పారు. అందుకు నిరంతరం ప్రయత్నిస్తుండాలి.

“ఈ లక్ష్యాన్ని సాధించడానికి తగిన వాతావరణం సామాజిక వ్యవస్థ నిర్మాణం ద్వారా మాత్రమే వీలవుతుంది. ఆ వ్యవస్థలో వ్యక్తి తన శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా, తనకుతాను వికాసం పొందేందుకు అవకాశమిచ్చేదిగా ఉండాలి. వ్యక్తి చింతాగ్రస్తుడై ఉన్నట్లయితే అతడు వికాసం పొందలేడు. ప్రస్తుతం చదువుకున్న వారు కూడా తమ సొంత అవసరాలు తీర్చుకొందుకు అజన్మాంతం ఆరాటపడుతూ ఉన్నారు. ఇటువంటి పరిస్థితులలో అంతిమ లక్ష్యప్రాప్తి అసంభవం.”

‘‘ఇటువంటి సమాజరచన ఒక్కరోజులో అయిపోయే అవకాశం ఎలాగూ లేదు. అదీగాక ప్రస్తుతకాలంలో అనేక సిద్ధాంతాలు ఒకదానితో ఒకటి పెనుగులాటలో ఉన్నాయి. దీనిని పోటీ అనవచ్చు.

***ఈ భూమిని తల్లిగా భావించుకొనే సమాజమొకటి ఈ దేశంలో ఉంది. ఈ సమాజానికి ఒక విశిష్ట జీవన పద్ధతి, ఆధార భూమిక, సామూహికమైన ఆకాంక్షలు ఉన్నాయి. ఈ సమాజాన్ని రాష్ట్రీయ సమాజం అనే పేరుతో వ్యవహరించవచ్చు. ఈ సందర్భంలో శ్రీ గురూజీ దేశం అనే మాటకు ఇచ్చిన వివరణ ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలు చెప్పినదే. ఈ వాస్తవాన్ని విస్మరించిన కారణంగానే నేటివరకు అనేక ఆపదలకు మనం గురయ్యాం. దేశ విభజనకన్నా మించిన ఓటమి ఇంకేమి ఉండగలదు?***

ఈ పరిస్థితులలో మనం “పాతదంతా చెత్త” అనే అభిప్రాయాన్ని విడిచిపెట్టి, విషయాన్ని వైజ్ఞానిక దృష్టికోణంతో పరిశీలించాలి. ముందు మన దేశం గురించి ఆలోచించాలి. దృఢమైన పునాదిమీద సంస్కారవంతమైన, వ్యవస్థితమైన రాష్ట్రాన్ని నిర్మించుకోవాలి. తద్వారా జాతీయ భావనను వ్యాప్తి చెయ్యాలి. ఈ భూమిని తల్లిగా భావించుకొనే సమాజమొకటి ఈ దేశంలో ఉంది. ఈ సమాజానికి ఒక విశిష్ట జీవన పద్ధతి, ఆధార భూమిక, సామూహికమైన ఆకాంక్షలు ఉన్నాయి. ఈ సమాజాన్ని రాష్ట్రీయ సమాజం అనే పేరుతో వ్యవహరించవచ్చు. ఈ సందర్భంలో శ్రీ గురూజీ దేశం అనే మాటకు ఇచ్చిన వివరణ ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలు చెప్పినదే. ఈ వాస్తవాన్ని విస్మరించిన కారణంగానే నేటివరకు అనేక ఆపదలకు మనం గురయ్యాం. దేశ విభజనకన్నా మించిన ఓటమి ఇంకేమి ఉండగలదు?

దేశ నిర్మాణ కార్యంలో నిమగ్నులం కావాలి: “విచ్ఛిన్నమైన ఆలోచనలతో కొట్టుకుపోవద్దని విద్యార్థులకు నా ప్రార్థన. ఈ విషయం గురించి స్వతంత్రంగా ఆలోచించాలి. నేను మీపై అబద్ధపు పొగడ్తలు కురిపించను. మిమ్మల్ని దేశం మూల స్తంభాలు అని అంటూ ఉంటారు. కాని ఇటువంటి స్తంభాలపై దేశం నిలబడలేదు. కనుక ఈ దేశానికి సేవకులుకండి, సమస్త శక్తితో దేశ నిర్మాణ కార్యంలో నిమగ్నులవ్వండని మాత్రమే నేను చెబుతున్నాను. ఏ దేశంలో యువశక్తి తన సమస్త సామర్థ్యాన్ని పణంగాపెట్టి దేశప్రగతికై కృషి చేస్తుందో, ఆ దేశం మాత్రమే ప్రగతిపథంలో ముందు నిలుస్తుంది. కనుక, మీరు కీర్తి, సంపద, అధికారం అనే వాటిపై కాంక్షను దేశమనే వేదికపై బలి ఇవ్వవలసందిగా నేను మరీ మరీ అర్థిస్తున్నాను. అలా చెయ్యడంలోనే దేశ సౌభాగ్యం, సమాజ గౌరవం, స్వీయసుఖం ఉన్నాయి.

“నేడు యువతరం మాత్రమే భోగప్రవృత్తిని త్యజించి, స్వార్థరహితంగా రాష్ట్రోన్నత సాధనకు నడుం కట్టే సాహసానికి పూనుకోగలదు. మీలో ఉన్న ఈ గొప్ప యోగ్యతను మీరు మీ తోటి విద్యార్థులు ఎరుగుదురు. కనుక నేడు దేశం ముందున్న రకరకాల సమస్యలను నిర్మూలించే బాధ్యతను చేపట్టేందుకు అవసరమైన యోగ్యతను సాధించడానికి కలిసి సాధన చెయ్యాలి.

శ్రీ గురూజీ వివిధ సందర్భాలలో అనేకమంది యువకులకు మార్గదర్శకమైన ప్రబోధం చేస్తూ లేఖలు వ్రాశారు. ఆ లేఖలలో గల ప్రబోధపు సారాంశాన్ని ఈ విధంగా వర్ణించవచ్చు. “విద్యార్థులను మిగిలిన సమాజానికి భిన్నమైన వేరే వర్గంగా పరిగణించడం సరికాదనిపిస్తోంది. సర్వసాధారణ ప్రజలలో ఉండే గుణగణాలే యువకులలోనూ వ్యక్తమవుతూంటాయి. అపరిపక్వమైన వయసువల్ల, అనుభవరాహిత్యంవల్ల సులువుగా ఆవేశానికిలోనయ్యే వయసు కావడంవల్ల వారి చేష్టలు అదుపునకు లొంగని ఉద్రేకంతో కూడుకొని ఉంటాయి. ఈనాటి యువకులకు సత్ప్రవర్తనకు సంబంధించిన సంస్కారాలను ఎవ్వరూ ఇవ్వటంలేదు. వారికి జీవితంలో ఒక రకమైన అస్థిరత, అభద్రత గోచరిస్తున్నాయి. ఆ కారణంగా వారు నిరాశాపూరితు లవుతున్నారు. తమ సమస్త శక్తులను ఒడ్డి సాధించే కృషి చేయవలసిన ధ్యేయమేదీ వారి కళ్లముందు లేదు. వారికి మార్గదర్శకులుగా ఉండవలసిన వారిలోగాని, ప్రజానాయకులనబడే వారిలోగాని ఏ ప్రేరణ దాయకమైన ఆదర్శమూ వారికి కనిపించటంలేదు. కుటుంబ వ్యవస్థ నేడు పూర్తిగా విచ్ఛిన్నమైపోయింది. నేటి యువతరంలో మనఃక్షోభ, అశాంతి, విశృంఖలత మొదలైన చెడులక్షణాలు ఉత్పన్నమవడానికి ఇవి కొన్ని కారణాలు. ఈ పరిస్థితినే యువకులలో, విద్యార్థులలో గల క్రమశిక్షణారాహిత్యమనవచ్చు.”

**వివేకానంద సూక్తిశతి**

**Go back to your upanishads- the shining, the strengthe ning, the bright philosophy and part from all mysterious things, all weakening things.**



దివ్యతేజశక్తి దీటైన బలమిచ్చు
ఉపనిషత్తులవ్వి ఉన్నమాట
దుయర్బలుండవౌచు దుఃఖించబోకుము
వినుడి స్వామి సద్వివేకవాణి!!



బండిరాజుల శంకర్
ఆలేరు,
9948050608

# ఇది నాటకం



ఇది ఒక నాటక ప్రదర్శన మాత్రమే కాదు. ఇది ఒక యుగావిష్కరణ. ఇది మన స్వంత చరిత్రతో మనకు కలిగే ఒక అనుభవం. భోపాల్‌లో ప్రదర్శితమైన రెండున్నర గంటల నిడివి గల ఈ శక్తిమంతమైన నాటకం, విదేశీ ఆక్రమణదారులకు వ్యతిరేకంగా సాగిన వెయ్యేళ్ల సుదీర్ఘ పోరాటంలో, చివరి దశలో స్వాతంత్ర్యం కోసం పరితపించిన భారతదేశపు గాథను ఆవిష్కరించింది. గత శతాబ్దంలో భారతదేశ చరిత్రను గాఢంగా ప్రభావితం చేసిన మహర్షి అరవిందుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, స్వాతంత్ర్య వీరసావర్కర్, మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ వంటి మహనీయులు ఒకే వేదికపై సమావేశమై ఉండటం ఎంతో ఉద్వేగభరితంగానూ, స్ఫూర్తిదాయకం గానూ అనిపించింది. వీరందరితో పాటు, ఇతరులతో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ భారతీయ సమాజంలో ఒక ప్రత్యేకమైన, కఠినమైన మార్గాన్ని ఎంచుకున్న మరొక వ్యక్తి కూడా వేదికపైన కనిపించారు. ఆయనే డాక్టర్ కేశవరావు బలిరామ్ హెడ్గెవార్. ఇంతటి గొప్పవారిని ఒకే వేదికపైన చేర్చిన ఆ నాటకం పేరు యుగప్రవర్తక్ డాక్టర్ హెడ్గెవార్.

ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా నాగపూర్‌కు చెందిన 'నాదబ్రహ్మ' అనే సంస్థ ఈ నాటకాన్ని రూపొందించింది. దీని 54వ ప్రదర్శన ఇటీవల భోపాల్‌లో జరిగింది. ఈ నాటకం ఆర్ఎస్ఎస్ సమగ్ర ప్రస్థానంపైన కాకుండా, కేవలం డాక్టర్ హెడ్గెవార్ జీవిత గాథపై మాత్రమే దృష్టి సారిస్తుంది. దేశ స్వాతంత్ర్య పోరాట కాలంలో భారతదేశ భవిష్యత్తు పట్ల ఉన్న ఆందోళనలు ఈ నాటకంలోని ప్రతి సన్నివేశంలోనూ ప్రతిబింబిస్తాయి.

నాటకంలో ఒక సందర్భంలో గాంధీజీని సూటిగా కొన్ని ప్రశ్నలను డాక్టర్ హెడ్గెవార్ అడుగుతారు. వాటికి ఆయన స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోతారు. పైగా, తన దైనందిన ప్రార్థన సమయానికి ప్రాధాన్యతను ఇస్తారు. తన ఆలోచనా పరిధిలో భిన్నాభిప్రాయాలకు ఏ మాత్రం స్థానం లేదా గౌరవం ఇచ్చేందుకు ఆయన సుముఖత కనబరచరు. హెడ్గెవార్ తన సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కాంగ్రెస్ అగ్రనాయకత్వాన్ని సంప్రదించే సాహసాన్ని రెండుసార్లు చేశారు. మొదట నాగపూర్‌లో. ఆ తర్వాత కలకత్తా సమావేశం సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ సమక్షంలో. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం తీర్మానాన్ని కాంగ్రెస్ ఎందుకు ప్రవేశపెట్టడం లేదు? హిందూ-ముస్లిం ఐక్యత అనే ఎండమావి కోసం ఆచరణ సాధ్యం కాని మార్గాన్ని కాంగ్రెస్ ఎందుకు అనుసరిస్తున్నది? అని ఆయన ప్రశ్నించారు.


గాంధీజీకి పర్యాయపదంగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ ఇస్లాం మత పెద్ద అయిన 'ఖలీఫా'కు మద్దతుగా ఖిలాఫత్ ఉద్యమాన్ని నడిపిస్తున్న తరుణంలోనే ఈ ప్రశ్నలు తలెత్తాయి. కేరళలో జరిగిన మోప్లా మారణకాండ, బలవంతపు మత మార్పిడుల పట్ల తీవ్ర ఆవేదనకు గురైన హెడ్గెవార్, ఖలీఫా విషయంలో కాంగ్రెస్ అవలంబించిన విచిత్రమైన వైఖరిని చూసి అయోమయానికి, ఆందోళనకు గురయ్యారు. గాంధీజీకి ఉన్న తిరుగులేని ఆధిపత్యంతో, కాంగ్రెస్ పార్టీ అదుపులేని వాహనంలా వేగంగా ముందుకు దూసుకుపోతూ ఉండేది. అంతిమంగా, హెడ్గెవార్ తన ప్రశ్నలతో ఒంటరిగా మిగిలిపోతారు. ఆయన దృష్టి భారతదేశ భవిష్యత్తుపై నిలిచింది. అది వెయ్యి సంవత్సరాల అణచివేతకు సామూహిక బాధితురాలిగా ఉండి, పోరాడుతున్నప్పటికీ విచ్ఛిన్నంగానే మిగిలిపోయింది. అన్నిటికంటే హిందూ సమాజ ఐక్యతకు, సంఘటనకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు.

అంత సుదీర్ఘకాలం పాటు సాగిన బానిసత్వం, పోరాటాల ఫలితంగా హిందూ సమాజం ఎంతగా క్షీణించిందంటే, దానిని చైతన్యపరచడం, ఏకం చేయడం, జాతీయ భావనతో ఉత్తేజపరచడం ఒక మహా సవాలుగా మారిందని నేతాజీ కూడా అంగీకరించారు. అయితే, హెడ్గెవార్ వ్యక్తం చేసిన ఆందోళనలతో ఏకీభవిస్తూనే, తమ దివ్యదృష్టి కారణంగా భారతదేశ ఉజ్వల భవిష్యత్తు పట్ల పూర్తి విశ్వాసంతో మహర్షి అరవిందుడు ఉన్నారు.

ఇక్కడి నుండి చరిత్ర రెండు ధారలుగా సాగుతుంది. అందులో ఒకటి కాంగ్రెస్ నాయకత్వంలోని స్వాతంత్ర్య ఉద్యమధార. స్వరాజ్య ఉద్యమానికి చెందిన దాదాపు అన్ని పోరాటాలు ఒక నిర్ణయాత్మక ముగింపునకు చేరకుండానే మధ్యలోనే చల్లారి పోయాయి. కానీ యావత్ ఉద్యమ ఘనతను కాంగ్రెస్







# కాదు యుగారంభం

పార్టీ తనదిగా చేసుకుంది. రెండవ ధార హిందూ సమాజ సంఘటనకు సంబంధించినది. ఇది కేవలం డాక్టర్ కేశవరావు బలిరామ్ హెడ్గెవార్ నేతృత్వంలో కొద్దిమంది సహచరులతో నాగపూర్‌లోని ఆయన నివాసం నుండి ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే, అది దాదాపు ఎవరికీ తెలియని ఒక శక్తిగా చరిత్ర అనే అరణ్యంలోకి అడుగు పెడుతుంది. 25 మందిలో 20 మంది వేసిన ఓట్ల ఆధారంగా సంస్థకు 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' అని పేరు పెట్టడం, అలాగే డాక్టర్ హెడ్గెవార్‌ను తమ మొదటి 'సర్‌సంఘచాలక్'గా అందరూ సమష్టిగా అంగీకరించడం అనే ప్రక్రియతో ఈ ప్రయాణం మొదలైంది.

చరిత్రలో నిలిచిపోయిన ఈ కీలక ఘట్టంలో, తన దార్శనికత, దృఢ విశ్వాసాల ప్రేరణతో డాక్టర్ హెడ్గెవార్ అజ్ఞాతమైన భవిష్యత్తు వైపు అడుగులు వేశారు. కొద్ది కాలంలోనే, అంకితభావం కలిగిన స్వయంసేవకుల శ్రేణులు ఆ 'మార్గం'లో భాగమయ్యాయి. ఆర్‌ఎస్ఎస్ పరిధిలో ఏ ఒక్క వ్యక్తికీ సర్వాధికారం ఉండకూడదని హెడ్గెవార్ తీర్మానించారు. "కాషాయ ధ్వజమే మనకు 'గురువు', దానికి మాత్రమే మనమందరం అంకితమయ్యాము. ఒక వ్యక్తి ఎంతటి గొప్పవాడైనప్పటికీ, మానవ సహజ బలహీనతలకు అతీతులు కాలేడు" అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ బలహీనపడి, చీలిపోవడం ప్రారంభమైన తరుణమది. ఒక నిరాయుధుడైన వ్యక్తి గుణగణాలలో ఏదో ఒక ప్రత్యేకతను శతాబ్దాలుగా గాయపడిన సమాజం చూసింది. ఆయన వెనుక ఏకం కావడానికి ప్రేరేపితమైనది. "మనం రాజకీయ అధికారాన్ని అనుసరించకూడదు. దానికి బదులుగా, మన సాంస్కృతిక పరిసరాలను ఆవరించిన అవరోధాలను తొలగించాలి" అనే ఆయన దృక్పథం అత్యంత స్పష్టమైనది. వినాశకరమైన విభజన తర్వాత భారతదేశం వారసత్వంగా పొందిన రక్తసిక్తమైన అధికారం, స్వతంత్ర భారతదేశ ప్రస్థానం, ఆర్‌ఎస్ఎస్ పోరాటం.. ఇవన్నీ మన గడప వరకు ప్రవహించిన చరిత్రకు సాక్షులుగా నిలుస్తున్నాయి.

ఆర్‌ఎస్ఎస్ శతాబ్ద కాలంలోనే, అనేక అత్యున్నత అధికార కేంద్రాల ఆవిర్భావం, పతనాలను మనదేశం చూసింది. దేశాల నిర్మాణం, పరిణామక్రమంలో చరిత్రలో ఏ ఒక్క అధ్యాయమూ అంతిమమైనది కాదు. ప్రతి అధ్యాయం వీరులకు సముచిత స్థానాన్ని ఇస్తుంది. అటువంటి స్థానం, గుర్తింపు పొందిన ఒక మహోన్నత వ్యక్తి వ్యక్తిత్వం, కార్యకలాపాలపై ఈ నాటకం దృష్టి సారించింది.

'నాదబ్రహ్మ' బ్యానర్‌పై, నిర్మాత పద్మాకర్ ధనోర్కర్, రచయిత డాక్టర్ అజయ్ ప్రధాన్, దర్శకుడు సుబోధ్ సుర్జీకర్, సంగీత దర్శకుడు. 40 మంది నైపుణ్యం కలిగిన కళాకారులతో కూడిన బృందం ఒక శతాబ్దపు కాలాన్ని కళ్లకు కట్టినట్లుగా ఆవిష్కరించింది. రంగస్థల ప్రదర్శనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అద్భుతంగా వినియోగించి, రూపొందించిన దృశ్యాలు ఈ నాటకానికి ప్రాణం పోశాయి. శక్తిమంతమైన గాత్రం, సూటిగా సాగే సంభాషణలు, సంగీతంతో కూడిన నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఆసాంతం కట్టిపడేసింది. ఈ నాటకాన్ని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలూ చూడాలి. దేశాన్ని నడిపించే పాలకులు, అధికారులు (వీలైతే వారి కుటుంబాలతో సహా), వివిధ రాజకీయ, సామాజిక సంస్థలకు చెందిన కార్యకర్తల కోసం దీని ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా, సమాజంలోని వివిధ రంగాలలో చురుకుగా ఉన్న బృందాలు ఈ నాటకాన్ని ప్రదర్శించాలి. చరిత్ర ఎలాంటిదైనప్పటికీ, అది మనందరిదీ. మనం దానిని చదవాలి. ముఖ్యంగా ఇప్పటివరకూ ఎవరూ తిరగేయని కీలకమైన అధ్యాయాలను చదవాలి.



– 'పాంచజన్య' నుంచి

# గ్లాస్గో హెూటల్ లోగోపై వక్రీకరించిన భారత్ మ్యాప్




భారత రెజ్లర్ లవ్లీనా బోర్గోహైన్ స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఒక రెస్టారెంట్‌లో అందించిన నాప్‌కిన్‌పై వక్రీకరించిన భారతదేశ పటాన్ని కామన్వెల్త్‌గేమ్స్ రజతపతక విజేత లవ్లీనా బోర్గోహైన్ ఎత్తి చూపుతున్న వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ వీడియోలో, 'మిస్టర్ సింగ్స్ ఇండియా – ది హోమ్ ఆఫ్ కర్రీ' అనే రెస్టారెంట్‌లోని నాప్‌కిన్‌లపై ముద్రించిన తప్పులతో కూడిన భారతదేశ పటం పట్ల లవ్లీనా అభ్యంతరం వ్యక్తంచేయడం చూడవచ్చు.

2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బృందం కనబరిచిన అద్భుతమైన ప్రదర్శనను పురస్కరించుకుని రెస్టారెంట్ ఏర్పాటుచేసిన విందులో పాల్గొనేందుకు లవ్లీనా ఆ రెస్టారెంట్‌కు వెళ్లారు. ఆ విందు సమయంలో, రెస్టారెంట్‌లో అందించిన నాప్‌కిన్‌లపై ముద్రించిన భారత పటం భారత భూభాగాన్ని తప్పుగా చూపిస్తోందని లవ్లీనా గమనించారు. ఆ పటంలో, బాక్సర్ స్వయంగా పుట్టిన ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశ భౌగోళిక భాగంగా చూపించలేదు. అంతేకాకుండా, పాకిస్తాన్, చైనాలు అక్రమంగా ఆక్రమించుకున్న జమ్మూ కశ్మీర్ భాగాలను కూడా ఆ పటంలో చేర్చలేదు.

ఇటీవల జరిగిన క్రీడల్లో రజత పతకం గెలిచి భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన అస్సాం బాక్సర్‌ను, భారత పటంలో ఈశాన్య రాష్ట్రాలను చేర్చకపోవడం తీవ్రంగా బాధించింది. ఆమె ఈ వక్రీకరణను ఎత్తిచూపి, ఈశాన్య రాష్ట్రాలను పటంలో చేర్చి సరిదిద్దాలని రెస్టారెంట్ యజమానులను కోరారు. ఈ మ్యాప్ స్థానంలో భారతదేశ భూభాగాన్ని సరిగ్గా చూపించే పటాన్ని ఉంచాలని బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు అజయ్‌సింగ్ కూడా రెస్టారెంట్ యాజమాన్యాన్ని కోరారు. పాపా సింగ్ అని కూడా సర్దార్ జిత్ సింగ్ యాజమాన్యంలోని ఈ రెస్టారెంట్, గ్లాస్గోలో ఒక ప్రసిద్ధ భారతీయ భోజన గమ్యస్థానం. లవ్లీనా వీడియో వైరల్ అయిన తర్వాత, నాప్‌కిన్‌లపై వక్రీకరించిన భారత పటం ఒక పొరపాటు అని ప్రజలు భావించారు. అయితే, ఆ వక్రీకరణ పొరపాటు వల్ల జరగలేదని, అది ఉద్దేశపూర్వకంగా చేసిన చర్య అని తేలింది. వెబ్‌సైట్‌ను పరిశీలించినా ఇదే కనిపిస్తోంది. లవ్లీనా ప్రకారం, ఆ రెస్టారెంట్ యాజమాన్యం అది బ్రిటిష్ మ్యాప్ అని పేర్కొంటూ, తప్పుడు మ్యాప్ కోసం తర్వాత క్షమాపణ చెప్పింది. ఈ విషయంపై తీవ్ర వ్యతిరేకత ఎదురైన తర్వాత ఆ రెస్టారెంట్ ఇన్‌స్టాగ్రామ్‌ను ఖాతాను తొలగించే ముందు, మిస్టర్ సింగ్స్ ఇండియా తప్పుడు మ్యాప్‌కు క్షమాపణలు చెబుతూ ఒక ప్రకటనను జారీ చేసింది. లోగోను సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

# ప్రపంచంలోని ప్రాచీన మర్రి చెట్టు మనదే!



బీహార్‌లోని ముంగేర్‌జిల్లాలో ఉన్న ఒక మర్రి చెట్టును, ఇప్పటివరకు తెలిసిన వాటిలోకెల్లా అత్యంత పురాతనమైన, కచ్చితమైన వయస్సు నిర్ధారణ జరిగిన మర్రి చెట్టుగా శాస్త్రీయంగా గుర్తించారు. దీని వయస్సు సుమారు 700 సంవత్సరాలుగా అంచనా వేశారు. ఈ ఆవిష్కరణ ఉష్ణమండల చెట్ల శాస్త్రీయ వయస్సు నిర్ధారణలో ఒక పెద్ద ముందడుగును సూచిస్తుంది. ఇది దక్షిణాసియాతో పాటు ఇతర ప్రాంతాలలో కూడా సహజ, సాంస్కృతికవారసత్వాన్ని పరిరక్షించే ప్రయత్నాలలో ఒక పరివర్తన తీసుకురాగలదు.

శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ జారీ చేసిన ఒక ప్రకటన ప్రకారం, పురాతన వృక్షాల వయస్సును అంచనా వేయడానికి సాంప్రదాయకంగా ఉపయోగించే చారిత్రక ఆధారాలు, జానపద కథలు లేదా స్థానిక సంప్రదాయాలపై ఆధార పడకుండా, అత్యంత కచ్చితమైన రేడియోకార్బన్ డేటింగ్ పద్ధతి ద్వారా ముంగేర్ మర్రిచెట్టు (ఫికస్ బెంగాలెన్సిస్) వయస్సును నిర్ధారించారు.

శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన లక్నోలోని బీర్బల్ సాహ్ని ఇన్స్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్కు చెందిన డాక్టర్ త్రినాబోస్ ఈ పరిశోధనకు నాయకత్వం వహించారు. ఉష్ణమండలంలోని ఆకు రాల్చే చెట్ల వయస్సును కచ్చితంగా నిర్ధారించడానికి ఒక కొత్త శాస్త్రీయ పద్ధతిని అభివృద్ధి చేసేందుకు ఆమె పరిశోధకులైన డాక్టర్ మయాంక్ శేఖర్, డాక్టర్ అఖిలేష్ కె. యాదవ్‌లతో కలిసి పనిచేశారు.

భారతదేశంలో మర్రి చెట్లకు అపారమైన పర్యావరణ, సామాజిక, సాంస్కృతిక ప్రాముఖ్యత ఉంది. వాటి విస్తృతమైన వేళ్ళు, కొమ్మల వలయం అనేకరకాల పక్షులకు, కీటకాలకు, ఇతర వన్యప్రాణులకు ఆశ్రయం, నివాసస్థలాన్ని అంది స్తుంది. శతాబ్దాలుగా, అవి సమాజాలు, మతపరమైన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యకలాపాలకు సమావేశ స్థలాలుగా కూడా ఉపయోగ పడుతున్నాయి.

చాలా ఉష్ణమండల ఆకురాల్చే జాతులకు సాంప్రదాయ వృక్ష వలయ కాల నిర్ణయపద్ధతులు ప్రభావవంతంగా ఉండవని, ఎందుకంటే అవి స్పష్టమైన వార్షిక వలయాలను ఏర్పరచవని పరిశోధకులు వివరించారు. ఈ సవాలును అధిగమించ డానికి, ఆ బృందం ముంగేర్ మర్రిచెట్టు ద్వితీయ కాండం మధ్యభాగం సమీపం నుండి, ఒక పురాతన ప్రాథమిక కొమ్మ నుండి కలప నమూనాలను సేకరించింది.

ఈ పరిశోధన ఫలితాలు, ఆ చెట్టును చారిత్రాత్మక బుర్రా బంగ్లా సమీపంలో సుమారు 300 నుండి 350 సంవత్సరాల క్రితం నాటారనే మునుపటి అంచనాలను సవాలు చేస్తున్నాయి. బదులుగా, ఈ మర్రి చెట్టు ఆ భవనం కంటే పురాతనమైనదని, ఒకప్పుడు ఆ ప్రాంతాన్ని కప్పి ఉంచిన సహజ అడవికి మిగిలి ఉన్న అవశేషం కావచ్చని ఈ అధ్యయనం సూచిస్తోంది.

# తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్న ప్రియాంక



**భా**రతదేశపు తొలి మైక్రోప్రాసెసర్‌ను డిజైనం చేసిన ఐఐటి మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి పేరు ప్రస్తావించకుండా గోమూత్ర విశేషజ్ఞుడంటూ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు ఆమె అజ్ఞానికే కాదు, హిందువులపట్ల ఉన్న తేలిక భావానికి కూడా అద్దం పడతాయి. ఇటీవలే లోక్‌సభలో నీట్‌పై జరిగిన నిరసనల అనంతరం జాతీయ పరీక్షా విధానంలో సంస్కరణలు చేపట్టేందుకు ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్‌పై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా వ్యంగ్యంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

విద్య లేదా వైద్య రంగాలలో తగిన నైపుణ్యం లేని వ్యక్తులను ఈ కమిటీలో చేర్చారని ఆమె ఆరోపించారు; ఇందులో 'మాజీ సమాచార శాఖాధిపతి, ఐటీ కంపెనీ యజమాని, గోమూత్ర నిపుణుడు' కూడా ఉన్నారని ఆమె వ్యాఖ్యానించారు.

అయితే ప్రియాంక గాంధీ ఎక్కడా, నేరుగా ప్రొఫెసర్ కామకోటి పేరును ప్రస్తావించకపోయినా,ఆమె వ్యాఖ్యలు స్పష్టంగా ఆయనను ఉద్దేశించి చేసినవని కించిత్ జ్ఞానం ఉన్నవారికి అర్థమైపోతుంది. వాస్తవానికి, ఆవు మూత్రం వల్ల కలిగే యాంటీ–బ్యాక్టీరియల్, జీర్ణక్రియ సంబంధిత ప్రయోజనాలను వివరిస్తూ ప్రొఫెసర్ కామకోటి పరిశోధనా ఆధారాలను సమర్పించిన 2025 నాటి వివాదాన్ని ప్రియాంక గాంధీ వ్యాఖ్య మళ్లీ తెరపైకి తెచ్చింది. 2025 జనవరిలో చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రొఫెసర్ కామకోటి మాట్లాడారు. గోమూత్ర ఉపయోగాలకు మద్దతుగా ఆయన 5 శాస్త్రీయమైన ఆధారాలను కూడా చూపించారు.

**ఇంతకీ ఎవరీ ప్రొఫెసర్ కామకోటి?**

దేశంలో ప్రముఖమైన కంప్యూటర్ సైంటిస్టుల్లో కామకోటి ఒకరు. ఐఐటీ మద్రాస్ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ లో ఎంఎస్, పీహెచ్ డీ పూర్తి చేశారు.

2. ఐఐటీ మద్రాస్‌లో అధ్యాపకునిగా చేరి, జనవరి 2022 లో ఆ సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

3. కంప్యూటర్ ఆర్కిటెక్చర్, ఐటీ సెక్యూరిటీ, విఎల్ఎస్ఐ డిజైన్ రంగాల్లో విశేష నైపుణ్యం ఉన్నవారు.

4. ప్రస్తుతం ఐఐటీ మద్రాస్ లో మైక్రో ప్రాసెసర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ఐటీ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్నారు. అలాగే జాతీయ భద్రతా సలహా మండలి సభ్యులు కూడా.

5. అలాగే భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖకి సంబంధించిన ఎఐ టాస్క్ ఫోర్స్‌కి చైర్మన్‌గా పనిచేశారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ, ఆర్బీఐ టెక్నాలజీ కమిటీలలో ఉన్నారు.

ప్రొఫెసర్ కామకోటి 150కి పైగా పరిశోధనా పత్రాలను అంతర్జాతీయ జర్నల్స్, సదస్సుల్లో ప్రచురించారు కూడా. అనేక మందికి గైడ్‌గా కూడా ఉన్నారు. పరిశ్రమలు, ప్రభుత్వ పరిశోధనా సంస్థల కోసం దాదాపు 50 ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారు.




# పోలీసు వేషంలో సంఘవిద్రోహులు?

**ఇ**టీవలే జంతర్ మంతర్ దగ్గర నీట్ ప్రశ్నపత్రం లీక్‌కి వ్యతిరేకంగా జరిగిన తీవ్ర నిరసనలలో అసాంఘిక శక్తులు ప్రవేశించాయన్న వాదనలో వాస్తవం ఉందని హమీమ్ మొండల్ అనే వ్యక్తి అరెస్టుతో రుజువైంది. విద్యార్థుల ముసుగులో ప్రధాని మోదీని ఉద్దేశించి అసభ్యకరమైన వ్యాఖ్యలు, పోలీసులపై కూడా దాడులు చేసిన క్రమంలో వీటిపై సామాన్యులు, జాతీయవాదుల నుంచి తీవ్ర అభ్యంతరాలు, వీరివెనుక ఎవరో ఉన్నారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు వీరి ఆ అనుమానాలు, వ్యాఖ్యలే నిజమయ్యాయి.

పాకిస్తాన్‌కి చెందిన జైషే మహ్మద్ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న హమీమ్ మొండల్ అనే వ్యక్తిని, అతడికి సహకరించిన యువతిని బెంగాల్ టాస్క్‌ఫోర్స్ అదుపులోకి తీసుకుని, విచారణను కూడా ప్రారంభించింది. ఇటీవలి జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు సృష్టించాలని, బెంగాల్ సీఎం సువేందు అధికారిని లక్ష్యంగా చేసుకోవాలని నిందితులు పక్కా ప్రణాళికలు కూడా వేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసు యూనిఫాంలో నిరసన ప్రదేశంలోకి ప్రవేశించి, అల్లర్లు సృష్టించాలని జైషే గ్రూప్ నుంచి వీరికి ఆదేశాలు కూడా అందాయని పోలీసులు పేర్కొన్నారు. ఇందుకోసం కొంతమంది మహిళలు, పురుషులతో ఓ గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకోవాలని కూడా జైష్ సూచించింది. అయితే, పూర్తి విచారణతో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి రానున్నాయి.

ఈ ఉద్యమాన్ని జెన్‌జీ ఉద్యమంగా, నీట్ పత్రాల లీకేజీకి వ్యతిరేక ఉద్యమంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగినప్పటికీ, దీని వెనుక విదేశాల నుండి భారీ ఆర్థిక సహాయం (ఫారిన్ ఫండింగ్) జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు మొండల్ నోరువిప్పితే అసలు విషయాలు బయటకువస్తాయి. ★

కథ

# గాలి గొలికింది

జి. నరసింహమూర్తి

చైతన్యం నశించిన ఆకాశం అంచులా, చచ్చుబడిపోయిన శరీర అవయంలా కోనసీమలో చివరి రైల్వేస్టేషన్ అది. దాని పక్కనే వందలాది మైళ్ల నుంచి అనాదిగా పయనిస్తూ సాగరంలో సమ్మిళితమయ్యే ఘనమైన గోదావరి పాయ మరొకటి.

సముద్రానికి ఒకే ఒక్క చిరకాల స్నేహితుడిలా లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం అపురూపంగా అగుపిస్తూ ఉంటుంది. దాని ప్రాభవ చిహ్నంగా ఎన్నో సంవత్సరాల నుంచి ప్రతిసంవత్సరం ఫెళఫెళ లాడుతూ సాగుతూన్న తీర్థం మరిక మూడు రోజుల్లోనే అందర్నీ అలరించేలా ఆరంభం కాబోతోంది.

తీర్థానికి ముందే నూతిలో మోటారు సైకిళ్ల నడిపేవాళ్లూ, మాజిక్కులూ, చిన్నిచిన్ని సర్కసులు చేసేవాళ్లూ రకరకాల వేషాలు వేసేవాళ్లూ, దొమ్మరోళ్లూ, గంగిరెద్దులోళ్లూ, కుంటీ గుడ్డ ఇతరత్రా రకరకాల యాచకులూ ఎక్కడెక్కడి నుంచో పొట్ట చేతపట్టుకుని తీర్థ సమయానికి ముందే చేరిపోతారు. పాత పరిచయాలుంటే వాటిని పంచుకుంటారు. ఇక ఈ జన్మకి ఇదే చాలని సరిపెట్టుకుని కొత్త ఆలోచనల కుత్తుకల్ని కోసి పారేసి చావుబతుకుల మధ్య సాగిపోతూంటారు.

జాతర్లూ, తీర్థాలూ తిరుగుతూ దొమ్మరాట ఆడే రుక్కుది కూడా ఆ తానులో ముక్కలాంటి బరువైన బతుకు. ఆరు, ఏడు సంవత్సరాల వయస్సున్న ఇద్దరి ఆడపిల్లలతో మూటా మూళ్లూతో, గుడివాడలో పూటుగా నాటుకొట్టిన మొగుడుతో ఆ స్టేషన్ రెండో నెంబరు ప్లాట్ ఫాం మీదికి చేరింది. రుక్కు పిల్లల్నీ, మూటల్నీ రైల్లోంచి తొరగా దింపేందుకు సిద్ధమవుతూ బల్లమీద చాచుకుపడుకున్న మొగుడు ఫకీర్ని 'నీ తాగుడు నాశనమవ్వా– టేషనొచ్చింది కిందికి దిగు' అంటూ చేత్తో అతణ్ని పొడిచింది. బయట రైలు కిటికీకి కట్టిన నాలుగు వెదురుగెడల నిత్రాళ్లూ చకచకా విప్పేసి ప్లాట్ ఫాం మీద వేసింది. తీర్థంలో ఆడే దొమ్మరాటకి తాడుమీద నడవాలంటే అవి ముఖ్యం. అదే రైల్లోంచి దిగిన బిచ్చగాళ్లూ, బుడగలూ, బూరలూ అమ్ముకునేవాళ్లూ టీసీకి దొరక్కుండా మెల్లిగా మరో తోవంట బయటకెళ్లిపోయారు. రుక్కు తన మూటల్నీ, పిల్లల్నీ ఒకటో నెంబరు ప్లాట్ ఫాం వైపుకి మధ్యనున్న పట్టాలమీంచే గబగబా దాటించేసింది. ఫకీరు మాత్రం తూలుతూ ఆ రెండో నెంబరు ప్లాట్‌ఫాం మీదే అటూఇటూ తచ్చాడుతున్నాడు.

"యేంటలా తిరుగుతున్నావ్. కిందికి దూకు, అవతల ప్లాట్‌ఫాం మీదికి పోదాం– లేపోతే ఈలోగా ఇంకోబండి రావొచ్చు... ఊ... కిందికి దూకు" అంది రుక్కు

తాగిన మత్తులో ఉన్న అతను తనను తాను కంట్రోలు చేసుకోలేక పోతున్నాడు. ఒంట్లో గుప్పెడు కండ లేదు. రుక్కు ఓ పదిక్షణాలు చూసింది. విసుగొచ్చింది. నీరసించి ఉన్నాడాయె–అతనికది సాధ్యం కాదని లోలోన ఏదో సణుక్కుంటూ అతణ్ణి అంది పుచ్చుకుని సందిట్లోకి రెండు చేతుల్తోనూ తీసుకుని, ఎత్తుకొచ్చి ఒకటో నంబరు ప్లాట్‌ఫాం మీదకు తెచ్చి కూర్చోబెట్టింది. క్షణం ఆలస్యం చేయకుండా ఆమె పైకి రెండుచేతుల సాయంతో ఎగిరి ప్లాట్‌ఫాం ఎక్కింది. పెనిమిటి ఫకీర్ని చెయ్యిపట్టుకుని కాస్త వెనక్కి లాగింది. మరో ప్రమాదమేమీ రాకుండా ముందు చూపుతో. అవసరార్థం మగాడు చెయ్యాల్సిన పని పది సెకండ్లలో ఆడది అంత చురుగ్గా చక్కబెట్టినందుకు చూసిన వాళ్లంతా 'అమ్మో, ఆడది!' అంటూ ఆశ్చర్యపోయారు.

స్టేషన్ బయట లగేజ్ వాన్ మరొకటి రేవు కెళ్తుంటే రుక్కూ అందులో ఎక్కింది అందర్నీ తీసుకుని. తీర్థం సమయం. కిరాయిలు ఎక్కువగా ఉండే రోజులేమో...ఓ లాంచీ గోదావరి రేవు నుంచి తీర్థం దరి ఏటిగట్టు వరకూ ట్రిప్పులేస్తుంటే, ఇంకా చాలామందితో పాటు రుక్కు లాంచీ ఎక్కింది. తన దగ్గరున్న దొమ్మరాట సామానూ, పెద్ద డోలక్ డప్పుకంటే మొగుడు ఫకీర్ని లాంచీ ఎక్కించడానికి నానా అవస్థలూ పడింది.

ఆ చుట్టుపక్కల తీర్థాల్లోనూ, జాతర్లలోనూ భోజన హోటల్ నడిపే సూరపరాజు రుక్కూనీ, ఫకీర్నీ గతంల ఓ చాలాసార్లు చూశాడు. తల ముగ్గుబుట్ట. తెల్లటి బుగ్గ మీసాలు. ఎనభై ఏళ్లొచ్చినా మంచి ఆరోగ్యవంతుడు.

"యేం అమ్మాయ్! తీర్థానికా?" సూరపరాజు పలకరించాడు.


రుక్కూ ఆయన్ని భోజన హోటల్ రాజుగారిగా గుర్తించి "మీరా రాజుగారూ! నమస్కారం బాబూ... మాకు బతకడానికి ఈ దొమ్మరాటే దిక్కైపోయింది".

"అవున్లే... నిండుగర్భంతో కూడా ఆ తాడుమీద నడకా సర్కస్సూ చేశావు పాపం! మీ ఆయన ఇంకా తాగుడు మాన్లేదన్నమాట. ఇద్దరు పిల్లల తండ్రయ్యాడు" అన్నాడు సానుభూతిగా.

"ఆయనికే ఆ బుద్ధుంటే మాకీ బాధలెందుకు!... కడకి ఈ చిన్నపిల్లల్ని కూడా దొమ్మరాట ఆడించాల్సి వస్తుంది" అంది రుక్కు బాధగా.

"మీ ఆయనకి గత సంవత్సరం కన్నా ఆరోగ్యం బాగా దెబ్బతింది సుమీ" అన్నాడు సూరపరాజు ఫకీర్ని పరీక్షగా చూస్తూ.

"యేం చెప్పను రాజుగారూ! పొద్దున్నే మందు తోనే ముఖం కడుగుతాడు. తాగి తొంగుంటాడు. పిల్లల్నీ నన్నూ పట్టించుకోడు. నేను పిల్లల్తో మధ్య మధ్య బయట కెక్కిడికైనా పోయి దొమ్మరాట ఆడి నాలుగురాళ్లు తెచ్చి, మేమెలాపోయినా ఆయన్ని



మాత్రం పోషించాల్సి వస్తుంది” అంది తెలిసిన పెద్దాయన కనుక.

లాంచీలో ఓ వర్తకుడు “ఈళ్ల గురించి తెలుసా బాబాయ్?” అంటూ ప్రశ్నించాడు సూరపరాజుని.

తెలుసు అన్నట్లు తలూపి “ఈ పిల్ల వీళ్ల తాతకి ఓ జాతర్లో దొరికింది. అప్పట్లో అతగాడూ, భార్యా దొమ్మరాటలు ఆడేవారు. ఈ పిల్ల కూడా వాళ్లతో తిరుగుతూ పెద్దదయింది. వాళ్ల తాతామామ్మలకి సాయంగా ఉంటూ దొమ్మరాటలో ఆరితేరింది. వాళ్లు ముసలాళ్లయిపోయారు. ఈలోగా యెక్కన్నుంచో వచ్చి వీళ్లతోపాటే ఉంటూ వచ్చాడు ఈ కుర్రోడు. ఈ పిల్లకి వయసొచ్చింది కనుక ఈ కుర్రోడికిచ్చి పెళ్లి చేశారు ఆ ముసలోళ్లు. ఇప్పుడు వాళ్లూ లేరు పాపం” అన్నాడు సూరపరాజు గతంలోకెళ్లి.

సూరపరాజు తమ గురించే మాట్లాడుతున్నాడని గ్రహించాడు ఫకీర్.

“యేంటే నా గురించి చెబుతున్నావ్?” అంటూ కస్సుమన్నాడు.

“నీ గురించేమీ చెప్పనవసరం లేకుండానే తెలుస్తుంది. ఇక ఆ తాగుడు మానేయ్” అన్నాడు సూరపరాజు ఓ పెద్దమనిషిగా.

“అలా చెప్పండి రాజుగారూ! – డాక్టర్లు ఈయనకి లివర్లని చెప్పారు. తాగుడు మానకపోతే పేణానికి ముప్పన్నారు. అయినా ఇంటంలేదు” అంది రుక్కు.

“.... నోర్ముయ్” అంటూ రుక్కుని ఓ బూతు తిట్టాడు ఫకీర్.

* * *

తీర్థం జాగాకి చేరుకుని చిన్న గుడారం లాటిది వేసింది రుక్కు పిల్లల సాయంతో.

రుక్కూను గతంలో ఇతర తీర్థాలలో చూసిన బిచ్చగాళ్లూ, వేషగాళ్లూ పలకరించారు.

“నీకు సాయంగా పిల్లలందొచ్చారన్నమాట” అందో బిచ్చగత్తె.

“ఈళ్లు కూడా ఈ దొమ్మరాటతోనే మట్టి పాలవుతారేమోనని భయంగా ఉంది. అందర్లా నాలుగక్షరం ముక్కలు చదుకొని గౌరవంగా బతికే రోజులు రావాలని ఆశ పడుతున్నాను పెద్దమ్మా” తన మనసులోది చెప్పుకుంది రుక్కు

“ఈ దొమ్మరాట గడిగడి గండం–యెప్పుడు చెయ్యిరిగితాదో...యెప్పుడు కాలిరిగితాదో యేంటో నీ బతుకుతో పాటు నీ ఇద్దరాడపిల్లల బతుకూ యిందులోనే తెల్లారిపోతాదేమో. పాపం” అంటూ వెళ్లిపోయింది.

రుక్కూకి ఆ మాట గునపంలా గుచ్చుకుంది.

మర్నాడు ఉదయం సముద్రస్నానాలతో తీర్థం ప్రారంభమైంది. రెండోరోజు రథయాత్ర ఆఖరయ్యే వరకూ తీర్థం ఎడతెరిపి లేకుండా సాగుతూనే ఉంటుంది.

రుక్కూ ప్రతి సంవత్సరం లాగే అదే చోటు ఎంచుకొని తాడుమీద నానా రకాల విన్యాసాలూ చేస్తోంది. ఏడేళ్ల కూతురు కూడా తాడు మీద అవలీలగా నడుస్తోంది. ఆరేళ్ల కూతురు మంటల రింగులోంచి జంపింగ్ చేస్తుంది. మొగ్గలూ, పల్టీలు వేస్తుంది. మధ్య మధ్య డప్పుకొడుతుంది.


రుక్కు నాపరాయి ఛాతీమీద పెట్టుకుని సుత్తితో బద్దలు గొట్టించుకొంటుంది. భగభగమండే అగ్గి తూటాని నోట్లో పెట్టుకుని సునాయాసంగా ఆర్పేస్తుంది. కంఠానికి ఇనుపచువ్వను ఆనించి అవలీలగా వంచేస్తుంది.

“ఇది ఆడదా? మగోడా?” అన్నాడో ప్రేక్షకుడు.

“రెండు కలిసిన ఇనపముక్క రాబాబూ!” అన్నాడు దానికి సమాధానంగా మరొకడు.

ఆ మాటలు రుక్కు చాలాసార్లు విన్నవే. చిన్నప్పట్నుంచీ దొమ్మరాటలో కండరాలన్నీ ఉక్కుగా మారిపోయాయేగాని మనసు కాదు. అలా ఎందుకాలేదా అనుకుంది రుక్కు చాలాసార్లు.

దొమ్మరాటకి మధ్యలో రుక్కు..సూరపరాజు భోజన హోటల్ నుంచి ఓ పాకెట్ మీల్స్ కట్టించుకెళ్లి ఫకీర్ని లేపింది. భోంచెయ్యమని బతిమాలింది. ‘పిల్లలు



అలసిపోయారు వచ్చి దప్పయినా ఆడించు' అని అడిగింది. 'రెండొందలిచ్చి వెళ్లు' అన్నాడు. భర్త చేతిలో రెండొందలు పెట్టి పిల్లల దగ్గరకు పరుగెత్తింది రుక్కు. చిన్న వయసులో ఉన్న ఆడపిల్లలు చేసే విన్యాసాలు చూసి కాదనకుండా లేదనకుండా జనం పల్లెంలో డబ్బులిస్తూనే ఉన్నారు.

దొమ్మరాట కట్టేసి రాత్రి తొమ్మిదిగంటలకు గుడారానికే రుక్కు పిల్లల్తో– మొగుడు ఫకీరు ఆమె ఇచ్చి వెళ్లిన అన్నం రెండు ముద్దలు తిని తక్కింది అలాగే వదిలేశాడు. కాని అతని పక్కన ఖాళీ మద్యం బాటిల్ పడుంది.

తన శరీరమూ, మనసూ దొమ్మరాటతో అలిసి పోయాయి. పసిపిల్లలు పొద్దున్నుంచీ ఎడతెరిపి లేకుండా ఎముకలు విరిగేలా సర్కస్ ఫీట్లు చేసి అలసి సోలి పోయారు. రెండ్రోజుల తీర్థంలో వచ్చే సంపాదనతో కొన్ని రోజులు బతకాలి. బాధ్యత తీసుకోవలసిన భర్త తాగి పడున్నాడు. ఓ పక్క తీర్థమంతా సంబరం! రుక్కు హృదయం మాత్రం కన్నీటి మయం!

తన ఆలోచనల్ని అవతలపెట్టి బయటికెళ్లి పిల్లలకూ భర్తకూ భోజనం తెచ్చింది. పిల్లలిద్దరూ ఆకల్తో ఉన్నారేమో తిని అక్కడే నిద్రపోయారు. భర్తని భోజనానికి లేపింది. అతను లేవలేదు. ఆమే అతణ్ణి పొదివి పట్టుకుని అన్నం తినిపించేందుకు ప్రయత్నిం చింది. రెండు ముద్దలు బలవంతంగా తిని, భళ్లున వాంతి చేశాడు. మద్యం వాసన ఆమె భరించలేక పోయింది. అదంతా కడిగి శుభ్రం చేసింది.

అమాయకంగా నిద్రపోతున్న కూతుళ్ల ముఖంలోకి చూస్తుంటే తన బాల్యం గుర్తొచ్చింది. తనను కన్నవాళ్లెవరో తెలియదు. తాను కనుక్కున్నా బిడ్డలు మాత్రం అనాథలు కాకూడదు. రేపు తనకేదైనా అయితే పిల్లలు రోడ్డున పడకూడదు. కొందరు తల్లిదండ్రుల్లా పిల్లల్ని పెంచలేక, తమ కూడా సంపాదించుకుని రమ్మని నిత్యన్ని బయటకు తోలెయ్యకూడదు. వీటన్నిటికీ పరిష్కారం ఏమిటి? ఆమెకేనాటి నుంచో మనసులో–"నా బిడ్డలకు నాలాటి బతుకు రాకూడదు. వాళ్లు చదూ కోవాలి. సొతంత్రంగా సుఖంగా గొప్పగా బతకాలి" అని ఉంది.

అంతులేని ఆలోచనల సుడిగాలుల్లో నిస్సహా యంగా, వాటికో మార్గం కనుచూపు మేర కనిపించకా, అలసటగా కళ్లు మూసింది.

రాత్రి రెండు గంటలు. ఊపిరి పీల్చుకోడానికి తెగబాధ పడుతున్నాడు ఫకీరు. రుక్కు లేచి సపర్యలు చేసింది. కాసిని నీళ్లు పట్టించి పడుకోబెట్టింది.

తెల్లారితే రెండోరోజు తీర్థం. నరసింహస్వామి గుడి దగ్గర నుంచి గుర్రాలక్క గుడి వరకూ రథయాత్రకు జనం ఉరకలేస్తారు. సాయంత్రానికి జనం తిరుగు ముఖం పడతారు.

ఇక ఆ ఒక్కరోజూ సంపాదన కూడా జత చేసుకోవాలి. దొమ్మరాటలు యెన్ని యెక్కువ వేస్తే అంత సొమ్ము దొరుకుతుంది. ఏదిగే పిల్ల" రేపటి కోసం ఉపయోగిస్తే ఎంత బావుంటుంది! నోట్లో అక్షరం ముక్క లేకుండా, మీదపడే యవ్వనాన్ని దాచుకోలేక, రోడ్డుమీద దొమ్మరాట్లతో పిల్లలు ఈ మృగాల మధ్య ఎలా? ఎంతకాలం బతుకుతారు?– ఇవన్నీ రుక్కుకీ సవాళ్లే!

గత రోజు పొద్దున్నుంచి రాత్రి వరకూ దొమ్మరాట ఆడి అలసి నిద్రిస్తున్న కూతుళ్లను పొద్దున్నే లేపి రుక్కు "ఈ ఒక్కరోజు కష్టపడండమ్మా ఈ వేళతో తీర్థమయి పోతాది'' అంటూ బతిమాలింది, బుజ్జగించింది. వాళ్లకి ఆ కబురూ ఈ కబురూ చెప్పి తయారుచేసింది. ఆవేళ రెక్కలు ముక్కలు చేసుకోవ డానికి తానూ నడుం బిగించింది. తన పిల్లలకో



మంచి దారి చూపించాలి!

భర్త ఫకీర్ని ఉద్దేశించి, "ఆ పాడు సారా తప్ప, తిండి మానేశావులే. కాస్త టీ టిఫినూ తెస్తాను, తిందువుగాని" అంది.

ఆమె రెండుమూడుసార్లు ఫకీర్ని పలకరించింది గట్టిగా.

అతన్లో ఉలుకులేదు, పలుకూ లేదు.

"నిన్నే" అంటూ భుజం మీద చెయ్యేసి కదిపింది. ఏదో మార్పు కనిపిస్తోంది. తనకు చల్లగా తగిలింది అతని ఒళ్లు. ముక్కుకి దగ్గరగా చెయ్యెట్టి చూసింది. ఇక అతనికి గాలిపీల్చే అవసరం తీరిపోయిందని ఆమెకు అర్థమైంది. భోరున ఏడుపొచ్చేదే కాని తన గొంతు తానే నొక్కుకుంది.

ఆమెలో వేదన లావాలా పొంగి, పొర్లి, కరిగి, చల్లగా భయంకరమైన లోయల లోతుల్లోకి జారి పోతోంది. కాస్సేపటికి తేరుకుని ఆలోచించింది. అతని మరణం తనకి తప్ప మరెవ్వరికీ తెలియ కూడదు. భర్త చావు ఆవేళ తన దొమ్మరాటకు అడ్డం కాకూడదు. అదో అవాంతరం అవకూడదు.

దుఃఖాన్ని దూరంగా తరిమేసి ధైర్యాన్ని నింపుకుంది!

రుక్కు డప్పు తన భుజాన తగిలించుకుంది. కూతుళ్లను చెరో చెయ్యి పట్టుకుని గుడారం బయటకి తీసుకొచ్చేసింది. ఇక ఆ గుడారం తనది కాదను కుంది. దొమ్మరాట ఆడే చోటుకి పిల్లల్తో చేరిపోయింది. ఉదయం ఏడు గంటలు. తీర్థంలో యెక్కడివాళ్లక్కడ ఇంకా కాలకృత్యాలు తీర్చుకుంటు న్నారు. రుక్కు తన ఆవేదన, ఆవేశం పట్టలేక ఆ డప్పు మెడకు తగిలించుకుని పిచ్చెక్కినట్టు బాదు తోంది.

భర్త మరణాన్ని అలా ఆ నాదంతో తుడిచెయ్యా లనుకుంటూ ప్రకృతితో మొరపెట్టుకున్నట్టుంది.

అది విన్న వాళ్లు కొందరు "దొమ్మర రుక్కీ ఆట తెల్లారకముందే ఆరంభిం చింది" అనుకున్నారు. ఆవేళ పిల్లలకంటే తానే ఆటమీద ఆటగా పిచ్చిదానిలా ఆడేస్తుంది. దొమ్మరాట బరి తానొక్కర్తే దున్నేస్తుంది. ఇక తనకు అదే ఆఖరి దొమ్మరాటన్న నిర్ణయానికొచ్చేసింది. అలాగే తన పిల్లలకూ అదే ఆఖరి దొమ్మరాట కావాలి. ఇక దొమ్మరి రుక్కు సంతానం దొమ్మరోళ్లు కాకూడదు. వాళ్ల చేతుల్లో రాళ్లూ రప్పలూ ఉండకూడదు. బుక్కులుండాలి. వాళ్ల గుండెలమీద రాళ్లు బద్దలు గొట్టించుకోనవసరం లేదు. వాళ్ల హృదయాల్లో మంచి బుద్ధులుండాలి. అదే ఆమె ఆలోచన!

రథయాత్ర ముగిసింది. తీర్థం ప్రజలు తిరుగుముఖం పట్టారు.

చెమట్లతో తన శరీరం నానిపోయింది. తనలాగే చెమట్లతో నానిపోయిన ఇద్దరి కూతుళ్లను తన మీదున్నా బట్టతో తుడిచి గుండెలకు హత్తుకుంది. ఎన్నడూ లేంది అపుడెందుకు తల్లి తమనంత ప్రేమగా హత్తుకుందో వాళ్లకీ తెలియలేదు.

ఇపుడు ఏ గవర్నమెంటు బడి వరకైనా వెళ్లి పిల్లల్ని బడిలో చేర్పించేందుకు అవసరానికి తన దగ్గర కొంత డబ్బుంది. మట్టిలోంచి మాణిక్యాలను తయారు చేసే సంకల్పబలం తనలో పొంగి పొర్లుతోంది.

తనకు తానే నిబ్బరపడి...పోయిన పెనిమిటికి మనసులోనే ఓ దండం పెట్టుకుని పిల్లల కోసం ముందుకు సాగడమే ముఖ్యమని నమ్మింది. చనిపోయిన భర్త కంటే బతికున్న బిడ్డల భవిష్యత్తు ఆలోచించాల్సిన అవసరం తనకుందన్న కఠిన నిర్ణయానికొచ్చేసింది. తనకోదారి కనిపిస్తోంది.

జనం పల్చపడుతున్నారు. చీకట్లు ముసురుతు న్నాయి. తన దొమ్మరాట సామాను గెంటేసింది. అంతవరకూ తన జవసత్వాల్నీ, ఓర్పునీ, సహనాన్నీ చాటుతూ నిరంతరంగా మోగిన మెడలో ఉన్న డప్పును దూరంగా విసిరేసింది.

తీర్థ ప్రయాణీకుల కోసం కాస్తదూరంలో వరసగా నిలబడ్డ బుస్సుల వేపు పిల్లల్తో గబగబా ముందుకు నడిచింది. తనకో దారిదొరికింది . ★

ప్రతి అంశాన్ని వివాదాస్పద కోణంలో చూడటం మన వ్యవస్థకు ఓ శాపంగా మారింది. దశాబ్దాల తరబడి వాడుతున్న భారత హాకీ జట్ల జెర్సీలు సాంప్రదాయ నీలి రంగు నుంచి కాషాయం రంగుకు మార్చడం కూడా ఇప్పుడు చర్చనీయాంశమయ్యింది.




# రంగు మార్పుతో నష్టమేంటి?

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారత్‌లో ప్రస్తుత పరిస్థితి ..వివాదానికి కాదేదీ అనర్హం అన్నట్లుగా తయారయ్యింది. కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం సంబంధం లేని అంశాలకు రాజకీయరంగు పులిమి రగడ చేయడం ప్రభుత్వ వ్యతిరేక వర్గాలకు ఓ అలవాటుగా మారింది. హాకీలో భారతజట్టు గత ఎనిమిది దశాబ్దాలుగా వాడుతూ వస్తున్న సాంప్రదాయ నీలిరంగు జెర్సీ (దుస్తుల) రంగును కాషాయ రంగుకు మార్చడం ఇప్పుడు ఓ వివాదంగా తెరమీదకు వచ్చింది.

క్రీడలు ఏవైనా ఆయా దేశాల జాతీయ జట్ల క్రీడాకారులు ధరించే దుస్తుల రంగు ప్రత్యేకంగా ఉంటుంది. సాధారణంగా తమ జాతీయపతాకం రంగులతో కూడిన జెర్సీలనే ఎక్కువగా వాడుతూ ఉంటారు. అయితే.. భారత జాతీయజట్లు మాత్రం స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే జాతీయపతాకంలో లేని నీలిరంగును ధరిస్తూ వస్తున్నాయి.

అంతర్జాతీయ క్రికెట్ వర్గాలలో నీలిరంగు దుస్తులు ధరించే భారత్ జట్టును 'మెన్ ఇన్ బ్లూ'గా పిలుస్తూ ఉంటారు. ప్రస్తుతం గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంటున్న 125 మంది అథ్లెట్లు, ఇతర సిబ్బంది సైతం నీలిరంగు జెర్సీలనే ఉపయోగిస్తున్నారు. అంతేకాదు..జెర్సీలతో క్రీడాకారులకు మాత్రమే కాదు..కోట్లాదిమంది క్రీడాభిమానులకూ భావోద్వేగ అనుబంధం ఉంటుంది. మన హాకీజట్ల జెర్సీలను సాంప్రదాయ నీలి రంగు నుంచి హఠాత్తుగా కాషాయరంగుకు మార్చడం కలకలమే రేపింది. హాకీని కాషాయికరణ చేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక..హాకీ జెర్సీల రంగును మార్చడం క్రీడల్లో రాజకీయాలను జొప్పించడమేనంటూ ఆరోపించారు.

## ఎవరి వాదన వారిది...!

ఒలింపిక్స్‌లో భారత్‌కు రికార్డుస్థాయిలో ఎనిమిది బంగారు పతకాలు అందించిన ఒకే ఒక్క క్రీడ హాకీ. హాకీ అధికారికంగా భారత జాతీయ క్రీడ కాకున్నా కోట్లాదిమంది క్రీడాభిమానుల దృష్టిలో జాతీయ క్రీడగానే కొనసాగుతోంది. ప్రపంచ, ఒలింపిక్స్, ఇతర అంతర్జాతీయ క్రీడల స్థాయిలో భారతజట్టు ఏ ఘనత సాధించినా, ఎన్ని పతకాలు గెలుచుకొన్నా నీలిరంగు జెర్సీలను మాత్రమే ధరించి సాధించింది.

నెదర్లాండ్స్, బెల్జియం దేశాలు వేదికగా త్వరలో జరిగే ప్రపంచ పురుషుల, మహిళల హాకీ పోటీలలో పాల్గొనే భారతజట్లు సాంప్రదాయ నీలిరంగు జెర్సీలకు బదులు కాషాయం రంగు జెర్సీలని ధరించి పాల్గొనబోతున్నాయి. జాతీయ హాకీ సమాఖ్య తీసుకొన్న ఈ నిర్ణయాన్ని భారత హాకీ మాజీ కెప్టెన్లు వీరేంద్ర రస్కినా, పర్గత్ సింగ్ తప్పుపడుతున్నారు. భారత హాకీ అంటే సాంప్రదాయ నీలిరంగు జెర్సీలను ధరించిన జట్టు మాత్రమేనని, కాషాయరంగుకు జెర్సీలను మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ మండిపడుతున్నారు.

హాకీకి కాషాయరంగు పులమటాన్ని మించిన విషాదం మరొకటిలేదని హాకీ మాజీ కెప్టెన్, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్ ప్రశ్నిస్తున్నారు. 1928 ఆమ్ స్టర్ డామ్ ఒలింపిక్స్ నుంచే భారతజట్టు నీలిరంగు జెర్సీలను ధరిస్తూ వస్తోందని, స్వాతంత్ర్యా నంతరమూ ఇదే రంగు జెర్సీల సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తోందని. ఇప్పుడు రంగు మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందని హాకీ ఇండియా పెద్దలను నిలదీస్తున్నారు.

## నవీన్ పట్నాయక్ గరం గరం....

జాతీయ హాకీ పునరుజ్జీవనం కోసం దశాబ్ద కాలం పాటు కృషిచేసిన ఒడిషా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హాకీకి కాషాయరంగు పులమటాన్ని తప్పుపడుతున్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హాకీని ప్రోత్సహిస్తూ, స్పాన్సర్‌షిప్ రూపంలో రూ.150 కోట్ల సాయం అందించానని, కేంద్రప్రభుత్వం హాకీ అభివృద్ధికోసం పైసా విదల్చలేదని గుర్తు చేశారు.

## సాంకేతిక సమస్యలతోనే రంగు మార్పు...

మరోవైపు..హాకీజట్ల జెర్సీల రంగును కాషాయానికి మార్చడాన్ని 'హాకీ ఇండియా' అధ్యక్షుడు దిలీప్ టిర్కే గట్టిగా సమర్థించారు. కేవలం సాంకేతిక కారణాలతోనే రంగు మార్చాల్సి వచ్చిందని, ఇందులో రాజకీయం ఏమీలేదని వివరణ ఇచ్చారు. అంతర్జాతీయ హాకీ మైదానాల వర్ణం నీలిరంగులో ఉండటం, భారతజట్టు జెర్సీలు సైతం నీలిరంగులోనే ఉండడంతో ప్రత్యక్షప్రసారాల సమయంలో పలు రకాల సమస్యలు ఎదురవుతున్నాయని, జట్ల సభ్యులు, శిక్షకులు, సహాయక బృందం ఆమోదంతోనే ఈ నిర్ణయం తీసుకొన్నామని తేల్చి చెప్పారు.

జెర్సీరంగు మార్పు తమకు ఆమోదమేనని, ఆటతీరు తప్ప దుస్తుల రంగు ప్రధానం కాదని భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ హాకీలో గత కొన్ని సంవత్సరాలుగా చోటు చేసుకొంటున్న పరిణామాలలో జట్ల జెర్సీల రంగు మార్పు కూడా ఒకటి అని వివరణ ఇచ్చారు.

ఇప్పటి వరకూ 'నీలిదళంగా' నీరాజనాలు అందుకొన్న భారతహాకీ జట్లు ఇక 'కాషాయ దళం' రూపంలో సంచలన విజయాలు, అరుదైన ఘనతలు సొంతం చేసుకోవాలని కోరుకొందాం.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# బీకేఎస్ ఆధ్వర్యంలో మహిళా రైతు సదస్సులు

అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరంలో వ్యవసాయంలో మహిళా రైతులు పడుతున్న కష్టం, చేస్తున్న సేవ, వారి ఆరోగ్యం పై రసాయనిక ఎరువుల, క్రిమి సంహారకాల ప్రభావం, పని గంటలు, ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్లలో మహిళ రైతులు అనుభవిస్తున్న శారీరక, మానసిక సమస్యలు గురించి చర్చ అవసరం. అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరంగా 2026ను ప్రకటించడం హర్షదాయకమే. ప్రపంచవ్యాప్తంగా సమాజంలోని బాధ్యతాయుత ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వ సంస్థలు, మహిళా సంఘాలు, మీడియా ఈ ప్రత్యేక మహిళా రైతులు సంవత్సరాన్ని విస్మరించిన విధానాన్ని మనం అందరం తీవ్రంగా ఖండించి తీరాలి.





సమాజంలో ఉన్న అన్ని వృత్తులలో వ్యవసాయం అత్యంత నిరాదరణకు గురవుతున్న విషయం మనం గమనిస్తున్నాం. వ్యవసాయరంగం పైన మెకానైజేషన్‌కు సంబంధించి ట్రాక్టర్ కంపెనీల వారు, ఇతర పరికరాలు తయారు చేసేవారు, మోటార్లు తయారు చేసేవారు విత్తన కంపెనీల వారు, క్రిమిసంహారక కంపెనీల వారు మార్కెట్లలో అడ్తిదారులు, ఖరీదు దారులు, హమాలీలు, మార్కెట్ ఉద్యోగస్తులు, మార్కెట్ ద్వారా లాభాలను ఆర్జిస్తున్న, ఆదాయాన్ని పొందుతున్న ప్రభుత్వం అందరూ గౌరవం పొందుతూ, తగినంత ఆదాయం సంపాదిస్తున్నారు. కానీ, దానిపైన ఆధారపడిన రైతు మాత్రమే నష్టపోతున్నాడు. ఇక, మహిళా రైతుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమేలేదు. మహిళా రైతులు తమ ఉత్పత్తులను తీసుకుని మార్కెట్‌కు వచ్చి అమ్ముకునే సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవ డానికి కూడా సరియైన సౌకర్యం ఉండడంలేదు. మహిళా రైతులు ప్రయాణించడానికి సరైన సౌకర్యాలు సమయానుకూలంగా ఉండడం లేదు. కూరగాయల బస్తాలు రవాణా చేసే వాహనాల పైననే వీరు ప్రయాణం చేయడం మనం చూస్తూనే ఉన్నాం. వీరు తమ ఇళ్ల నుండి పొలాలకు వెళ్లే సమయంలో కూడా ఒక్కొక్క ఆటోలో 15నుండి 20మంది వరకు కూర్చొని వెళ్లడం అప్పుడప్పుడు ప్రమాదాల్లో పెద్ద సంఖ్యలో చనిపోవడం మనం చూస్తున్నాము.

మహిళా రైతులు వ్యవసాయంలో 70 శాతం పైగా పనులను చేస్తున్నారు. కాబట్టి 70శాతం సంపద వీరిది కావాలి. కానీ ఇందుకు భిన్నంగా వీరికి వ్యాధులు దక్కుతున్నాయి. మొక్కలకు కలుపు తీసే క్రమంలో, విత్తనం వేసేటప్పుడు భూమిని తాకుతూ, నేలకు సమీపంగా ఉంటారు. పొలంలో జల్లిన రసాయనిక ఎరువుల, రసాయన క్రిమిసంహారకాల దుష్ప్రభావం నేరుగా వీరి శరీరాన్ని తాకుతూ, వీరికి అనారోగ్యం కల్పిస్తున్నది. దీనితో పురుషుల కన్నా వీరు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారు.



ఇప్పటివరకు దీనిపైన సరియైన అధ్యయనం లేదు. అలాగే ఆరోగ్యం నష్టం కలగకుండా ఉండడానికి, రక్షణ చర్యల గురించి ప్రభుత్వాలుగానీ, సంస్థలుగాని, రసాయనిక కంపెనీలవారు గాని ఎటువంటి ప్రయత్నాలు చేయడంలేదు. అసలు ఇటువంటి సమస్య ఉన్నదని, దానివల్ల మహిళా రైతులు అనారోగ్యానికి గురవుతున్నారనే విషయం ఇప్పటివరకు గుర్తించలేదు. ఏదైనా సమస్యను గుర్తించినప్పుడు, దానిని సంబంధిత శాస్త్రజ్ఞుల ముందు పెట్టి దాని నివారణకు, వారి రక్షణకు తగిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. కానీ సమస్యనే గుర్తించనప్పుడు, రక్షణచర్యల మాట ఎక్కడిది? రసాయనిక ఎరువులు, పురుగు మందుల స్పర్శవల్ల చర్మ సమస్యలు, ఊపిరితిత్తుల, కాలేయానికి సంబంధించిన క్యాన్సర్,చూపునకు సంబంధించిన సమస్యలు, ఇలా ఎన్నో అనారోగ్యాలకు మహిళా

రైతులు గురవ్వడంతో పాటు గర్భధారణ సమస్యలకు కూడా లోనవుతున్నారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం. దీనిపైన కనీసం ఈ అంతర్జాతీయ మహిళా సంవత్సరం సందర్భంగానైనా అధ్యయనం చేసి తగిన నివారణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అన్నివర్గాలపైన, సభ్య సమాజం పైన ఉన్నది.

తాము అధికారంలో లేనప్పుడు వ్యవసాయ రంగంలో జరుగుతున్న దోపిడీ గురించి రాజకీయ పార్టీలు మాట్లాడతాయి, ఉద్యమాలు కూడా చేస్తాయి. ఒకవైపు రైతు సంక్షోభంలో ఉన్నాడు అని అంటూనే ఇంకొక వైపు రైతు పండించిన ఉత్పత్తులకు సరియైన ధర రాకుండా వ్యతిరేకదిశలో తమ ఉద్యమాలను నడుపుతాయి. కానీ ఇదే రాజకీయ పార్టీలు ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి రైతాంగాన్ని ఆర్థికంగా బలహీనంచేస్తాయి. దానికి వత్తాసుగా మీడియాకూడా ఉంటుంది. కాలాలను గుణంగా ఏ కొంచెం వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగినా మీడియా... కొనేటట్లు, తినేటట్టు లేదని వార్తలు రాస్తుంది. ఎందుకంటే, ఇతర రంగాలనుంచి వచ్చినట్టు, రైతు నుండి మీడియాకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు ఉండవు. కనుక వ్యవసాయ ఉత్పత్తుల ధరలకు వ్యతిరేకంగా వీరు అధిక ప్రయోజనం ఇచ్చి అతిశయోక్తులతో వార్తలు ప్రసారం చేస్తారు.

1960 ప్రాంతాల్లో దేశంలో వ్యవసాయ ఉత్పత్తులకొరత కొంత ఉండేది. కానీ ఆహార ధాన్యాలను వినియోగించుకునే విధానం చాలా పొదుపుగా జొన్నలు, సజ్జలు, అంబలి, బియ్యం లాంటి ద్వారా గంజి చేసుకొని ప్రాణాలు దక్కించుకున్నారు. నిజానికి,దైనందిన జీవితంలో మనిషి తన కుటుంబంకోసం చేసేఖర్చులో ఆహార ధాన్యాలకు 25% కంటే మించదు. అయినా స్వల్ప ధరల పెరుగుదలకి గగ్గోలు పెడతారు.

ప్రజలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడానికి ఆహార ధాన్యాల ధరలు కారణం కాదు. వ్యక్తిగత ప్రతిష్ట కొరకు వెళ్లి తప్పనిసరి కానీ ఎన్నో వస్తువులను ఫోను టీవీలను కొనడమే కాకుండా ప్రతి చిన్న సందర్భానికి కూడా ఎంతో డబ్బులు ఖర్చు చేసి ఫంక్షన్లు చేయడము, మద్యపానం లాంటి వాటితో ప్రజలు ఆర్థిక సంక్షోభంలో కూడకపోతున్నారే తప్ప ఆహార ధాన్యాల పెరుగుదలతో మాత్రం కాదు. అనవసర ఖర్చుల వల్ల ఎలా నష్టపోతున్నాము దాన్నుంచి ఎలా తప్పించుకోవచ్చు అనే మార్గాలు వెతుక్కోవాలి. సుమారు 80 కోట్లమందికి ప్రభుత్వం కనీస ఆహారాన్ని దాదాపు ఉచితంగా సరఫరా చేస్తున్నది. ప్రస్తుతం సమాజంలో ఇతర వస్తువులతో పోల్చితే అతి తక్కువ ధరకు ఆహారధాన్యాలు అందుబాటులో ఉన్నాయి. అదే విద్య, వైద్యం కొరకు వాటి ధరలు గతంలో కన్నా కొన్నివందల వేల రేట్లు పెరిగిన దానిపైన ఎవరు ఉద్యమాలు చేయరు దానికి వ్యతిరేకంగా మీడియా కూడా మాట్లాడదు. ఎందుకంటే మీడియా నడవడానికి సంబంధించిన వ్యాపార ప్రకటనలకు ఆ రంగాల నుంచి డబ్బు సమకూర్చుకుంటారు కనుక ఆ రంగం చేస్తున్న దోపిడీని వీరు సమాజం ముందు పెట్టరు. ప్రజలు ఆర్థిక సంక్షోభంలో కూరుకపోవడానికి ప్రధాన కారణాలైన విద్యా,వైద్యంనుండి ప్రభుత్వరంగం దాదాపుగా తప్పుకున్నది.కానీ, మహిళారైతుల కష్టంతో ఉత్పత్తవుతున్న వ్యవసాయ ఉత్పత్తులను, ఆహార ధాన్యాల ధరలు పెరుగు తున్నాయని వారిపైన నెపం నెట్టి ధరలు తగ్గించి ఆర్థికంగా రైతాంగానికి నష్టంచేసే ప్రయత్నం ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సమాజం, ముఖ్యంగా మీడియా చేయకూడదని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాం.

సంఘటిత రంగంలో ఉన్న మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు లాంటి సౌకర్యాలు ఉంటాయి. వ్యవసాయరంగంలో ఉన్న మహిళా కూలీలకు కానీ మహిళా రైతులకు కానీ అటువంటి పరిస్థితుల్లో ఎటువంటి వెసులుబాటు ఉండదు. నిత్యం పనిచేస్తేనే వ్యవసాయం నడుస్తుంది. ముఖ్యంగా పశు పోషణలో ఈ అవకాశం అసలే లేదు. మహిళా రైతులు గర్భం దాల్చిననాటి నుండి ప్రసూతి అయినా, ఇతర ఏ సమస్యతో బాధపడుతున్నా వ్యవసాయంలోని కొన్ని పనులు చేయడం వలన తీవ్రఅనారోగ్యానికి గురవుతున్నారు. ఇటువంటి సందర్భాల్లో వారికి ఆదాయం సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉన్నది. కనీసం ఈ అంతర్జాతీయ మహిళారైతుల సంవత్సరం సందర్భంగా మహిళా రైతుల సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన సమాజం అందరి పైన ఉన్నది.

అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరం సందర్భంగా భారతీయ కిసాన్‌సంఘ్(బీకేఎస్) ఆధ్వర్యంలో దేశమంతటా మహిళా రైతుల సదస్సులు, సమ్మేళనాలు జరుగుచున్నాయి. అందులో భాగంగా జూలై 28న కామారెడ్డిలో మహిళారైతు కుటుంబాల సమ్మేళనం విజయవంతంగా జరిగింది. ఇందులో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి ఉడుముల లావణ్య, రాష్ట్ర మహిళాప్రముఖ్ శ్రీమతి ప్రముఖ, జిల్లా మహిళాప్రముఖ్ శ్రీమతి ఈగ విజయలక్ష్మి, బీకేఎస్ క్షేత్ర సంఘటనమంత్రి దోనూరు రాము, అఖిలభారత కార్యకారిణిసభ్యుడు ముదుగంటటి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో జరిగిన మహిళా రైతుల సదస్సులో బీకేఎస్ అఖిల భారత సంఘటనమంత్రి దినేష్ దత్తాత్రేయ కులకర్ణి, ఉడుముల లావణ్య, రాష్ట్ర, జిల్లా బీకేఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ★



**భాగ్యనగర్ :** సేవాభారతి డా. హెడ్గేవార్ బ్లడ్ సెంటర్, కేశవ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ సైన్సెస్, నారాయణగూడ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 31న కళాశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ వి.స్రవంతి ప్రారంభించారు. ఈ శిబిరంలో కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డా. ఎమ్ నాగేశ్వరరావు,సేవాభారతి కార్యవర్గసభ్యులు పోటు శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానంచేశారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# బాల జాగృతి

## కర్ణుడి దానగుణం | కథ



మహాభారతంలో దానకర్ణుడిగా ప్రసిద్ధుడు. అతను సహజ కవచ కుండలాలతో జన్మించాడు. ప్రతిరోజూ సూర్యారాధన చేసిన తర్వాత ఎవరు ఏమి అడిగినా లేదనకుండా ఇచ్చేవాడు. ఖాళీ చేతులతో పంపించేవాడు కాదు.

కర్ణుడికి గల సహజ కవచ కుండలాల కారణంగా ఆయనను యుద్ధంలో ఓడించడం అసాధ్యం. అవి ఆయన వద్ద ఉన్నంత వరకు తన వరపుత్రుడు అర్జునుడి విజయం కష్టమని కురుక్షేత్రం యుద్ధ సమయంలో దేవేంద్రుడు గుర్తించాడు. అందుకే ఇంద్రుడు బ్రాహ్మణుడి వేషంలో కర్ణుడి దగ్గరకు వెళ్లాడు. దానం చేయడానికి సిద్ధంగా ఉన్న కర్ణుడిని సమీపించి, “నీ కవచ కుండలాలను దానం చేయి” అని అర్థించాడు.

కర్ణుడు క్షణం ఆలోచించాడు. అవి సాధారణ ఆభరణాలు కావు. తన శరీరంతో కలిసిపోయిన సహజ రక్షణ కవచాలు. వాటిని ఇస్తే తన ప్రాణానికే ప్రమాదం అని తెలుసు. అయినప్పటికీ, ‘దేహీ’అని వచ్చిన వారిని నిరాశపరచని ఆయన, వాటిని దానం చేయడానికి నిర్ణయించుకున్నాడు.

తన కవచ కుండలాలను కోసి ఆ బ్రాహ్మణ రూపంలో ఉన్న దేవేంద్రుడికి దానం చేశాడు. కర్ణుడి దానగుణాన్ని చూసి ఇంద్రుడు ఆశ్చర్యపోయాడు.

తన నిజ రూపంలో ప్రత్యక్షమై, అతని త్యాగానికి ప్రతిఫలంగా శక్తి అనే దివ్యాయుధాన్ని ఇచ్చాడు. కర్ణుడి ఈ దానం అతని గొప్ప మనసుకు నిదర్శనం. ★

## మంచిమాట

**విశ్వాసం, ఉత్సాహం అనేవి గెలుపుకి రెక్కల వంటివి!**



## మెదడుకు మేత



**రెక్కలు లేవు కానీ ఆకాశంలో ఎగురుతుంది.. ఏమిటది?**

జవాబు : మేఘం

## పద్యం

**లావుగలవానికంటెను
భావింపగ నీతిపరుడు బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాడెక్కినట్లు మహిలో సుమతీ**

**భావం :** శరీరం బలంగా ఉన్నవాడే నిజమైన బలవంతుడు కాదు. నీతి, తెలివి, ధర్మంతో నడిచేవాడు సమాజంలో మరింత గొప్పవాడవుతాడు. పెద్ద ఏనుగును చిన్న మావటివాడు అదుపు చేసినట్టే, నీతిగల వాడు బలవంతుడిని కూడా జయించగలడు.

## శ్లోకం

**దైవే తీర్థే ద్విజే మంత్రే దైవజ్ఞే భిషజే గురౌ
యాదృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ**

**భావం :** దైవం, పురోహితుడు, మంత్రజపం, జ్యోతిష్యులు, వైద్యుడు, గురువులపై మనకు ఉన్న దృఢవిశ్వాసం, నిర్మలత్వాన్ని బట్టే ఫలితం ఉంటుందని పెద్దల మాట.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.


| | |
|---|---|
| గుర్రం | విశ్వాసం |
| కుక్క | ధైర్యం |
| సింహం | అందం |
| ఏనుగు | వేగం |
| నెమలి | బలం |

సమాధానాలు : గుర్రం–వేగం; కుక్క–విశ్వాసం; సింహం–ధైర్యం; ఏనుగు–బలం; నెమలి–అందం.

## శాస్త్రవేత్తలు

### అలెగ్జాండర్ ఫ్లెమింగ్

**(ఆగస్టు 6, 1881 – మార్చి 11, 1955)**



స్కాట్లాండుకు చెందిన జీవ శాస్త్రవేత్త, వైద్యుడు. 1923లో ఎంజైములు, లైసోజైములు, 1928లో కనుగొన్న ప్రపంచ మొట్టమొదటి యాంటీబయోటిక్ పెన్సిలిన్ ఈయన పరిశోధనల్లో ముఖ్యమైనవి. పెన్సిలిన్ కనుగొన్నందుకు ఆయన 1945లో హోవర్డ్ ఫ్లోరే, ఎర్నెస్ట్ బోరిస్ చైన్‌లతో కలిసి వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నాడు.

## జనరల్ నాలెడ్జ్

1. తేనెటీగల పెంపకాన్ని ఏమంటారు?
2. శ్వేత విప్లవం దేనికి సంబంధించింది?
3. 'పద్మశ్రీ' గెలుచుకున్న తొలి నటి?

జవాబులు : 1. ఎపి కల్చర్; 2. పాలు; 3. నర్గీస్ దత్

## భక్తాగ్రేసరులు

### రంగాజమ్మ



రంగాజమ్మ (రంగాజీ) బహుభాషా విశారద. పసుపులేటి వెంకటాద్రి, మంగమాంబ దంపతులకు జన్మించారు. తంజావూరు రాజు విజయరాఘవుని ఆస్థాన కవయిత్రులలో అగ్రగామి. 'మన్నారుదాస విలాసం' నాటకం, 'మన్నారుదాస విలాసం' యక్షగానం, 'ఉషాపరిణయం' ప్రబంధం, రామాయణ, భాగవత, భారత సంగ్రహాలను రాశారు. తమ రచనలను విజయ రాఘవునికి అంకితం చేశారు. ఆమె రచనల్లో పాటలు, పదాలు, దరువులు కూడా ఉన్నాయి. తంజావూరు నాయకరాజుల నాటి ఆచార వ్యవహారాలు, అంతఃపుర కార్యకలాపాలు, జనజీవితాలకు, తిరువీధులు, వినోదాలు, పండిత వివాదాలకు ఆమె రచనలు దర్పణాలు. తెలుగు సాహిత్యచరిత్రలో తొలిసారి కనకాభిషేకం అందుకున్న కవయిత్రి. కవితాప్రియుడైన విజయరాఘవుడు ఆమెను భార్యగా స్వీకరించాడు.




# వారఫలాలు

10-16 ఆగస్ట్, 2026



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

బంధువులతో సత్సంబంధాలు. విద్యార్థులకు కొత్తఆశలు. వాహనాలు, భూములు కొనుగోలు. ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులు లాభాలు ఆశించినంతగా అందుకుంటారు. ఉద్యోగులకు విశేషమైన కాలం. పారిశ్రామిక వేత్తలకు కీలక సమాచారం. కళాకారులు, రచయితలకు ఆదరణ. 13,14 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. కుటుంబంలో చికాకులు. ఆంజనేయ దండకం పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఇంటి నిర్మాణయత్నాలు నిలిపివేస్తారు. విద్యార్థులు ఎంత కష్టించినా ఫలితం కనిపించదు. ఆస్తుల వివాదాలు చికాకు పరుస్తాయి. వ్యాపారులకు కొద్దిపాటి లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులు పని భారంతో సతమతమవుతారు. పారిశ్రామికవేత్తలకు నిరాశాజనకంగా ఉంటుంది. కళాకారులు, రచయితలకు గందరగోళ పరిస్థితి తప్పక పోవచ్చు. 12,13 తేదీలలో శుభవార్తలు, నూతన పరిచయాలు. ధనలబ్ధి. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. కుటుంబంలో సమస్యలు, ఒత్తిడులు తొలగుతాయి. వాహనాలు, భూములు కొనుగోలు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు భాగస్వాములతో సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు. రాజకీయవేత్తలకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు చిక్కులు తొలగుతాయి.15,16 తేదీల్లో దూర ప్రయాణాలు. వృథాఖర్చులు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

సమాజంలో మరింత గౌరవం పొందుతారు. కీలక నిర్ణయాలు తీసుకుని అందర్నీ ఆశ్చర్య పరుస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహన యోగం. వ్యాపారులు కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. కళాకారులకు అవకాశాలు పెరుగుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు గతం కంటే మెరుగైన పరిస్థితి ఉంటుంది. 10,11 తేదీల్లో వృథాఖర్చులు. ప్రయాణాలు రద్దు. మానసిక అశాంతి. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆరోగ్యం కొంత మందగించినా ఉపశమనం లభిస్తుంది. భూవివాదాల నుంచి గట్టెక్కుతారు. వ్యాపారుల కృషి ఫలించి లాభాలు అందుతాయి. ఉద్యోగులకు కొత్త పోస్టులు రావచ్చు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులకు అనూహ్యమైన ప్రగతి కనిపిస్తుంది. రచయితలు సత్తా చాటుకుంటారు. 14,15 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. స్నేహితుల నుంచి ఒత్తిడులు. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఒక కోర్టు వ్యవహారం అనుకూలంగా పరిష్కారమవుతుంది. వాహనయోగం. వ్యాపారులకు పెట్టుబడులు సమయానికి అందుతాయి. ఉద్యోగులకు కొత్త పోస్టులు దక్కుతాయి. పారిశ్రామికవేత్తల శ్రమ ఫలిస్తుంది. కళాకారులు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 13,14 తేదీల్లో అనారోగ్యం. స్నేహితులతో తగాదాలు. గణేశాష్టకం పఠించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

కుటుంబంలో ఒత్తిడులు తగ్గుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు పెట్టుబడుల్లో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగులకు పైస్థాయి వారి సహాయసహకారాలు అందుకుంటారు. రాజకీయవేత్తలకు ఆటుపోట్లు తొలగుతాయి. పరిశోధకులు, రచయితల ఆశలు ఫలిస్తాయి. 11,12 తేదీల్లో కుటుంబంలో చికాకులు. మానసిక ఆందోళన. ఆదిత్య హృదయం పఠించండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తికి సంబంధించిన ఒప్పందాలు చేసుకుంటారు. వ్యాపారుల యత్నాలు సఫలం. ఉద్యోగుల సమర్థత వెలుగులోకి వస్తుంది. కళాకారులకు అన్ని విధాలా అనుకూల సమయం. రచయితలు, క్రీడాకారులు విశేష కీర్తి పొందుతారు. 10,11 తేదీలలో ఖర్చులు అధికమవుతాయి. దూరప్రయాణాలు. విష్ణు సహస్ర నామ పారాయణ చేయండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

విద్యార్థుల ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. కొన్ని సంఘటనలు ఆశ్చర్యపరుస్తాయి. కార్యక్రమాలు అనుకున్నవిధంగా పూర్తి చేస్తారు. దేవాలయాలు వాహనయోగం. రాజకీయవేత్తలకు అవకాశాలు పెరుగుతాయి. రచయితలు, పరిశోధకులకు ఆహ్వానాలు సంతోషం కలిగిస్తాయి. 13,14 తేదీలలో వృథా ఖర్చులు. అనారోగ్యం. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

అప్పులు తీరే సమయం. కుటుంబసభ్యులతో మనస్పర్థలు తొలగుతాయి. అరుదైన ఆహ్వానాలు రాగలవు. మీ అభిప్రాయాలను బంధువులకు నిర్భయంగా తెలియజేస్తారు. వ్యాపారులకు మరింత ఉత్సాహంగా ఉంటుంది. ఉద్యోగులకు ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. పారిశ్రామికవేత్తలకు నూతనోత్సాహం. 15,16 తేదీలలో మానసిక అశాంతి. కుటుంబంలో సమస్యలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆరోగ్యం కొంత ఇబ్బందిపెట్టవచ్చు. చిన్ననాటి స్నేహితులతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తారు. వ్యాపారులకు చికాకులు తొలగుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు కొంత పెరుగుతాయి. పారిశ్రామికవేత్తలకు ఒత్తిడులు తొలగుతాయి. రచయితలు, క్రీడాకారులకు ఆహ్వానాలు అందుతాయి. 11,12 తేదీల్లో వృథా ఖర్చులు. బంధువులతో విరోధాలు. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

కొన్ని సమావేశాలలో పాల్గొంటారు. ఆదాయం గతంతో పోలిస్తే మెరుగుపడుతుంది. యుక్తితో కొన్ని సమస్యలు పరిష్కరించుకుంటారు. వ్యాపారులు లాభాలబాట పడతారు. ఉద్యోగస్తులకు గందరగోళ పరిస్థితులు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు అనుకున్నది సాధిస్తారు. కళాకారులు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 10,11 తేదీల్లో వృథా ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. శివపంచాక్షరి పఠించండి.

# పదరసం-576

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | 4 | | 5 | | 6 |
| | | 7 | | | 8 | | | | |
| 9 | | | | 10 | | | 11 | 12 | |
| | | 13 | | | | | | | |
| 14 | 15 | | | | | | 16 | | 17 |
| 18 | | | 19 | | 20 | | | 21 | |
| | | 22 | | | | | 23 | | |
| | 24 | | | | 25 | | | 26 | |
| 27 | | | | 28 | | | 29 | | 30 |
| 31 | | | 32 | | | 33 | | | |

## ఆధారాలు

**అడ్డం**

1. చిన్న సాయాన్ని ఈ ప్రాణితో పోలుస్తారు (3)
2. చిత్రకారుడి ప్రధాన సాధనం (2)
5. తక్కువ, లోపం (3)
7. న్యాయపరిభాషలో ఆజ్ఞ (2)
8. ఈ దేవి కాకతీయరాణి (3)
9. పదవ నక్షత్రం (2)
10. నాలుగోవంతు (2)
11. మహేశ్వరుడు (3)
13. భూస్వాములు...(4)
14. శబ్దం (3)
16 విద్య, నేర్వడం (3)
18. కేశాల అల్లిక, వేణి (2)
19. మూషికాలే... (4)
21. మొర..అటు నుంచి (2)
22. దీనిని ఎరిగి వాత పెట్టాలట (2)
25. శౌర్యం (4)
27. ఆంధ్ర ఊటీ అని పేరు (3)
28. వ్యాయామం (2)
29. అన్న భార్య (3)
31. మండూకం... అటు గెంతింది (2)
32. ఆకాశం, స్వర్గం (2)
33. ప్రతిమ, విగ్రహం (2)

**నిలువు**

1. పోలిక చెప్పే అలంకారం (3)
2. పొడి కాదు... (2)
4. తటాకాలే... (4)
5. అందం, ప్రాయం (3)
6. చిన్న సోదరుడు (3)
10. పావుకోళ్లు (4)
12. దుష్టద్యుమ్నుడి తండ్రి (4)
13. కలకత్తాలోని అమ్మవారు (2)
14. వెండి (3)
15. గారె (2)
17. ఆవులు...చెల్లాచెదరయ్యాయి (3)
19. భల్లూకం (3)
20. ఒక నృత్య విశేషం ప్రక్రియ... ఆభరణం (4)
23. రాజులకే రాజు (4)
24. నాగలి (3)
26. జనం, ప్రజలు (2)
27. అక్క/తండ్రిని ఇలానూ పిలుస్తారు (2)
28. తాళం చెవి (2)
30. నటుడికి వ్యతిరేకం (2)

## పదరసం - 575 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మృ | గ | | 2 జ | లం | | 3 గి | | 4 మో | వి |
| గ | | 5 రో | మ | | 6 ప | రి | 7 హో | సం | |
| 8 శి | బి | | 9 ద | శా | ర | | రం | | 10 ప |
| ర | | 11 అ | గ్ని | | 12 కా | కి | | 13 అ | క్షి |
| | 14 మ | తి | | 15 పా | య | | 16 మే | ను | |
| 17 ల | గ్గం | | 18 బా | వ | | 19 సి | | 20 మా | వి |
| వ | | 21 సి | | ని | | 22 పా | 23 వ | నం | |
| కు | | 24 గ | 25 అం | | 26 పా | యి | రూ | | 27 అ |
| 28 శు | కం | | గ | | వు | | ధి | | క్ర |
| లు | | 29 గ | డి | యా | రం | | 30 ని | గ | మం |




**తెలుగు సినిమా రంగంలో నట వారసత్వానికి కొదవలేదు. స్టార్ హీరోల కొడుకులే కాదు సాంకేతిక నిపుణుల పిల్లలూ నటులుగా రాణించడానికి తహతహలాడు తుంటారు. వారసత్వంతో ఎవరు ఎంత ప్రయత్నించినా... ప్రతిభ, పట్టుదల, కృషి, కాస్తంత అదృష్టం ఉన్న వారే రాణిస్తుంటారు.**

# తడబడ్డ కృష్ణ మనవడి




వారసత్వంతో వచ్చే వారి మొదటి సినిమా ఓ రకంగా నల్లేరు మీద బండి నడక కావచ్చు కానీ నిలబడి గెలవడం చాలా చాలా కష్టం. తాజాగా కృష్ణ మనవడు, రమేష్ బాబు కొడుకు జైకృష్ణ 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో తన అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం చేశాడు. అతనికున్న నేపథ్యం కారణంగా సినిమా అవకాశం తేలికగానే లభించింది. అశ్వనీదత్, పి. కిరణ్ లాంటి నిర్మాతలు అతనితో మూవీ నిర్మించడానికి ముందుకొచ్చారు. తొలి చిత్రం 'ఆర్.ఎక్స్. 100' దర్శకుడిగా సత్తా చాటుకున్న అజయ్ భూపతి దీనిని తెరకెక్కించాడు. తెలుగులో పలు చిత్రాలలో నటించిన మేటి బాలీవుడ్ నటీమణి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని తెలుగులో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. కృష్ణ మనవడిగా జనం ముందుకు వచ్చిన జైకృష్ణ తొలి చిత్రం కథ ఎంపికలో మాత్రం తడబడ్డాడు.

**ఈ సినిమా కథ విషయానికి వస్తే...** తిరుపతిలో పెద్దిరెడ్డి (కిక్ శ్యామ్) చెప్పిందే వేదం. అతని రౌడీయిజానికి భయపడి ఎవరూ ఎదురు మాట్లాడరు. ఉద్యోగం కోసం బళ్లారి నుంచి తిరుపతికి వచ్చిన శ్రీను (జైకృష్ణ) పెద్దిరెడ్డి కుమార్తె మంగను చూసిన వెంటనే ప్రేమలో పడిపోతాడు. ఆమెను ఎలాగైనా పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. పెద్దిరెడ్డి క్రూరత్వం గురించి తెలిసిన కొందరు అతన్ని వారించినా, వెనకడుగు వేసే ప్రసక్తి లేదంటాడు. మంగకు గల చిన్న పాటి వైకల్యాన్ని తొలగించి, ఆమె కూడా అతని పట్ల ఆకర్షితురాలయ్యేలా చేస్తాడు. అదే సమయంలో మంగకు వేరే వారితో నిశ్చితార్థం జరుగుతుంది. పెద్దలు చూపించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలో, ఇష్టపడిన శ్రీనును చేసుకోవాలో తేల్చుకోలేక సతమతమౌతుంటుంది. పెళ్లి ఏర్పాట్ల కోసం బళ్లారి నుంచి వచ్చిన మంగ మేనత్త అక్కడ శ్రీనును చూసి కంగుతుంటుంది? 'వాసుబాబు ఇది కరెక్ట్ కాదు... మా అన్నయ్య నిన్ను బతకనివ్వడు, తిరుపతి నుంచి వెళ్లిపో' అని వేడుకుంటుంది. శ్రీనును ఆమె 'వాసుబాబు' అని ఎందుకు సంభోదించింది? అతని నేపథ్యం ఏమిటీ? బళ్లారిలో అతని కుటుంబానికి ఉన్న పరపతి ఎలాంటిది? తిరుపతి వచ్చి మంగను ప్రేమలోకి దించి, ఆమెను వివాహం చేసుకోవాలని శ్రీను ఎందుకు అనుకున్నాడు? అనేది మిగతా కథ.

హిందీలో గతంలో వచ్చిన 'ఇషాక్‌జాదే' మూవీలోని కోర్ పాయింట్‌ను తీసుకుని, దాన్ని కాస్తంత అటూ ఇటూ మార్చి దర్శకుడు అజయ్ భూపతి ఈ కథను రాసుకున్నాడు. తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా తిరుపతి, బళ్లారి నేపథ్యాన్ని ఎంచుకున్నాడు. చిత్రం ఏమంటే... గతాన్ని మర్చిపోయిన హీరోయిన్ల చిత్రాలు తెలుగులో కొత్త కాదు. 'వసంత కోకిల' అలాంటి సినిమాలకు ల్యాండ్ మార్క్ అనుకుంటే... దానికి ముందు, తర్వాత కూడా చాలానే సినిమాలు వచ్చాయి. దాంతో హీరోయిన్ నేపథ్యంలో ప్రేక్షకులకు ఎలాంటి కొత్తదనం కనిపించదు. ఇక బాగా అంగబలం, అర్థబలం ఉన్న హీరో... తన ప్రేమను గెలిపించుకోవడానికి సామాన్యుడిగా హీరోయిన్ ఇంటిలో పనిచేయడం అనే కాన్సెప్ట్‌లోనూ చాలానే సినిమాలు వచ్చాయి. ఇలా కథలో కొత్తదనం లేకపోవడం ఈ సినిమాకు సంబంధించి ప్రధానమైన లోటు. కనీసం సన్నివేశాలైనా కొత్తగా తీశారా? అంటే అదీ లేదు. ప్రతి సన్నివేశం గతంలో మనం ఏదో ఒక సినిమాలో చూసిన భావనే కలుగుతుంది. హీరో, హీరోయిన్‌ను బళ్లారిలో రక్షించే సన్నివేశం 'పోకిరి'లోని గోల్కొండ పోర్ట్ యాక్షన్ సీన్‌ను గుర్తు చేస్తుంది. ద్వితీయార్థంలో హీరోయిన్ గతాన్ని రివీల్ చేసిన విధానం, హీరో నేపథ్యం అవన్నీ పరమ రొటీన్‌గా ఉన్నాయి. సినిమాలో సీనియర్ నటీనటులు చాలామందే ఉన్నా.. వారిని దర్శకుడు సరిగ్గా ఉపయోగించుకోలేదని పిస్తుంది. బ్రహ్మాజీ, నరేశ్ పాత్రలకు ఇచ్చిన బిల్డప్ కు తగ్గట్టుగా ఆ తర్వాత వారి పాత్రను చూపించలేదు. మరో సీనియర్ నటుడు మోహన్ బాబు విషయం లోనూ అదే జరిగింది. హీరో తాత పాత్రకు ఆయన్ని పరిమితం చేసేశారు. సెకండ్ హాఫ్‌లో ఎంట్రీ ఇచ్చే ఈ పాత్ర నాలుగైదు సన్నివేశాలకు మాత్రమే పరిమితమైపోయింది. బళ్లారిలో ఆయన కుటుంబ సభ్యులతోనే ఉన్న వైరం కూడా చాలా సాధారణంగా ఉంది. నిజానికి ఇలాంటి సినిమాల్లో బలమైన విలన్ ఉంటే... హీరో పాత్ర ఎలివేట్ అయి ఉండేది. కానీ ఇందులో అలా చెప్పుకోవడానికి ఎవరూ లేరు. దాంతో ఇదో రొటీన్ లవ్, యాక్షన్ డ్రామా అయిపోయింది.

నటీనటుల విషయానికి వస్తే... మొదటి చిత్రమే అయినా జైకృష్ణ బాగానే కష్టపడ్డాడు. సహజంగా ఇలాంటి వారసుల తొలి చిత్రంలో వాళ్ళకు వచ్చిన విద్యలన్నీ ప్రదర్శించే పని చేస్తుంటారు దర్శకులు. అదృష్టం బాగుండి అలాంటివేమీ ఇందులో చేయలేదు. కాస్తంత యాక్షన్, కాస్తంత లవ్, కొద్దిగా కామెడీ, ఇంకొంత సెంటిమెంట్‌తో ఈ పాత్రను రక్తికట్టించే ప్రయత్నం చేశారు.అందులో జైకృష్ణ ఓ మేరరు సఫలీకృతుడయ్యాడు. హీరోయిన్ రాషా తడనీ తన పాత్ర పరిధి మేరకు చేసింది. కిక్ శ్యామ్‌కు ఇలాంటి పాత్రలు అలవాటే. అలానే మోహన్ బాబు వెంకటప్పయ్య నాయుడిగా బాగా చేశారు. కానీ వయోభారం తెర మీద కనిపిస్తోంది. సెమీ విలన్ పాత్రలో వడ్లమాని శ్రీనివాస్ మెప్పించారు. హీరోయిన్ గా అత్త పాత్రలో వాసుకీ, ఇతర పాత్రల్లో శ్రీతేజ్, అజయ్ బాగానే సెట్ అయ్యారు. జీవీ ప్రకాశ్ కుమార్ సమకూర్చిన పాటలు,నేపథ్య సంగీతం బాగున్నాయి. జయకృష్ణ సినిమాటోగ్రఫీ చక్కగా ఉంది. రియల్ సతీశ్ ఫైట్స్ అలరించేలా ఉన్నాయి. ఇలా రొటీన్ కథ కాకుండా కాస్తంత వైవిధ్యం ఉన్న దానిని తీసుకుని ఉంటే... జయాపజయాలతో సంబంధం లేకుండా జైకృష్ణ భవిష్యత్తులో చెప్పుకోవడానికి బాగుండేది.

**– అరుణ,** సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్










# భోగాపురం వైభోగం


From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 43


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-




వెల : ₹.60/-



వెల : ₹.270/-




వెల : ₹.80/-




వెల : ₹.54/-




వెల : ₹.120



వెల : ₹.80




వెల : ₹.250/-



వెల : ₹.180/-



వెల : ₹.200/-




వెల:₹.999/- సెట్




వెల:₹.450/-



వెల :₹.200/-



వెల : ₹.900/-



వెల : ₹.350/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687


Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01